TARAJYOTHI TELUGU DAILY
# తారాజ్యోతి
తెలుగుదిన పత్రిక
చీఫ్ ఎడిటర్ : డాక్టర్ జె.బి.ఎల్

| శుక్రవారం, మార్చి 13, 2026 | సంపుటి - 20 | సంచిక 182 | వెల - 4రూ | పేజీలు - 12 |
|---|---|---|---|---|

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

## 14 నుంచి టెన్త్ పరీక్షలు

- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- సకాలంలో సెంటర్లకు చేరుకోవాలని సూచన
- ఐదు నిముషాల ఆలస్యానికి అనుమతి

హైదరాబాద్ : పదో తరగతి వార్షిక పరీక్షలు ఈ నెల 14 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు అధికా రులు సకల ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షలు శనివారం ప్రారంభమై.. ఏప్రిల్ 16వ తేదీ వరకు జరుగుతాయి. ఉదయం 9.30 గంటలకు పరీక్షలు ప్రారంభం అవుతాయి. 2లో



## డిఫెన్స్ రంగంలో సరికొత్త అధ్యాయం

- జువ్వలదిన్నెలో సాగర్ డిఫెన్స్ సంస్థ ఏర్పాటు
- శంకుస్థాపన చేసిన మంత్రి లోకేశ్
- తొలిదశలో 45కోట్ల పెట్టుబడులు..750మందికి ఉపాధి
- ప్రాజెక్టుకు శంకుస్థాపనపై మంత్రి నారాయణ హర్షం



2



## ఆనాడు ఒక్కడినే.. ఈనాడు కోట్లాదిమంది అండ

- నల్లకాలువ సాక్షిగా ఇచ్చిన హామీ మేరకు పార్టీ స్థాపన
- కోట్లాది మంది ప్రజల గుండెల్లో నిండుగా ఉంది
- పార్టీ ఆవిర్భావ వేడుకల్లో వైఎస్ జగన్

అమరావతి : పార్టీ స్థాపన సమయంలో తాను ఒక్కడినే ఉన్నానని, కానీ ఇప్పుడు కోట్లాది మంది ప్రజల ఆశీర్వాదంతో వైసీపీ ఒక పెద్ద శక్తిగా ఎదిగిందని వైసిపి అధినేత, మాజీ సిఎం జగన్ చెప్పారు. నల్లకాల్వలో ఇచ్చిన మాటే పార్టీ ఆవిర్భావానికి ప్రధాన కారణమైంది. ఆ ఒక్క మాట రాష్ట్ర రాజకీయాల దశ, దిశను మార్చిందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 16వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంది. 2011 మార్చి 12న స్థాపించబడిన వైసీపీ.. ఇప్పుడు 16వ వసంతంలోకి అడుగుపెట్టింది.

తరువాయి 2లో

## జగన్ హయాంలో పెట్టుబడిదారుల పరార్



- రాష్ట్రాన్ని పారిశ్రామిక హబ్‌గా మార్చే యత్నం
- జిల్లాల వారీగా పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలు
- సంపద సృష్టిస్తేనే మెరుగైన సమాజం సాధ్యం
- నీటి వినియోగంలో జాగ్రత్తలు ముఖ్యం
- రెండోరోజు కలెక్టర్ల సదస్సులో సిఎం చంద్రబాబు

అమరావతి : నీటిని సక్రమంగా వినియోగించుకుంటేనే ప్రయోజనం ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. భవిష్యత్ తరాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సచివాలయంలో సీఎం అధ్యక్షతన రెండో రోజు కలెక్టర్ల సదస్సు ప్రారంభమైంది. పెట్టుబడులు, వైద్యం, సూపర్ సిక్స్- సంక్షేమం 2లో

## దేశంలో గ్యాస్ సంక్షోభం

### కీలక సమావేశం నిర్వహించిన హోంశాఖ
### పరిస్థితులపై అధికారుల సమీక్ష

### గ్యాస్ కొరతపై విపక్షాల ఆందోళన

- పార్లమెంటు నుంచి బయటకు చేరిన నిరసనలు
- మకరద్వారం ముందు విపక్ష ఎంపిల నిరసన ప్రదర్శన



*'మోడీజి -ఎల్‌పిజి' అంటూ ప్రతిపక్షాలు గురువారం పార్లమెంటు ఎదుట ఆందోళన చేపట్టారు. కమరిషయల్ ఎల్‌పిజి సిలిండర్ల కొరతపై మోడీ ప్రభుత్వం సమాధానమివ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, డిఎంకె, టిఎంసి, ఎసి సహా పలువురు ఎంపిలు మకరద్వారం ఎదుట ఆందోళన చేపట్టారు.*

న్యూఢిల్లీ : పశ్చిమాసియా సంక్షోభ నేపథ్యంలో దేశంలో వంటగ్యాసు (ఎల్‌పీజీ) ఏజెన్సీల వద్ద ప్రజలు బారులు తీరుతున్నారు. ముఖ్యంగా వాణిజ్య సిలిండర్లను నల్లబజారులో కొనాల్సిన పరిస్థితి తలెత్తింది. నల్ల బజారులో గ్యాస్ విక్రయాలను అరికట్టేందుకు చర్యలు చేపట్టినట్టు కేంద్రం ప్రకటించింది. ఎల్పీజీ సిలిండర్ల బుకింగ్ వ్యవధిని 21రోజుల నుంచి 25 రోజులకు పెంచింది.

### గ్యాస్ కొరతతో హోటళ్లు మూత

- హాస్టళ్ల పరిస్థితి మరింత దారుణం
- ఆర్టీసీ క్రాస్‌రోడ్ బావర్చి మూసివేత
- ప్యారడైజ్ హోటల్ కూడా అదే దుస్థితి
- బ్లాక్ విక్రయాలపై కఠిన చర్యలు తప్పవన్న అధికారులు

2

## యుద్ధ డిమాండ్లను అంగీకరించాల్సిందే

- అప్పుడే యుద్ధ విరమణకు అంగీకరిస్తాం
- ఇరాన్ విషయంలో దుందుడుకు చర్యలు అంగీకరించం
- ప్రపంచానికి తేల్చిచెప్పిన ఇరాన్ నాయకత్వం
- రెండు ట్యాంకర్లపై 'సూసైడ్ బోటు'తో దాడి
- మరిన్ని దాడులు చేస్తామంటూ ట్రంప్ హెచ్చరికలు

2



## నిరసలను లెక్క చేయని అమెరికా అధ్యక్షుడు

- వాణిజ్య సుంకాలపై కోర్టు తీర్పు బేఖాతర్
- సెక్షన్ 301 తో దాడికి దిగబోతున్న ట్రంప్

వాషింగ్టన్ : ప్రపంచ దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎడాపెడా విధించిన సుంకాలు చెల్లవంటూ అగ్రరాజ్య సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన క్రమంలో ట్రంప్ కొత్త ఎత్తులు వేస్తున్నారు. 2లో



## స్పీకర్ నిర్ణయంతో ఏకీభవించిన సుప్రీం

### బిఆర్ఎస్ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు క్లోజ్
### తదుపరి విచారణ అవసరం లేదని వ్యాఖ్య

న్యూఢిల్లీ : తెలంగాణలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు కేసు విచారణ ఎట్టకేలకు ముగిసింది. రాష్ట్ర రాజకీయాల్లో కొన్నిరోజులుగా తీవ్ర కలకలం రేపిన ఈ కేసు విచారణను గురువారం నాడు సుప్రీంకోర్టు ముగించింది. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై నిర్ణీత గడువులోగా నిర్ణయం తీసుకోవాలని చెప్పినా.. స్పీకర్ నిర్ణయం తీసుకోలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కేటీఆర్, బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ గురు వారం విచారణకు రాగా విచారణ కొనసాగించాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్లపై సుదీర్ఘ విచారణ అనంతరం ఉన్నత న్యాయస్థానం తుది తీర్పు వెలువరించింది. 2లో



3

## దేశంలో ఇంధన కొరత లేదు

- తగినన్ని క్రూడాయిల్ నిల్వలు ఉన్నాయి
- రిఫనరీలు పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాయి
- ఎలాంటి సంక్షోభాన్ని అయినా ఎదుర్కొంటాం
- లోక్‌సభలో కేంద్రమంత్రి హర్దీప్ పురి సింగ్ ప్రకటన
- మంత్రిని హేళన చేసూ ఎన్‌స్టీన్ ఫైళ్ల ప్రస్తావనతో గందరగోళం



## తెలంగాణలో కమర్షియల్ సిలిండర్ల కొరత

- నేడు చమురు కంపెనీలతో ప్రభుత్వం చర్చలు
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్ : తెలంగాణలో కమర్షియల్ సిలిండర్ల కొరత వాస్తవమేనని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ..

తరువాయి 2లో



## యాదాద్రీశుడిని దర్శించుకున్న గవర్నర్

- గవర్నర్ శుక్లా దంపతులకు ఘన స్వాగతం
- దర్శనం చేయించి, వేదాశీర్వచనం ఇచ్చిన పండితులు

యాదాద్రి : యాదగిరిగుట్టలో కొలువైన శ్రీలక్ష్మీనర సింహస్వామి వారిని తెలంగాణ నూతన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా దర్శించుకున్నారు. శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దర్శనం కోసం గురువారం ఉదయం యాదగిరి గుట్టకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతోపాటు ఆయన కుటుంబ సభ్యులు చేరుకున్నారు.

తరువాయి 2లో

## హైదరాబాద్‌లో నెట్‌ఫ్లిక్స్ స్టూడియో

### ప్రారంభించిన సిఎం రేవంత్ రెడ్డి
### ఫ్యూచర్‌సిటిలో ఏర్పాటుకు భూమి కేటాయిస్తామని ప్రకటన



హైదరాబాద్ : నెట్‌ఫ్లిక్స్‌ను హైదరాబాద్‌కు ఆహ్వానిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ అన్ని అవకాశాలను కల్పిస్తుందని, తమ ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని చెప్పారు. హైటెక్‌సిటీలోని నెట్‌ఫ్లిక్స్‌కు చెందిన ఐలైన్ స్టూడియోస్ కార్యాలయాన్ని సీఎం రేవంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్యం నుంచే తనకు సినిమాలు అంటే ఇష్టం ఇష్టమన్నారు.

తరువాయి 2లో

## యుద్ధ సంక్షోభంలో భారత్ తొలి విజయం

- హర్మూజ్ జలసంధి నుంచి భారత్‌కు చమురు నౌక
- క్షేమంగా ముంబై తీరం చేరుకున్నషెన్‌లాంగ్
- ఇరాన్ పరోక్ష మద్దతుతో తొలి నౌక రాక

ముంబై : పశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ ఒక చమురు నౌక హర్మూజ్‌ను దాటి భారత్‌కు చేరుకుంది. ఎటువైపు నుంచి క్షిపణి దూసుకొస్తుందో తెలియని ఘర్షణ వాతావ రణంలో జలసంధిని సురక్షితంగా దాటి, ముంబయి పోర్ట్‌కు చేరుకున్న తొలినౌక ఇదే కావడం విశేషం. 3లో

# దేశంలో గ్యాస్ సంక్షోభం

వాణిజ్య సిలిండర్ల సరఫరాను సమీక్షించేందుకు చమురు మంత్రిత్వశాఖ ఓ కమిటీని ఏర్పాటు చేసింది. బుక్ చేసిన రెండున్నర రోజుల వ్యవధిలో గృహ వినియోగదారులకు సిలిండర్ అందజేసే విధానాన్ని కొనసాగిస్తున్నా మని తెలిపింది. వంటగ్యాసు సమస్యపై కేంద్ర ప్రభుత్వం హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ అధ్యక్షతన కీలక సమావేశం నిర్వహించింది. గృహ వినియోగదారులకే అత్యధిక ప్రాధాన్యం ఇచ్చేలా చూడాలంది. ముంబయి, దిల్లీ, బెంగళూరు సహా దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో హోటళ్లు, రెస్టారెంట్లు 'తాత్కాలికంగా' మూతబడటం ప్రారంభమైంది. దేశంలో చమురు, ఎల్పీజీ నిల్వలు సరిపడా ఉన్నాయని కేంద్రం చెబుతున్నప్పటికీ.. పలు ప్రాంతాల్లో కొరత ఆందోళన కలిగిస్తోంది. హోటళ్లు ప్రత్యామ్నాయ ఇంధనంపై దృష్టి సారిస్తున్నాయి. ఆలయాలు, మఠాలపై సైతం వంటగ్యాసు కొరత ప్రభావం కనిపిస్తోంది. అయోధ్యలోని ప్రసిద్ధ అమావా ఆలయంలో 'రామ్ రసోయి' అన్నదాన కేంద్రాన్ని తాత్కాలికంగా మూసివేశారు. మైక్రోవేవ్ అవెన్‌లు, ఇండక్షన్ ప్లేట్ల వాడకం ప్రారంభించాలని ఐఆర్‌సీటీసీ పశ్చిమ జోన్‌లోని కేటరింగ్ యూనిట్లను ఆదేశించింది. 'నామ్ నరేందర్, కామ్ సరెండర్', 'మోడీజి, ఎల్పిజి' అంటూ నినాదాలు చేశారు. ప్రియాంక వాద్రా గాంధీ సహా పలువురు మహిళా ఎంపిలు ఇటుకల పొయ్యిలను ప్రదర్శించారు. ప్రధాని మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేపట్టారు. పశ్చిమాసియా పరిస్థితులు, భారత్‌పై దాని ప్రభావంపై పూర్తి స్థాయిలో చర్చ జరపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. ఈ సందర్భంగా లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ప్రధాని మోడీపై విరుచుకుపడ్డారు. ఎల్‌పిజి కొరతపై ప్రజలు ఆందోళన చెందవద్దని ప్రధాని పేర్కొన్నారని, కానీ 'పూర్తి భిన్నమైన కారణాల'తో ఆయన తీవ్ర ఆందోళన చెందుతున్నారని ఎద్దేవా చేశారు. ఎప్‌స్టీపిన్స్ ఫైల్స్, అదానీ కేసులపై ప్రధాని ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. పార్లమెంటుకు వచ్చేందుకు కూడా మోడీ భయపడుతున్నారని, బుధవారం పార్లమెంటులో ఆయన కుర్చీ ఖాళీగా ఉండటం అందరం చూశామని అన్నారు. ప్రజలకు ఆందోళన చెందవద్దని చెబుతున్నారని, కానీ ఆయన ఆందోళనకు గురవుతన్నారన్నది స్పష్టమౌతోందని అన్నారు. గ్యాస్‌పై అబద్ధాలాడుతున్న మోదీ సర్కారుగ్యాస్ కొరత విషయంలో కేంద్రం తీరుపై కాంగ్రెస్ మండిపడింది. వాస్తవాన్ని ప్రజలకు చెప్పకుండా మోదీ సర్కారు అబద్ధమాడుతోందని కాంగ్రెస్ నాయకులు దుయ్యబట్టారు. ఎల్‌పీజీ కొరతపై సభలో చర్చకు డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ సభ్యులు పార్లమెంటు ముందు ప్రదర్శన నిర్వహించారు.

## గ్యాస్ కొరతతో హోటళ్లు మూత

హైదరాబాద్ : వంటగ్యాస్ కొరత హోటల్ పరిశ్రమను అతలాకుతలం చేస్తోంది. ఇక్కడ హాస్టళ్లో ఉంటూ చదువుకుంటున్న వారు తీవ్ర ఇబ్బందులకు గురయ్యే దుర్భర పరిస్థితి నెలకొంది. అలాగే హోటల పరిశ్రమపై ఆధారపడ్డ నిరుద్యోగులు కూడా ఆందోళన చెందుతున్నారు. మహానగరంలో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరా నిలిచిపోయింది. వంటగ్యాస్ సిలిండర్ల సమస్య పరిష్కారానికి ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కె. శ్రీనివాస్ తెలిపారు. సిలిండర్లను అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయిల్ కంపెనీలకు ఆదేశాలు జారీ చేశామని, ప్రజలు ఆందోళన చెందవద్దన్నారు. నెలకు ఒక సిలిండర్ బుకింగ్ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. పశ్చిమాసియా యుద్ధం పీజీ యజమానుల గుండెల్లో గుబులు పుట్టిస్తోంది. ఓవైపు గ్యాస్ కొరతతో నగరంలోని పలు హోటళ్లను తాత్కాలికంగా మూసేస్తుంటే, మరోవైపు హాస్టళ్ల నిర్వహణపై యజమానులు మల్లగుల్లాలుపడుతున్నారు. కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్ల సరఫరా బుధవారం నుంచి నగరంలో దాదాపుగా ఆగిపోవడంతో హాస్టళ్ల నిర్వహణ కష్టంగా మారింది. గ్యాస్ వినియోగం ఎక్కువ అయ్యే దోసె, పూరీ, చపాతీ వంటకాలను తాత్కాలికంగా అన్ని హాస్టళ్లలో నిలిపివేసినట్లు సమాచారం. గ్యాస్ కొరత తీరేవరకు అన్నం, సాంబారు, కూరతో సాధారణ భోజనాన్ని మాత్రమే అందించగలమని ఐటీకారిడార్‌లోని హాస్టల్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం ప్రకటించారు. చికెన్, కోడిగుడ్డుకూర, వేపుళ్లు వంటి అదనపు వంటలను నిలుపుదలచేస్తున్నట్లు తెలిపారు. టీ, కాఫీ లాంటివాటిని అందించలేమని వెల్లడిస్తున్నారు. గ్రేటర్ పరిధిలో మూడు, నాలుగు రోజులుగా సిలిండర్ల బుకింగ్ కావడం లేదని ప్రజలు వాపోతున్నారు. సర్వర్ డౌన్‌తో బుకింగ్ కావడం లేదంటున్నారు. వాట్సాప్ ద్వారా బుక్ చేసుకునే అవకాశం ఉన్నా కావడం లేదంటున్నారు. ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని బావర్చి హోటల్‌ను బుధవారం మూసేశారు. గ్యాస్ సిలిండర్ల కొరత కారణంగానే మూసేసిన్నట్లుగా తెలిసింది. ప్రముఖ ప్యారడైజ్ హోటల్స్ అన్ని బ్రాంచీలలో టీ అమ్మకాలను నిలిపివేశారు. ఐటీసీ సంస్థ కూడా వివిధ ప్రాంతాల్లో గల సంస్థ హోటల్స్‌లో గ్యాస్ కొరత కారణంగా లంచ్, డిన్నర్ ఉండదని ప్రకటించింది. ఒకవేళ దొరికినా కొన్ని ప్రాంతాల్లో రూ. 4 వేలకు, మరికొన్ని ప్రాంతాల్లో రూ. 3,500కు విక్రయిస్తున్నారు. 19 కిలోల కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర సాధారణంగా రూ.2105ల వరకు ఉంది. బుధవారం నుంచి కమర్షియల్ సిలిండర్ల సరఫరా పూర్తిగా బంద్ అయింది. పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో కూడా కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరాను నిలిపివేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ఇదే తరహా పరిస్థితులు నెలకొన్నాయి. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరా లేకపోవడం, మార్కెట్‌లో అధిక ధర ఉండడంతో కొనుగోలు చేయలేక పలు హోటల్స్ మూత పడుతున్నాయి. సిలిండర్ కొరతతో హోటల్స్ మూసేస్తున్నట్లు యజమానులు ప్రకటించారు. అవసరమైతే అవసరమైతే కట్టెల పొయ్యి మీద వంట చేస్తామని చెప్పారు. ఇక పలు ప్రాంతాల్లో టిఫిన్ సెంటర్‌లో కమర్షియల్ సిలిండర్ సరఫరా లేకపోవడంతో హోటల్ మూసివేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. టిఫిన్ సెంటర్ బందు చేసుకోవాల్సి వస్తదేమోనని ఆందోళన చెందారు. అఫ్జల్‌గంజ్, బేగంబజార్‌లో కొన్ని టిఫిన్ సెంటర్లలో గ్యాస్ లేకపోవడంతో మూసేస్తున్నారు. వేల రూపాయలు పెట్టి సిలిండర్ కొనుగోలు చేసి వ్యాపారం ఎలా చేస్తామని చిన్న హోటళ్లు, టిఫిన్ సెంటర్ల నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్యాస్ కొరతతో పలు ప్రాంతాల్లో బిర్యానీ సెంటర్లు మూతపడ్డాయి. పలు ప్రాంతాల్లో వాణిజ్య అవసరాలకు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను వినియోగిస్తున్నారు. కమర్షియల్ గ్యాస్ సిలిండర్లు దొరక్కపోవడంతో టీ షాపులు, బండి వ్యాపారులు, టిఫిన్ సెంటర్ల నిర్వాహకులు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను వాడుతున్నారు. కొందరూ గృహ వినియోగదారులు 14కిలోల గ్యాస్ సిలిండర్‌ను రూ.1800ల వరకు అమ్ముతున్నారు. గ్యాస్ సిలిండర్ల కొరతతో హోటళ్లు మూతపడుతున్నాయి. గృహావసరాల సిలిండర్ల సరఫరా తగ్గింది. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అయితే రూ.5 భోజనానికి ఇబ్బంది ఉండదని జీహెచ్‌ఎంసీ వర్గాలు చెబుతున్నాయి. విద్యుత్‌తో నడిచే యంత్రాలతో భోజనం తయారు చేస్తున్న దృష్ట్యా గ్యాస్ కొరత ప్రభావం తయారీపై ఉండబోదని జీహెచ్‌ఎంసీ అధికారి ఒకరు తెలిపారు. సిలిండర్లకు ప్రత్యామ్నాయ మర్గాలను నిర్వాహకులు అన్వేషిస్తున్నారని అమీర్‌పేట హాస్టళ్ల అసోసియేషన్ అధ్యక్షుడు రాజారావు చెబుతున్నారు. బుధవారం అమీర్‌పేట ప్రాంతంలోని హాస్టల్ నిర్వాహకులు 120కుపైగా ఎలక్ట్రికల్ స్టౌలు కొనుగోలు చేసినట్లు సమాచారం. కొందరు కట్టెల పొయ్యి ఏర్పాటుచేసుకున్నారని దుర్గానగర్ హాస్టళ్ల అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్ చెప్పారు. గ్యాస్ కొరత నేపథ్యంలో హాస్టళ్ల యజమానులంతా ఒక్కటయ్యారు. నిర్వహణ విషయంలో తాత్కాలిక నిబంధనలు రూపొందించి అమలుచేస్తున్నారు. విద్యా, ఉద్యోగ అవకాశాల కోసం నగరానికి వచ్చిన యువతకు ఆశ్రయమిచ్చే పేయింగ్ గెస్ట్ హాస్టళ్ల నిర్వహణ ఇప్పుడు మరింత భారంగా మారింది. మహారాష్ట్ర, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి కోర్సులు నేర్చుకోడానికి వచ్చే విద్యార్థుల సంఖ్య ఏడాదిగా బాగా తగ్గింది. దాంతో ప్రైవేటు హాస్టళ్ల వ్యాపారం మందకొండిగా నడుస్తోంది. గ్యాస్ కొరత మమ్మల్ని మరింత నష్టాల్లోకి నెడుతుంది. ప్రత్యామ్నాయ మార్గాలను వెతుకుతున్నాం. హాస్టల్‌లో ఉంటున్నవారికి అన్నం, కూర, సాంబారైనా వడ్డించడానికి ప్రత్నిస్తున్నాం అంటున్నారు.

## యుద్ధ డిమాండ్లను అంగీకరించాల్సిందే

టెహ్రాన్ : ఇరాన్ వర్సెస్ ఇజ్రాయెల్, అమెరికా దేశాల మధ్య యుద్ధం 13వ రోజుకు చేరుకుంది. ఇజ్రాయెల్, అమెరికా దేశాలు సంయుక్తంగా ఇరాన్‌పై మిస్సైల్స్, డ్రోన్లతో దాడులు చేస్తున్నాయి. ఈ దాడుల్లో ఇప్పటి వరకు 1300 మంది ఇరానీయులు చనిపోయినట్లు తెలుస్తోంది. ఇరాన్ కూడా ఏమాత్రం వెనక్కు తగ్గటం లేదు. రెండు దేశాలపై విరుచుకుపడుతోంది. అరబ్ దేశాలలోని అమెరికా ఎయిర్‌బేస్‌లపై దాడులు చేస్తోంది. యుద్ధం కారణంగా ప్రపంచ దేశాలు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆయిల్, గ్యాస్ ఎరువుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. పశ్చిమాసియా దేశాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కీలక ప్రకటన చేశారు. యుద్ధానికి ముగింపు పలకాలంటే తమ షరతులకు అంగీకరించాల్సిందేనని తేల్చి చెప్పారు. భవిష్యత్‌లోనూ తమ దేశంపై ఎవరూ దాడులు చేయకూడదని అన్నారు. తమ న్యాయపర హక్కులను ప్రపంచం గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. పశ్చిమాసియాలో శాంతి, భద్రతలకు ఇరాన్ కట్టుబడి ఉందన్నారు. అయితే, ఇరాన్ భద్రతకు గ్యారెంటీ ఇస్తేనే యుద్ధం ఆపుతామని చెప్పారు. రష్యా అధ్యక్షుడు పుతిన్, పాకిస్థాన్ ప్రధాని షహబాజ్ షరీఫ్‌తో ఫోన్‌లో మాట్లాడినపుడు కూడా ఇదే విషయం చెప్పామని అన్నారు. ఈ క్రమంలో పశ్చిమాసియా లో ఉద్రిక్తతలు నానాటికీ పెరుగుతున్నాయి. ముఖ్యంగా అమెరికా, దాని మిత్ర దేశాల నౌకలపై ఇరాన్ దాడులు తీవ్రమవుతున్నాయి. తాజాగా ఇరాక్ ప్రాదేశిక జలాల్లో రెండు ట్యాంకర్లపై 'సూసైడ్ బోటు'తో దాడి జరిగింది. ఈ ఘటనలో ఓ భారతీయుడు మృతిచెందడం గమనార్హం. పర్షియన్ గల్ఫ్‌లో ఇరాక్ తీరం సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. దాడికి గురైన నౌకలను అమెరికాకు చెందిన సేఫ్‌సీ విష్ణు, గ్రీస్‌కు చెందిన జెఫిరోస్‌గా గుర్తించారు. సేఫ్‌సీ విష్ణు నౌక మార్షల్ ఐలాండ్స్ జెండాతో ఉండగా.. జెఫిరోస్‌పై మాల్టా జెండా ఉంది. ఈ నౌకలు తీరంలో చమురు సేకరిస్తుండగా పేలుడు పదార్థాలతో ఉన్న 'సూసైడ్ బోటు' వీటిని ఢీకొట్టినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. దీంతో భారీగా పేలుడు సంభవించి పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో రెండు నౌకల్లో ఉన్న 38 మంది సిబ్బందిని రెస్క్యూ టీం సభ్యులు కాపాడారు. ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయారు. మృతుడిని భారతీయుడిగా గుర్తించారు. అయితే, అతడి పూర్తి వివరాలు మాత్రం తెలియరాలేదు. ఈ దాడి తమ పనేనని ఇరాన్ (ఎసజీని) ప్రకటించింది. ఈ మేరకు తమ అధికారిక మీడియాలో వెల్లడించింది. ఫిబ్రవరి 28న పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమైన నాటి నుంచి పర్షియన్ గల్ఫ్, హర్మూజ్ జలసంధి మార్గంలో ప్రయాణించే చమురు నౌకలపై దాడులు జరుగుతున్న సంగతి తెలిసిందే. బుధవారం కూడా మూడు కమర్షియల్ నౌకలపై డ్రోన్ దాడులు జరిగాయి. వీటిల్లో ఓ నౌక థాయ్ జెండాతో భారత్‌కు వస్తుండగా.. యూఏఈ తీరంలో దాడి జరిగింది. మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబాకు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. వాల్ స్ట్రీట్ జర్నల్ కథనం ప్రకారం.. ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ అమెరికా డిమాండ్లకు ఒప్పుకోవా లని ట్రంప్ స్పష్టం చేశారు. న్యూక్లియర్ వెపన్స్ ప్రోగ్రామ్‌ను ఇరాన్ పూర్తిగా ఆపేయాలన్నారు. అలా జరగని పక్షంలో చావు తప్పదని హెచ్చరించారు. ఫిబ్రవరి 28వ తేదీ లాంటి దాడులు మరోసారి జరుగుతాయని చెప్పారు. ఇజ్రాయెల్ సాయంతో మొజ్తాబాను చంపేస్తామని తేల్చి చెప్పారు.

## జగన్ హయాంలో పెట్టుబడిదారుల పరార్

ఆదాయార్జన శాఖలు, విద్య- నైపుణ్యాభివృద్ధి తదితర అంశాలపై చర్చిస్తున్నారు. జిల్లాల వారీగా పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలను సీఎం అధికారులకు వివరించారు. రాష్ట్రాన్ని పారిశ్రామిక హబ్‌గా మార్చేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. సంపద సృష్టించేందుకు ఉన్న అన్ని అవకాశాలను ఉపయోగించుకోవాలి. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఎలా ఉన్నామో జిల్లాల వారీగా వివరాలు ఉండాలి. గత వైకాపా హయాంలో పెట్టుబడులకు ఎవరూ ముందుకు రాలేదు. ఉన్న కంపెనీలు కూడా పారిపోయిన పరిస్థితి అందరం చూశాం. వనరులు ఉన్నా సరైన రీతిలో ఉపయోగించుకోవాలి. లేదంటే వ్యర్థమేనని చంద్రబాబు అన్నారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై సీఎం దిశానిర్దేశర చేశారు. సంపద సృష్టితో పాటు ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందేలా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. సంక్షేమ పథకాల అమలుకు సంబంధించి క్యాలెండర్ విడుదల చేస్తామని ప్రకటించారు. కుటుంబ సాధికారిత సాధించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వివిధ పథకాల లబ్దిదారులకు ప్రజా ప్రతినిధుల ద్వారా సంక్షేమ లేఖలు అందివ్వాలని సీఎం ఆదేశించారు. సంక్షేమ పథకాల పారదర్శకతతో అమలుకు, ఓనర్‌షిప్ తీసుకునేందుకు సంక్షేమ లేఖలు ఇవ్వాలని నిర్ణయించారు. పెట్టుబడుల గురించి ఆలోచించినట్లే... పేదల గురించి ఆలోచించాలని సూచించారు. త్వరలో సంక్షేమ క్యాలెండర్ విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. సంక్షేమ పథకాల అమలుకు సంబంధించి ఓ లేఖను లబ్దిదారులకు అందించేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశర చేశారు. లబ్దిదారులకు ప్రతీ నెలా ఏం లబ్ది కలిగిందో తెలియజేయాలని సూచించారు. ఏ కుటుంబానికి ఏం లబ్ది కలిగిందో తెలిస్తే అంతా పారదర్శకంగా ఉంటుందని చెప్పుకొచ్చారు. ప్రభుత్వం అందించే పెన్షన్, ఉచిత సిలిండర్, తల్లికి వందనం, లాంటివి లబ్దిదారులకు తెలియాలని సూచించారు. దీపం 2.0 పథకానికి డిజిటల్ ఓచర్ జారీ చేసే అంశాన్ని పరిశీలించాలని అన్నారు. డీబీటీ పథకాల్లో ప్రోగ్రామబుల్ వోచర్లను లబ్దిదారులకు ఇస్తే వారు వినియోగించుకుంటారన్నారు. మార్చి 9వ తేదీ నాటికి ఏపీఎస్ ఆర్టీసీ ద్వారా 50.45 కోట్ల ప్రయాణాలను మహిళలు చేశారని.. రూ.1775 కోట్లను ప్రభుత్వం ఆర్టీసీకి రీయంబర్స్ చేసిందని వివరించారు. డ్వాక్రా, మెప్మా సంఘాల సేవలను వినియోగించుకుని పీ4తో సహా జీరో పావర్టీ కార్యక్రమాన్ని సమర్ధవంతంగా చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. అన్నదాత సుఖీభవ ద్వారా రేపు మూడో విడత నిధులు విడుదల చేస్తున్నామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. అన్నాక్యాంటీన్ల ద్వారా 7.5 కోట్ల భోజనాలు ఇప్పటి వరకూ పేదలకు అందించగలిగామని చెప్పుకొచ్చారు. అంగన్‌వాడీ, ఆశాలకు గ్రాట్యూటీ అమలు చేస్తున్నామని అన్నారు. రూ. వెయ్యి కోట్లతో రోడ్ల మరమ్మతులు చేపట్టామని తెలిపారు. పల్లె పండుగ కింద గ్రామీణ ప్రాంతాల్లో రూ.4 వేల కోట్లు ఖర్చు చేశామని అన్నారు. సంక్షేమ పథకాలు పేదలందరికీ అందించడమే లక్ష్యంగా కలెక్టర్లు పనిచేయాలని మార్గనిర్దేశర చేశారు. సంక్షేమం, అభివృద్ధి సమతూకంగా జిల్లా కలెక్టర్లు పనిచేయాలని దిశానిర్దేశర చేశారు. ఆదేశించారు.

## 14 నుంచి పదోతరగతి పరీక్షలు

సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. అయితే పరీక్షలకు ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చే విద్యార్థులను అనుమతిస్తారు. ఆ తర్వాత వచ్చే వారిని అస్సలు అనుమతించబోరు. అంటే ఉదయం 9:35 గంటల తర్వాత వచ్చే విద్యార్థులను పరీక్షకు అనుమతించబోరు. విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. పరీక్షల నిర్వహణ కోసం రాష్ట్రవ్యాప్తంగా 2,676 సెంటర్లు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ బడుల్లో 1,582 సెంటర్లు, ప్రైవేట్ బడుల్లో 1,094 సెంటర్లు ఏర్పాటు చేశారు. ఈ సారి 5,17,727 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారు. పరీక్షల సందర్భంగా సెల్‌ఫోన్ల వినియోగంపై అధికారులు కఠిన ఆంక్షలు విధించారు. పరీక్ష కేంద్రాలను 'నో సెల్‌ఫోన్' జోన్లుగా ప్రకటించారు. పరీక్ష సిబ్బంది, స్కాడ్ సహా ఇతర అధికారులందరికీ ఈ నిబంధనలు వర్తిస్తాయి. తనిఖీలకు వచ్చే అధికారులు సైతం సెల్‌ఫోన్లు తీసుకెళ్లరాదు. వీరు తమ సెల్‌ఫోన్లను గది బయటే పెట్టాల్సి ఉంటుంది. ఎవరొచ్చినా తనిఖీలు చేసిన తర్వాతే లోపలికి అనుమతిస్తారు. ఒకవేళ ఎవరైనా ఈ నిబంధనలు ఉల్లంఘించి సెల్‌ఫోన్లతో విధులకు హాజరైతే వారిని సస్పెండ్‌చేస్తారు. పేపర్ లీకేజీలకు పాల్పడితే ఉద్యోగం నుంచి తొలగిస్తారు. పరీక్షలు జరుగుతుండగానే మూల్యాంకనం కూడా ప్రారంభం అవుతంది. ఈ నెల 14 నుంచి పదో తరగతి పరీక్షలు జరుగనుండగా, ఏప్రిల్ 1 నుంచి జవాబపత్రాల మూల్యాంకనం జరుగనున్నది.

## స్పీకర్ నిర్ణయంతో ఏకీభవించిన సుప్రీం

ఈ కేసును జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించగా.. స్పీకర్ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. ఎమ్మెల్యేల అనర్హతకు సంబంధించి దాఖలైన పిటిషన్లపై తెలంగాణ స్పీకర్ ఇప్పటికే విచారణ జరిపి, తగిన నిర్ణయం తీసుకున్నారని ఆయన కోర్టుకు వివరించారు. దీంతో ఈ సమస్య సభాపతి కార్యాలయంలోనే ముగిసిందన్నారు. సింఘ్వీ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం.. ఈ వ్యవహారంపై స్పీకర్ ఇప్పటికే తుది నిర్ణయం తీసుకున్నందున విచారణ కొనసాగించాల్సిన అవసరం లేదని భావించింది. దీంతో కోర్టు విచారణ ముగిసినట్లేనని వెల్లడించింది. స్పీకర్ ఆదేశాలను రెండు రోజుల్లో అధికారికంగా ప్రచురించాలని న్యాయస్థానం ఆదేశించింది. ఆ తరువాత పిటిషనర్లకు కావాల్సిన డాక్యుమెంట్లను కూడా నాలుగు రోజుల్లో అందజేయాలని సూచించింది. దీంతో 10 మంది ఎమ్మెల్యేలకు సభాపతి క్లీన్ చిట్ ఇచ్చినట్లైంది. ఈ వ్యవహారంలో పదిమంది బిఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ఊరట దక్కింది. అయితే పోరాడిన బిఆర్ఎస్‌కు మాత్రం న్యాయం దక్కలేదని ఆ పార్టీ నేతలు వ్యాఖ్యానించారు. స్పీకర్ తీర్పుపై ఇప్పటికే బిఆర్ఎస్ తన నిరసన తెలియచేసింది. స్పీకర్ తీర్పును సవాల్ చేస్తామన్న బిజెపికి కూడా ఈ తీర్పుతో ఇక అవకాశం లేనట్లుగానే భావించాలి.

## నిరసలను లెక్క చేయని అమెరికా అధ్యక్షుడు

యుద్ధంతో దేశీయంగా తీవ్ర నిరసనలు వస్తున్నా లెక్క చేయడం లేదు. ఇతరదేశాలపై ఎలాగైనా టారిఫ్‌లు వసూలుచేయాలని కంకణం కట్టుకున్న ట్రంప్.. ఇందుకోసం కొత్తదారులు వెతుకుతున్నారు. తాజాగా 'సెక్షన్ 301' ఆయుధాన్ని బయటకు తీశారు. దీనికింద భారత్, చైనా సహా 16 వాణిజ్య భాగస్వామ్య దేశాలపై దర్యాప్తు ప్రారంభించారు. ఈ మేరకు అమెరికా వాణిజ్య శాఖ ప్రతినిధి జెమిసన్ గ్రీర్ కీలక ప్రకటన చేశారు. 1974 వాణిజ్య చట్టంలోని సెక్షన్ 301 కింద.. భారత్, చైనా, యూరోపియన్ యూనియన్, సింగపూర్, స్విట్జర్లాండ్, నార్వే, ఇండోనేసియా, మలేసియా, కాంబోడియా, థాయ్‌లాండ్, దక్షిణ కొరియా, వియత్నాం, తైవాన్, బంగ్లాదేశ్, మెక్సికో, జపాన్ దేశాలపై ఈ దర్యాప్తు జరగనుందని గ్రీర్ వెల్లడించారు. కాగా.. ఈ జాబితాలో కెనడా లేకపోవడం గమనార్హం. ఇతర దేశాలు అనుసరిస్తున్న అన్యాయమైన వాణిజ్య విధానాలను సవాలు చేసేందుకు అమెరికాకు ఉన్న శక్తిమంతమైన ఆయుధమే ఈ సెక్షన్ 301. తమ వాణిజ్య భాగస్వాములు అనుసరిస్తున్న ట్రేడ్ పాలసీలు అమెరికా వ్యాపారాలు, ప్రయోజనాలకు నష్టం కలిగిస్తున్నాయా? అనేదానిపై ఈ చట్టం కింద అమెరికా దర్యాప్తు చేసేందుకు వీలు లభిస్తుంది. ఒకసారి దర్యాప్తు ప్రారంభించిన తర్వాత.. అన్యాయమైన వాణిజ్య విధానాలపై అగ్రరాజ్యం సాక్ష్యాలను సేకరించే పనిలో ఉంటుంది. ఏదైనా దేశం తమకు నష్టం కలిగించేలా ట్రేడ్ పాలసీలను అనుసరిస్తుందని తేలితే.. ప్రపంచ వాణిజ్య సంస్థ అనుమతి లేకుండానే ఆ దేశంపై ఏకపక్షంగా చర్యలు తీసుకునేందుకు ఈ చట్టం కింద అధికారం ఉంటుంది. అలాంటి దేశాలపై చట్టబద్ధంగా భారీ సుంకాలు విధించడం లేదా ప్రతీకార చర్యలు తీసుకునేందుకు అమెరికాకు మార్గం లభిస్తుంది. చైనా లాంటి ప్రత్యర్థులతో పాటు భారత్ వంటి మిత్రపక్షాల పైనా అమెరికా ఈ దర్యాప్తు చేపట్టడం చర్చకు దారితీసింది. భారత్‌లోని కొన్ని వాణిజ్య విధానాల వల్ల మన మార్కెట్లపై అమెరికాకు పరిమితులు ఉంటున్నాయని చాలాకాలంగా అగ్రరాజ్యం ఆందోళన వ్యక్తంచేస్తోంది. కొన్ని ఉత్పత్తులపై భారత్ అమలుచేస్తోన్న అధిక సుంకాలు, స్థానిక తయారీ, డేటా స్టోరేజీ, టెక్నాలజీ నిబంధనలు వంటివాటిపై అమెరికా అభ్యంతరాలు తెలుపుతోంది. ఈ అంశాల పైనే కొన్నేళ్లుగా ఇరుదేశాల మధ్య వాణిజ్య చర్చలు జరుగుతున్నాయి. అయితే, తాజా దర్యాప్తుతో భారత్‌పై వెంటనే పెనాల్టీలు పడే అవకాశం లేనప్పటికీ.. భవిష్యత్తులో కొన్ని రంగాలపై ఇది ప్రతికూల ప్రభావం చూపించే ప్రమాదం ఉంది. దీంతో ఆయా రంగాల నుంచి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

## ఆనాడు ఒక్కడినే.. ఈనాడు కోట్లాదిమంది అండ

ఈ సందర్భంగా పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జగన్ కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ.. దివంగత నేత వైయస్ రాజశేఖర రెడ్డి మరణం తర్వాత ఆయన ఆశయాలను కొనసాగిస్తానని, ఆయన మరణాన్ని తట్టుకోలేక చనిపోయిన కుటుంబాలను పరామర్శిస్తానని జగన్ నల్లకాల్వలో ఇచ్చిన మాట ఆ పార్టీ స్థాపనకు పునాది వేసింది. ఓదార్పు యాత్రకు కాంగ్రెస్ పార్టీ అడ్డు చెప్పడంతో.. ఇచ్చిన మాట కోసం ఆ పార్టీని వదిలి, వైయస్సార్సీపీని జగన్ స్థాపించారు. 'అప్పట్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలోనూ, కేంద్రంలో నూ అధికారంలో ఉన్నప్పటికీ ఎలాంటి భయం లేకుండా ప్రజల కోసం పోరాటం చేశా. మొదటి నుంచీ ప్రజలు, దేవుడ్నే నమ్ముకుని ముందుకు సాగా. వైసీపీ ఆవిర్భావం తర్వాత దేశ రాజకీయాల్లో కూడా మార్పులు కనిపించాయి. వైసీపీ కార్యకర్తలు ఎప్పుడూ గర్వంగా కాలర్ ఎగరేసేలా పార్టీ నిలుస్తుంది. ఈ పార్టీ కొన్ని కోట్ల మంది ప్రజలదని అన్నారు. అందరి ఆశలు, ఆకాంక్షలకు ప్రతీకగా పార్టీ నిలిచింది. పార్టీ లోపల ఎప్పుడూ విలువలు, విశ్వసనీయతకు పెద్దపీట వేస్తాం. నాపై ప్రేమాభిమానాలు చూపుతున్న కార్యకర్తలు, అభిమానులకు హృదయపూర్వక కృతజ్ఞతలు. వైసీపీని అభిమానించే ప్రతి ఒక్కరికీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు' అని వైఎస్ జగన్ తెలిపారు. ఈరోజు మరొక్కసారి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వైయస్సార్‌ను అభిమానించే ప్రతి గుండెకు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రతి కార్యకర్త, ప్రతి నాయకుడికి, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రజలందరికీ కూడా ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. ఇంకా వైయస్సార్‌ను ప్రేమించే ప్రతి గుండె, ఏ రాష్ట్రంలో ఉన్నా, ఆ ప్రతి గుండెకు ఈరోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్నానంటూ వైఎస్ జగన్ ప్రసంగాన్ని ముగించారు. పలువురు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నేతలు, నాయకులు, కార్యకర్తలతో పాటు పెద్ద ఎత్తున పార్టీ అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైసీపీ కేంద్ర కార్యాలయానికి పెద్ద ఎత్తున అభిమానులు, కార్యకర్తలు, నాయకులు తరలివచ్చారు. వైయస్సార్ చిత్రపటానికి పూలు సమర్పించి, నివాళులర్పించిన వైఎస్ జగన్, ఆ తర్వాత పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు.

## హైదరాబాద్‌లో నెట్‌ఫ్లిక్స్ స్టూడియో

నెట్‌ఫ్లిక్స్ హైదరాబాద్‌కు వచ్చిందంటే హాలీవుడ్ నగరానికి వచ్చినట్లే అని సీఎం వ్యాఖ్యానించారు. నెట్‌ఫ్లిక్స్‌తో తన కల నిజం కాబోతోందని వ్యాఖ్యానించారు. నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియోస్ విస్తరణకు తమ ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. ఫోర్త్‌సిటీని నిర్మిస్తున్నామని.. నెట్‌ఫ్లిక్స్ విస్తరణకు కావాల్సిన భూమిని ఫ్యూచర్ సిటీలో ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. నెట్‌ఫ్లిక్స్ కార్పొరేట్ ఆఫీస్‌ను ఫ్యూచర్ సిటీకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమానికి పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి డి. శ్రీధర్‌బాబు, సినీనటుడు రానా దగ్గుబాటి, నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియోస్ సీఈఓ జెఫ్ షాపిరో, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. తనకు సినిమాలపైన ఆసక్తి ఉందని.. తన బాల్యం నుంచి ఇప్పటి వరకు చిత్రరంగంలో అనేక మార్పులు వచ్చాయని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. బాహుబలి, కల్కి, ఆర్ఆర్ఆర్, అరుంధతి వంటి అత్యున్నత సాంకేతికతతో కూడిన సినిమాలు వచ్చాయని చెప్పుకొచ్చారు. చెన్నైలో ఉన్న తెలుగు సినిమా రంగాన్ని నందమూరి తారక రామారావు , అక్కినేని నాగేశ్వరరావు హైదరాబాద్‌కు తీసుకువచ్చారని గుర్తుచేశారు. నెట్‌ఫ్లిక్స్ హైదరాబాద్ వచ్చిందంటే హాలీవుడ్ వచ్చినట్లేనని పేర్కొన్నారు. తమ దృష్టి హాలీవుడ్‌పైనేనని తాను గతంలోనే చెప్పానని ప్రస్తావించారు. ప్రపంచంలోని 500 పెద్ద కంపెనీలను తెలంగాణకు తీసుకురావడానికి తాము ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. తెలంగాణలో మీ పెట్టుబడికి పూర్తి రక్షణ ఉంటుందని.. తమ రాష్ట్రం అంటేనే వ్యాపారమని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## యాదాద్రీశుడిని దర్శించుకున్న గవర్నర్

ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గర్భాలయంలో స్వామి అమ్మవార్లకు గవర్నర్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతోపాటు ఆయన కుటుంబ సభ్యులకు ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం ఇచ్చారు. ఆ తర్వాత వారికి ఆలయ ఈవో భవానీ శంకర్ స్వామివారి జ్ఞాపికతోపాటు ప్రసాదాన్ని అందజేశారు. గవర్నర్ రాక సందర్భంగా యాదగిరిగుట్ట పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టారు. తెలంగాణ నూతన గవర్నర్‌గా శివ ప్రతాప్ శుక్లా బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. హైదరాబాద్ లోక్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్‌గా ప్రతాప్ శుక్లా చేత తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రమాణ స్వీకారం చేయించిన సంగతి తెలిసిందే. సీఎం రేవంత్ రెడ్డి, పలువురు మంత్రులతోపాటు ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## తెలంగాణలో కమర్షియల్ సిలిండర్ల కొరత

రాష్ట్రంలో నిత్యం సరఫరా అవుతున్న వంట గ్యాస్ సిలిండర్లలో దాదాపు 86 శాతం డొమెస్టిక్ కనెక్షన్లేనని ఆయన స్పష్టం చేశారు. అలాగే మిగిలిన 14 శాతం మాత్రమే కమర్షియల్ అని వివరించారు. ప్రస్తుతానికి డొమెస్టిక్ సిలిండర్ల సరఫరాలో ఎలాంటి కొరత లేదని తమ శాఖ అధికారులు వెల్లడించారని చెప్పారు. కానీ కమర్షియల్ సిలిండర్ల సరఫరాలో మాత్రం కొన్ని ఇబ్బందులు ఉన్నాయన్నది వాస్తవమని తెలిపారు. రాష్ట్రంలో వంట గ్యాస్ తాజా పరిస్థితిపై చర్చించేందుకే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులు, చమురు కంపెనీల ప్రతినిధులతో శుక్రవారం సమీక్షిస్తామని మంత్రి ఉత్తమ్ వివరించారు. రాష్ట్రంలో రోజూ ఎన్ని కమర్షియల్ సిలిండర్లు అవసరం, సరఫరా ఏ మేరకు ఉంది, గ్యాస్ కొరతకు గల కారణాలు, అందుకు అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలతోపాటు ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టేందుకున్న మార్గాలన్నింటిపై చర్చించనున్నట్లు మంత్రి ఉత్తమ్ వివరించారు. అలాగే పూర్తి వివరాలతో రావాలని ఆయిల్ కంపెనీల ప్రతినిధులతోపాటు అధికారులకు సమాచారం ఇచ్చామన్నారు. పరిస్థితి చేయి దాటి పోకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. రో వైపు.. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య భీకర పోరు కొనసాగుతోంది. దీని ప్రభావంతో దేశవ్యాప్తంగా గ్యాస్, చమురుకు తీవ్ర కొరత ఏర్పడింది. గ్యాస్ సిలిండర్లకు ఎలాంటి కొరత లేదని కేంద్రం చెబుతున్నప్పటికీ.. వాస్తవ పరిస్థితి మాత్రం పూర్తి భిన్నంగా ఉంది. తెలంగాణలో వంట గ్యాస్ సిలిండర్ల సరఫరాకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. దాంతో హోటళ్లు, హాస్టల్స్, మెస్‌లకు అవసరమైన మేర కమర్షియల్ సిలిండర్ల సరఫరా లేకపోవడంతో నగరంలో చాలా ప్రాంతాల్లో అవి మూతపడ్డాయి. ఈ నేపథ్యంలో గ్యాస్ సిలిండర్ల కొరత నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. అందుకోసం శుక్రవారం వివిధ శాఖల ఉన్నతాధికారులతో పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష నిర్వహించనున్నారు.



# మన విదేశాంగ విధానం అమెరికాకు తకాట్టు

### ఎవరి నుంచి చమురు కొనాలో అమెరికా పెత్తనం ఏంటి

### ఎన్‌స్టీన్ ఫైల్స్‌లో దొరికి పోవడంతోనే అమెరికాకు దాసోహం

### లోక్‌సభలో రాహుల్ గాంధీ ఘాటు విమర్శలు



న్యూఢిల్లీ,మార్చి12 : భారత విదేశాంగ విధానన్ని మోడీ అమెరికాకు తకట్టు పెట్టారని విపక్షనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. రష్యా నుంచి చమురు దిగుమతులకు అమెరికా అడ్డంకులేంటని ప్రశ్నించారు. మనం చమురు ఎక్కడ కొనాలో అమెరికా నిర్ణయిస్తుందంటే మన విదేశాంగ విధానం తాకట్టు పెట్టినట్లేనని అన్నారు. హర్మూజ్ జలసంధి నుంచి పెద్ద ఎత్తున దిగుమతులు జరగాల్సి ఉంది. యుద్ధం కారణంగా దిగుమతులు ఆగిపోయాయి. ఇది ఆరంభం మాత్రమే. గ్యాస్ కొరతతో దేశం అల్లాడుతోంది. మనం ఎవరి నుంచి చమురు కొనాలో అమెరికా నిర్ణయిస్తోంది. రష్యా నుంచి చమురు కొనాలో..?వద్దో..? మనకు మనం నిర్ణయించుకోవాలి. రష్యా నుంచి చమురు కొనుగోలుపై అమెరికా జోక్యం ఎందుకు..? భారత్ వంటి పెద్ద దేశానికి మరోదేశం అనుమతి ఎందుకు..? ఇలా ఎందుకు జరుగుతోందా అని ఆలోచించాను. నా ప్రశ్నకు సమాధానం ఎప్‌స్టీన్ ఫైల్స్ రూపంలో దొరికింది. ఎప్‌స్టీన్ ఫైళ్ల ప్రభావం ఎల్‌పీజీ దిగుమతులపై పడినట్లు ఉంది. ఎప్‌స్టీన్‌తో సంబంధాలను పెట్రోలియం మంత్రే అంగీకరించారని రాహుల్ వ్యాఖ్యలు చేశారు. ఇవి దుమారం రేపాయి. దీంతో స్పీకర్ ఓం బిర్లా స్పందించారు. నోటీసు ఇచ్చిన అంశంపైనే మాట్లాడాలని సూచించారు. సభ్యుల ఇష్టాఇష్టాల మేరకు సభ నడవదని స్పష్టం చేశారు. ఇదే అంశంపై పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ ప్రసంగాన్ని విపక్షాలు అడ్డుకున్నాయి. ఎప్‌స్టీన్ అంటూ లోక్‌సభలో విపక్ష సభ్యులు నినాదాలు చేశారు. ఆ గందరగోళం మధ్యే మంత్రి మాట్లాడారు. ఇరాన్, అమెరికా – ఇజ్రాయిల్ యుద్ధం నేపథ్యంలో గ్యాస్ కొరతతో భారతదేశం అల్లాడుతోందని రాహుల్ గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ప్రస్తుత పరిస్థితికి మోదీ ప్రభుత్వమే కారణమని ఆయన విమర్శించారు. పశ్చిమాసియాలో యుద్ధం జరుగుతుందన్నారు. అమెరికా – ఇజ్రాయిల్, ఇరాన్ యుద్ధంలో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రపంచ దేశాలకు 20 శాతం చమురు హర్మూజ్ జల సంధి నుంచి వస్తుందని వివరించారు. ప్రస్తుతం ఆ జల సంధిని మూసివేశారని పేర్కొన్నారు. గ్యాస్ కొరత కారణంగా దేశవ్యాప్తంగా రెస్టారెంట్లు మూతపడ్డాయని చెప్పారు. ఎల్పీజీ గ్యాస్ కొరత నేపథ్యంలో ప్రజలు భయాందోళనలో ఉన్నారన్నారు. దేశానికి పునాది ఇంధన భద్రత అని అభివర్ణించారు. భారత్ వ్యవహారాలను అమెరికా శాసిస్తోందని మండిపడ్డారు. యూఎస్ అనుమతి లేకుంటే ముడి చమురు కొనుగోలు చేయ్యారా? అంటూ వ్యంగ్యంగా కేంద్రాన్ని నిలదీశారు. భారత్ వంటి పెద్ద దేశానికి మరో దేశం అనుమతి అవసరమా? అంటూ సందేహం వ్యక్తం చేశారు. పెట్రోలియం మంత్రికి ఎప్‌స్టీన్‌తో సంబంధాలున్నాయని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు చేసిన వెంటనే రాహుల్ మైక్‌ను స్పీకర్ ఓం బిర్లా కట్ చేశారు. అంతలో సభలోని హర్దీప్ సింగ్ స్పందిస్తూ.. రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. హర్దీప్‌సింగ్ ప్రసంగాన్ని విపక్షాలు అడ్డుకున్నాయి. అంతే కాకుండా ఎప్‌స్టీన్ అంటూ సభలో విపక్ష పార్టీల సభ్యులు బిగ్గరగా నినాదాలు చేశారు.

## తిరిగి స్పీకర్ స్థానంలో విధులకు ఓంబిర్లా

### తనకు ఎలాంటి భేదభావాలు లేవని ప్రకటన

### నిబంధనల మేరకే నడచుకున్నానని వెల్లడి

న్యూఢిల్లీ,మార్చి12 : విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయిన నేపథ్యంలో గురువారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తిరిగి స్పీకర్ స్థానంలోకి వచ్చారు. అలాగే ఆయన తన పనితీరుపైనా స్పందించారు. ప్రతి ఎంపీకి లోక్‌సభలో మాట్లాడే అవకాశం కల్పించడానికి తాను ఎల్లప్పుడూ ప్రయత్నిస్తానని అన్నారు. సభ నియమ నిబంధనలకు ఎవరూ అతీతులు కారని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. ఎంపీల మైక్రోఫోన్లను నియంత్రించాననే ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదన్నారు. సభలో ఎవరికీ ప్రత్యేక వెసులుబాట్లు ఉండవు. నిబంధనల ప్రకారమే కార్యకలాపాలు నడుస్తాయి. ప్రధాని, మంత్రులు కూడా ఏవయినా ప్రకటనలు చేయడానికి ముందు సభ నిబంధనల ప్రకారం నోటీసులు ఇవ్వాలి. మైక్రోఫోన్లు ఆన్ లేక ఆఫ్ చేయడానికి స్పీకర్ వద్ద ఎలాంటి బటన్ ఉండదు. ఈ విషయం విపక్ష నేతలకు కూడా తెలుసు. మాట్లాడేందుకు అనుమతి ఉన్న సభ్యుడికి మాత్రమే మైక్రోఫోన్ ఆన్ అవుతుంది' అని తనపై విపక్షాలు కొంతకాలంగా చేస్తోన్న విమర్శలకు బిర్లా సమాధానం ఇచ్చారు. రెండ్రోజుల చర్చ అనంతరం బుధవారం సాయంత్రం విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ జరిగింది. మూజువాణి ఓటుతో అది వీగిపోయింది. రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో మాట్లాడేందుకు విపక్ష నేత రాహుల్‌గాంధీకి అవకాశం ఇవ్వకపోవడం, ఎనిమిది మంది సభ్యులపై సస్పెన్షన్ వేటు వేయడం, కాంగ్రెస్ మహిళా ఎంపీలపై నిరాధార ఆరోపణలు చేసిన భాజపా ఎంపీ నిశికాంత్ దుబెపై చర్యలు చేపట్టకపోవడం వంటి కారణాలతో విపక్షాలు ఈ అవిశ్వాస తీర్మానాన్ని తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. తనపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం పక్రియ పూర్తయ్యేవరకు సభకు హాజరుకాకూడదని నిర్ణయించుకున్న స్పీకర్ అది వీగిపోగానే మళ్లీ యథావిధిగా తన బాధ్యతలు చేపట్టారు.

## న్యాయవ్యవస్థలో అవినీతి రచయితలు

### వారిని దూరంపెట్టాలన్న సుప్రీం ధర్మాసనం

న్యూఢిల్లీ,మార్చి12 : జాతీయ విద్యా పరిశోధనా శిక్షణ మండలి ఎన్‌సీఈఆర్‌టీ 8వ తరగతి సాంఘిక శాస్త్ర పాఠ్యపుస్తకంలో 'న్యాయ వ్యవస్థలో అవినీతి' పాఠ్యాంశాన్ని చేర్చేందుకు కారకులైన వారిపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ ముగ్గురు నిపుణులతో ఇకపై ఎలాంటి సంబంధాలు కొనసాగించొద్దని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. న్యాయ వ్యవస్థలో నెలకొన్న అవినీతి గురించి వివాదాస్పద అంశంగా పాఠ్యపుస్తకంలో చేర్చడంపై ఎన్‌సీఈఆర్‌టీ.. సర్వోన్నత న్యాయస్థానానికి బేషరతుగా క్షమాపణలు చెప్పడంతో పాటు ఆ పుస్తకాన్ని ఉపసంహరించుకున్న సంగతి తెలిసిందే. ఈ అంశంపై సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ వివాదాస్పద పాఠ్యాంశాన్ని ప్రొ.మైఖేల్ డానినో సహా టెక్స్ట్‌బుక్ డెవలప్‌మెంట్ టీమ్ సభ్యులు సుపర్ణ దివాకర్, అలోక్ ప్రసన్న కుమార్‌లు రూపొందించారని ప్రభుత్వం తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం.. 'ప్రొ.మైఖేల్ డానినో, ఆయన సహచరులు సుపర్ణ దివాకర్, అలోక్ ప్రసన్న కుమార్‌లకు భారత న్యాయవ్యవస్థను గురించిన సరైన పరిజ్ఞానం లేకుండా ఉండాలి, లేదా విద్యార్థుల ముందు న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను దిగజార్చేందుకు వాళ్లు ఉద్దేశపూర్వకంగానే వాస్తవాలను వక్రీకరించి తప్పుగానైనా చూపించి ఉండాలి' అని పేర్కొంది. ఇకపై రాబోయే తరం విద్యార్థులకు అవసరమైన పాఠ్య పుస్తకాల రూపకల్పన పక్రియలో ఆ ముగ్గురి ప్రమేయం ఉండకూడదని, వారిని తక్షణమే పక్కనపెట్టాలని ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రభుత్వ నిధులతో పూర్తిగా లేదా పాక్షికంగా సంబంధమున్న ఎలాంటి బాధ్యతలనూ అప్పగించకూడదని తేల్చి చెప్పింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. న్యాయవ్యవస్థ గురించి విద్యార్థులకు బోధించడం మంచి విషయమే అయినప్పటికీ.. సంబంధిత పాఠ్య ప్రణాళిక తయారీలో కనీసం ఒక్క న్యాయ నిపుణుడికీ అవకాశం కల్పించకపోవడం తమకు అసంతృప్తి కలిగిస్తోందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఎన్ఈసీఆర్‌టీ లీగల్ స్టడీస్‌కు సంబంధించి పాఠ్యప్రణాళిక రూపకల్పనలో న్యాయ రంగానికి చెందిన నిపుణులతో వారం రోజుల్లోగా ఓ కమిటీని ఏర్పాటుచేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ కమిటీలో మాజీ సీనియర్ న్యాయమూర్తి, ఓ ప్రసిద్ధ న్యాయవాది సహా ప్రముఖ విద్యావేత్త ఒకరుంటే బాగుంటుందని అభిప్రాయపడింది. వీరు నేషనల్ జ్యుడీషియల్ అకాడమీతో సంబంధం ఉన్నవారైతే మరింత మంచి విషయాన్ని పొందుపరిచేందుకు అవకాశముంటుందని తెలిపింది. వివాదాస్పద ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్య పుస్తకాన్ని పూర్తిగా నిషేధిస్తూ సర్వోన్నత న్యాయస్థానం ఫిబ్రవరి 26న తీర్పు వెలువరించగా.. దానిపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం జరిగినట్లు ధర్మాసనం గుర్తుచేసింది.

## యుద్ధ సంక్షోభంలో భారత్ తొలి విజయం

అయితే హర్మూజ్ నుంచి రావడానికి ఇరాన్ పరోక్షంగా సహకరించిందని సమాచారం. హర్మూజ్ అంతరాయాలతో భారత్‌లో ఇంధన ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ సమయంలో షెన్‌లాంగ్ విజయవంతంగా దేశానికి చేరడం, మరోవైపు భారత పతాక నౌకలు హర్మూజ్‌నుంచి వెళ్లొచ్చని ఇరాన్ అనుమతిచ్చినట్లు వార్తలు రావడం ఊరటనిస్తోంది. దీనిని నడిపిన కెప్టెన్ కూడా ఇండియనే. లైబీరియా జెండాతో ఉన్న షెన్‌లాంగ్ సూయెజ్‌మాక్స్ చమురు ట్యాంకర్ బుధవారం ముంబయి నౌకాశ్రయానికి చేరుకుంది. మూడు రోజుల క్రితమే అది హర్మూజ్ ను దాటింది. తన ప్రయాణాన్ని ఎవరూ ట్రాక్ చేయకుండా చురుగ్గా వ్యవహరించింది. మార్చి ఒకటిన ఈ ట్యాంకర్ సౌదీ అరేబియా పోర్ట్ వద్ద చమురు లోడ్ చేసుకుంది. మారిటైమ్ ట్రాకింగ్ డేటా ప్రకారం.. దాని సిగ్నల్స్ మార్చి 8న హర్మూజ్‌లో కనిపించాయి. ఆ తర్వాత అది జాడలేకుండా పోయింది. నౌకలోని సిబ్బంది ఆటోమేటిక్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్ , ట్రాన్స్‌పాండర్లను స్విచ్ఛాఫ్ చేశారని తెలుస్తోంది. ప్రస్తుతం అడుగడుగునా ప్రమాదకరంగా మారిన హర్మూజ్‌లో గుర్తింపు తెలియకుండా సిబ్బంది ఈ నిర్ణయం తీసుకున్నారు. జలసంధిని దాటి ఇండియా దిశగా ప్రయాణిస్తున్నప్పుడు.. అంటే ఒకరోజు తర్వాత మళ్లీ ట్రాకింగ్ సిస్టమ్స్‌లో ఈ షిప్ కనిపించింది. సంక్షోభ సమయాల్లో ప్రత్యర్థులకు చిక్కకుండా ఉండేందుకు అసాధారణ పరిస్థితుల్లో షిప్పింగ్ కంపెనీలు ఈ టెక్నిక్‌ను వాడుతుంటాయి. దీనిని గోయింగ్ డార్క్ గా చెప్తుంటారు. అంతర్జాతీయ సముద్రయాన నిబంధనల ప్రకారం.. భద్రత, రియల్ టైమ్ ట్రాకింగ్ కోసం ఏఐఎస్‌ను ఎప్పుడూ యాక్టివ్‌గానే ఉంచాలి. ఇక, ఇప్పుడు ముంబయికు షెన్‌లాంగ్.. 1,35,335 మెట్రిక్ టన్నుల చమురును మోసుకొచ్చింది. గ్రీస్‌లోని డైనకామ్ ట్యాంకర్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ ఈ నౌక కార్యకలాపాలు చూస్తోంది. 29 మంది సిబ్బందిలో భారతీయులతో సహా పాకిస్థాన్, ఫిలిప్పీన్స్ జాతీయులు ఉన్నారు. కెప్టెన్ సుక్షాంత్ సింగ్ సింధు భారతీయుడే కావడం విశేషం.

## దేశంలో ఇంధన కొరత లేదు

న్యూఢిల్లీ : పశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ దేశంలో ఇంధన భయాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో గురువారం ఎల్‌పీజీ అంశంపై లోక్‌సభలో వాడీవేడి చర్చ జరిగింది. చర్చలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఎప్‌స్టీన్ ఫైళ్ల ప్రస్తావన తీసుకురావడంతో తీవ్ర గందరగోళం ఏర్పడింది. అయితే ఇంధన కొరతపై కేంద్రమంత్రి నిరసనల మధ్యే తన ప్రకటన చేశారు. భారత్‌లో ఇంధన కొరత లేదని, తగినన్ని క్రూడాయిల్ నిల్వలు ఉన్నాయని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి తెలిపారు. పెట్రోల్, డీజిల్, విమాన ఇంధన సరఫరాలో ఎలాంటి కొరత లేదని చెప్పారు. దేశీయ రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయని అన్నారు. ప్రజలు ఎలాంటి వదంతులు వ్యాప్తి చేయవద్దని కోరారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో ఎల్‌పీజీ లభ్యతపై ఆందోళన నెలకొనడంతో కేంద్ర మంత్రి లోక్‌సభలో మాట్లాడారు. 'ఆధునిక ఇంధన చరిత్రలో ప్రపంచం ఇలాంటి క్లిష్ట సమయాన్ని మునుపెన్నడూ ఎదుర్కోలేదు. భారత్ తన ముడి చమురు అవసరాల కోసం సురక్షితమైన సరఫరాలను సమకూర్చుకుంది. హర్మూజ్ సంక్షోభంతో భారత్‌కు సంబంధం లేదు. హర్మూజ్ జలసంధి భారత్‌కు తెరిచారు. ప్రధానమంత్రి చర్చలతో పరిస్థితులు సర్దుకుంటున్నాయి' అని హర్దీప్ సింగ్ తెలిపారు. ఎలాంటి సంక్షోభం తలెత్తినా ఎదుర్కొనేందుకు కూడా కేంద్రం సిద్ధంగా ఉందని చెప్పారు. డొమెస్టిక్ సిలిండర్ల సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేవని మంత్రి వివరించారు. సిలిండర్ల సరఫరాలో ఆసుపత్రులు, విద్యాసంస్థలకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు చెప్పారు. సిలిండర్ బుకింగ్‌కు నగరాల్లో 25 రోజుల వ్యవధి, గ్రామాల్లో 45 రోజుల వ్యవధి అమలు చేస్తున్నట్టు చెప్పారు. ఎల్ఎన్‌జీ కార్గోలు దాదాపు ప్రతిరోజూ ప్రత్యామ్నాయ సరఫరా రూట్లలో ఇండియాకు వస్తున్నాయని తెలిపారు. ఒకవేళ ఘర్షణలు సుదీర్ఘకాలం కొనసాగినప్పటికీ తగినంత గ్యాస్ ఉత్పత్తి, సరఫరా ఏర్పాట్లు చేయగలిగే స్థితిలో ఇండియా ఉందని అన్నారు. గృహాలు, పరిశ్రమలకు అవసరమైన విద్యుత్ ఉత్పత్తికి ఎలాంటి ఇబ్బంది లేదని చెప్పారు. రిఫైనరీలకు తగిన ఆదేశాలు ఇవ్వడం ద్వారా గత ఐదు రోజులుగా 28 శాతం ఎల్పీజీ ఉత్పత్తి పెరిగినట్టు హర్దీప్ సింగ్ పురి తెలిపారు. లక్షలాది భారతీయ కుటుంబాల వంటిళ్లలో ఎలాంటి కొరత లేకుండా చూసేందుకు మోదీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, డొమిస్టిక్ సప్లయ్‌కు పూర్తి భరోసా ఉందని చెప్పారు. ప్రధాని మోదీ చర్చల వల్ల పరిస్థితులు సర్దుకుంటున్నాయి. పెట్రోల్, డీజిల్, ఏటీఎఫ్ సరఫరాలో ఎలాంటి కొరత లేదు. దేశీయ రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయి. గృహ వినియోగ సిలిండర్ల సరఫరాకు ఇబ్బందులు లేవు. 60 శాతం ఎల్‌పీజీని మనం గల్ఫ్ దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. సిలిండర్ల సరఫరాలో ఆస్పత్రులు, విద్యాసంస్థలకు ప్రాధాన్యత ఇస్తున్నాం. సిలిండర్ బుకింగ్‌కు నగరాల్లో 25, గ్రామాల్లో 45 రోజుల గడువు విధించాం. ప్రపంచం ఇలాంటి ఇంధన సంక్షోభాన్ని ఎన్నడూ చూడలేదు. ఇతర దేశాలతో పోలిస్తే భారత్ పరిస్థితి మెరుగ్గా ఉందని తెలిపారు. మంత్రి మాట్లాడుతుండగానే రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ సభ నుంచి వెళ్లిపోయారు.

## నిజామాబాద్ జిల్లాలో దారుణ హత్య

### కాంగ్రెస్ నేతను హతమార్చిన సమీప బంధువు

### కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు

నిజామాబాద్,మార్చి12 : నిజామాబాద్ జిల్లాలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఇందల్వాయి మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపీ గురువారం దారుణ హత్యకు గురయ్యారు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లాలోనే కాకుండా తెలంగాణ రాజకీయ వర్గాల్లో కూడా తీవ్ర చర్చకు దారితీసింది. కుటుంబ రాజకీయ విభేదాలు ఈ హత్యకు కారణంగా తెలుస్తోంది. ముఖ్యంగా గ్రామస్థాయి రాజకీయాల్లో పెరిగిన విభేదాలు చివరకు రక్తపాతం వరకు వెళ్లినట్లు సమాచారం. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలంలో ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. కాంగ్రెస్‌లో కీలక నేతగా గుర్తింపు పొందిన ఇమ్మడి గోపీపై ఆయనకు బంధువైన సతీశ్ దాడి చేశాడు. ముందుగా కారుతో గుద్ది, అనంతరం కత్తితో దాడి చేసి గోపీని హత్య చేసినట్లు పోలీసులు చెబుతున్నారు. ఈ దాడిలో తీవ్ర గాయాల కారణంగా గోపీ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటన అనంతరం సతీశ్ నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని విచారణ ప్రారంభించారు. సతీశ్, ఇమ్మడి గోపీకి వరుసకు మేనల్లుడు. ఒకే కుటుంబానికి చెందిన వారైనా, గ్రామ రాజకీయాల్లో ఏర్పడిన విభేదాలు వారిద్దరి మధ్య తీవ్ర శత్రుత్వంగా మారాయి. గ్రామంలో రాజకీయంగా ఇద్దరూ ప్రభావం చూపే స్థాయిలో ఉండటంతో, కాలక్రమేణా వీరి మధ్య విభేదాలు పెరిగాయి. ముఖ్యంగా గ్రామ సర్పంచ్ ఎన్నికల తర్వాత ఈ విభేదాలు మరింత తీవ్రమయ్యాయని స్థానికులు చెబుతున్నారు. గత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గౌరవరం గ్రామంలో సర్పంచ్ పదవికి ఇమ్మడి గోపీ భార్య పోటీ చేసి విజయం సాధించారు. అదే ఎన్నికల్లో సతీశ్ భార్య కూడా సర్పంచ్ పదవికి పోటీ చేశారు. అయితే ఆ ఎన్నికల్లో ఆయన భార్య ఓడిపోయారు. అప్పటి నుంచి రెండు కుటుంబాల మధ్య రాజకీయంగా తీవ్రమైన విభేదాలు మొదలయ్యాయి. గ్రామ రాజకీయాల్లో ఆధిపత్యం కోసం ఇరువర్గాల మధ్య తరచూ గొడవలు జరిగేవని తెలుస్తోంది. సర్పంచ్ ఎన్నికల ఫలితాల తర్వాత పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. చిన్న చిన్న విషయాలపై కూడా ఇరువర్గాల మధ్య తగాదాలు జరిగేవని సమాచారం. ఇమ్మడి గోపీ హత్యతో గౌరవరం గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఘటన తెలిసిన వెంటనే గ్రామానికి పెద్దఎత్తున పోలీసులు చేరుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గ్రామంలో భద్రతను పెంచారు. స్థానికంగా గోపీ కీలక నాయకుడిగా గుర్తింపు పొందారని ఆయన అనుచరులు చెబుతున్నారు. గోపీ మరణంతో గ్రామ ప్రజలు కూడా తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. హత్య చేసిన తర్వాత సతీశ్ పోలీసులకు లొంగిపోయాడు. ఆ తర్వాత అతన్ని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. హత్యకు అసలు కారణాలు ఏమిటి..?, ముందుగా ప్రణాళికతోనే గోపీని హత్య చేశాడా..? అనే పలు కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రాథమికంగా చూస్తే కుటుంబ రాజకీయ విభేదాలే ఈ హత్యకు ప్రధాన కారణంగా పోలీసులు భావిస్తున్నారు. అయితే పూర్తి వివరాలు దర్యాప్తు తర్వాతే వెల్లడయ్యే అవకాశం ఉంది.

## డిఫెన్స్ రంగంలో సరికొత్త అధ్యాయం

నెల్లూరు : ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాలతో పాటు రక్షణ , తయారీ రంగాల్లోనూ ఏపీని గ్లోబల్ హబ్‌గా మార్చాలన్న లక్ష్యంతో నెల్లూరు జిల్లాలో ఒక భారీ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. నెల్లూరు జిల్లా జువ్వలదిన్నెలో సాగర్ డిఫెన్స్ సంస్థ ఏర్పాటు చేయనున్న అటానమస్ మారిటైం షిప్ యార్డుకు రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ భూమిపూజ చేశారు. ఇది ప్రపంచంలోనే మొట్టమొదటి అటానమస్ మారిటైం షిప్ యార్డు కావడం విశేషం. ఈ ప్రాజెక్టు ద్వారా రక్షణ రంగానికి అవసరమైన అత్యాధునిక నౌకల నిర్మాణం ఇక్కడ జరగనుంది. సాగర్ డిఫెన్స్ ఇంజినీరింగ్ పరిశ్రమ ఏపీకి వస్తున్నందుకు ఆనందంగా ఉందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. దీంతో స్థానిక మత్స్యకారుల జీవితాల్లో మార్పులు వస్తాయన్నారు. ఈ పరిశ్రమ వల్ల 25 వేల మత్స్యకార కుటుంబాలకు లబ్ధి జరుగుతుందని చెప్పారు. మత్స్యకార కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. సుదీర్ఘ సముద్ర తీరం ఉండటం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని చెప్పారు. జువ్వలదిన్నెలో అటానమస్ మారిటైమ్ షిప్‌యార్డును సాగర్ డిఫెన్స్ అభివృద్ధి చేయనుంది. మొదటి దశలో రూ.45 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. 750 మందికిపైగా ఉద్యోగాలు కల్పించనుంది. ముంబయి కేంద్రంగా పనిచేసే సాగర్ డిఫెన్స్ సంస్థ.. అన్‌మాన్డ్ మెరైన్ సర్ఫేస్ వెహికల్స్ రంగంలోనూ పనిచేస్తోంది. ఇప్పటికే దేశ నౌకాదళం, ఐడెక్స్ (ఐడీఈఎక్స్), ఇతర భద్రతా సంస్థలతో పని చేస్తోంది. ఇక్కడ ఇంటెలిజెన్స్ మారిటైం సిస్టమ్స్, సెన్సార్లు, కమాండ్ కంట్రోల్ టెక్నాలజీలను అభివృద్ధి చేయనున్నారు. భవిష్యత్తులో ఆధునిక నౌకా దళ కార్యకలాపాలకు ఈ షిప్‌యార్డు కీలకం కానుంది. మానవరహిత నౌకలు , అత్యాధునిక సాంకేతికతతో కూడిన యుద్ధ నౌకల తయారీకి ఈ కేంద్రం చిరునామాగా మారబోతోంది. ఏపీని కేవలం ఐటీ రంగంలోనే కాకుండా.. తయారీ, రక్షణ రంగాల్లో కూడా దేశంలోనే అగ్రస్థానంలో నిలుపుతామని ధీమా వ్యక్తం చేశారు. యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేసి.. ప్రపంచ స్థాయి నౌకల తయారీని ఇక్కడి నుంచే ప్రారంభించేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. జువ్వలదిన్నె పోర్ట్ ఆధారంగా ఈ ప్రాంతం రానున్న రోజుల్లో భారీ పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చెందనుంది. నెల్లూరు జిల్లాలో సాగర్ డిఫెన్స్ అటానమస్ మారిటైమ్ షిప్‌బిల్డింగ్ సిస్టమ్స్ సెంటర్‌కు శంకుస్థాపన చేయడం గర్వకారణమని మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ వ్యాఖ్యానించారు. ప్రపంచంలోనే మొదటి కేంద్రంగా రూపుదిద్దుకోబోతున్న ఈ ప్రాజెక్టు భారతదేశ స్వదేశీ రక్షణ తయారీ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయనుందని పేర్కొన్నారు. గురువారం నెల్లూరు జిల్లాలో మంత్రి నారాయణ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ ప్రాజెక్టు సముద్ర సాంకేతికతలో నూతన ఆవిష్కరణలకు దారి తీస్తూ, మత్స్యకార రంగం, పారిశ్రామిక నైపుణ్యాల అభివృద్ధికి ఊతమివ్వనుందని తెలిపారు. తీర ప్రాంత పర్యవేక్షణ, భద్రత, రక్షణ సిద్ధతను మరింత బలపరచడంలో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషించనుందని చెప్పుకొచ్చారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును నెల్లూరు జిల్లా జువ్వలదిన్నెకు తీసుకురావటంలో కృషి చేసిన మంత్రి నారా లోకేశ్‌కు మంత్రి నారాయణ అభినందనలు తెలిపారు.

## జిల్లాలో టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

### అన్ని కేంద్రాలను సిద్ధం చేసిన అధికారులు

వరంగల్,మార్చి12 : వరంగల్ జిల్లాలో పదవ తరగతి పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 14 నుంచి ఏప్రిల్ 13 వరకు పరీక్షలు కొనసాగనున్నాయి.ఈ నెల 14 లోగా విద్యార్థులను పరీక్షలకు సమాయత్తం చేసే పనిలో జిల్లా విద్యా శాఖ నిమగ్నమైంది. జిల్లాలో పదవ తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ ఇప్పటికే పలుదఫాలుగా సమన్వయ సమావేశాలు నిర్వహించారు. అందుకు అనుగుణంగా విద్యాశాఖాధికారులు ఏర్పాట్లను సైతం పూర్తి చేశారు. ఈ ఏడాది జిల్లాలో 288 పాఠశాలల నుంచి మొత్తం 9,492 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. పది ఫలితాల్లో జిల్లాను ముందంజలో ఉంచేం దుకు ఇప్పటికే ప్రణాళికబద్ధమైన పటిష్టమైన చర్యలను విద్యా శాఖ చేపట్టింది. స్పెషల్ క్లాసులు, రివిజన్ క్లాసులు, నిపుణులతో విద్యార్థులకు అవగాహన తరగతులు నిర్వహిస్తోంది. జిల్లాలోని 288 పాఠశాలల నుంచి 9,492 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఇందులో 4,932 మంది బాలురు పరీక్షలకు హాజరు కానుండగా 4560 మంది బాలికలు పరీక్షలు రాయనున్నారు. జిల్లాలో అన్ని వసతులతో కూడిన 47 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. 47 మంది సీఎస్, 48 మంది డీవోలను, 47మంది సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. ప్రశ్నాపత్రాల బట్వాడ కోసం ఆరుగురు రూట్ ఆఫీసర్లు, మరో ఆరుగురు అదనపు రూట్ ఆఫీసర్లను నియమించారు. ముగ్గురు సభ్యులతో కూడిన మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను, 496 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. ఇక 22 పరీక్షా కేంద్రాల్లో శాశ్వత సీసీ కెమెరాలు ఉండగా, మిగిలిన 25 కేంద్రాల్లో తాత్కాలిక సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. పదవ తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని పెంచి రాష్ట్ర స్థాయిలోనే జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తున్నారు. డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్లతో పరీక్షలకు అనుమతిస్తారని, హెడ్మాస్టర్ల సంతకాలతో అవసరం లేదని డీఈవో రంగయ్య స్పష్టం చేశారు. వరంగల్ జిల్లాను పదవ తరగతి ఫలితాల్లో ముందంజలో ఉంచుతామని అన్నారు. ప్రత్యేకమైన ప్రణాళికతో విద్యార్థులను పదవ తరగతి పరీక్షలకు సన్నద్ధం చేసామని, విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా పరీక్షలకు హాజరు కావాలన్నారు.

### విచారణకు హాజరుకాని సునీల్ నాయక్

విజయవాడ,మార్చి12 : ఏపీ ఉపసభాపతి రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్ గరువారం నాటి విచారణకు హాజరు కాలేదు. ఈ నెల 9 వరకు విచారణకు హాజరు కావాలని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. అయితే, విచారణ అధికారి విజ్ఞప్తి మేరకు ఈనెల 12 వరకు విచారణకు హాజరవ్వాలని స్పష్టం చేసింది. విచారణకుచివరిదైనప్పటికీ సునీల్ నాయక్ హాజరు కాకపోవడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

# సంపాదకీయం

## ధాన్యం ఎగుమతి, దిగుమతులను సమీక్షించాలి !

పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలతో ఎగుమతులు, దిగుమతులు ఆగిపోయాయి. ఓ రకంగా ఇది మనం సంక్షోభాన్ని సరిదిద్దుకునే సమయంగా భావించాలి. ఇప్పటికే ఇబ్బడిముబ్బడిగా ధాన్యాలు దిగుమతి చేసుకుంటున్నా భారత్ ఈ దశలో వీటిపై పునరాలోచన చేయాలి. దేశీయంగా పప్పు ధాన్యాలు, నూనె ధాన్యాలు విపరీతరంగా పండుతున్నా, రైతులకు కనీస మద్దతు ధరలు చెల్లించడం లేదు. అలాగే వేసిన పంటలను కొనుగోలు చేయడం లేదు. తెలంగాణలో శనగ, మక్కజొన్నలకు డిమాండ్ లేకుండా పోయింది. శనగ కొనుగోళ్లపై స్పష్టత కరవైంది. రైతులు సాగుచేసిన శనగ పంటకు మద్దతు ధర అందించడానికి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై స్పష్టత కరువైంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. శనగ పంటను నిల్వ ఉంచుకున్న రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కోసం ఎదురు చూస్తున్నారు. పంట పెట్టుబడి కోసం చేసిన అప్పులు తిరిగి చెల్లించడానికి ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వస్తుందని కొంతమంది రైతులు వాపోతున్నారు. ఈ దశలో దేశీయంగా ఆయా రాష్ట్రాల్లో పండుతున్న పంటలను కొనుగోలుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా ఆహార ధాన్యాలను కొనుగోలు చేసి, ప్రజలకు సరసమైన ధరల్లో అందించాలి. అదేవిధంగా దిగుమతులపై పూర్తి ఆంక్షలు విధించాలి. నూనెలు, పప్పులను దిగుమతి చేసుకోవడం తక్షణం ఆపాలి. గత కేంద్ర బడ్జెట్లో వ్యవసాయ రంగానికి, గ్రామీణ ప్రాంతానికి సంబంధించి మూడు పద్దులను అంటే రూ.60 వేల కోట్ల వరకు కేంద్ర ప్రభుత్వం ఖర్చు పెట్టలేదని సమాచారం.. ఈ సంవత్సరం అందుకు భిన్నంగా జరుగుతుందని ఆశించలేం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సంవత్సరం బడ్జెట్లో ధరల స్థిరీకరణ కోసం ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. కేంద్రం ఎఫ్‌సిఐ ద్వారా వివిధ రాష్ట్రాల నుంచి కొనాల్సిన కందులు, శనగలు, పెసలు, మొక్కజొన్నలు లాంటి 25 రకాల పంటలను కొనడానికి నిరాకరించింది. దేశంలోని 24 వేల స్థానిక మార్కెట్లు, 125 ప్రత్యేక మార్కెట్ల నిర్వహణను వదిలేయడం సరైనది కాదు. నిజానికి ధాన్యం సేకరణ, తిరిగి ప్రజలకు వాటిని ఆహార ధానా÷-యల రూపంలో చేరవేయడంలో పక్కా ప్రణాళిక లేకుండా పోయింది. ప్రైవేటు వ్యక్తులు కంపెనీలు, మార్కెట్లు పెట్టుకునేందుకు అనుమతించే బిల్లును గత ఫిబ్రవరిలో పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదింప చేసుకుంది. గత రెండు సంవత్సరాలుగా వరి ధాన్యం, పత్తి, మిర్చి, పొగాకు, ఉల్లిపాయలు, కోకో లాంటి పంటలను కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన మద్దతు ధరలకు కొనేవారే లేకుండా పోయారు. తక్కువ ధరలకు రైతులు అమ్ముకోవలసి వస్తున్నది. నిజానికి వ్యవసాయ విధానం సక్రమంగా ఉంటే, అనవసరపు దుబారా ఖర్చులు తగ్గించి, దేశీయంగా పంటలను ప్రోత్సహించి, ఉన్న పంటలను కొనుగోలు చేయాలి. అలాగే ప్రజలకు తక్కువ ధరలకు నిత్యాసవరాలు సరఫరా చేసే వ్యవస్థను రూపొందించాలి. దీంతో దేశంలో ఆకలి బాధతలు తగ్గడంతో పాటు, కొనుగోలు శక్తి కూడా పెరుగుతుంది. కానీ గొప్పలు చెబుతున్న బిజెపి నేతలు ఒక్కరు కూడా సమగ్ర వ్యవసాయ విధానంపై ఆలోచన చేయడం లేదు. పంటలు పండుతున్నా, సామాన్యులకు ధరలు అందడం లేదు. అలాగే ఇబ్బడి ముబ్బడిగా దిగుమతులు పెంచేస్తున్నారు. ఉన్న వ్యవసాయాన్ని నాశనం చేసే చట్టాలు చేయడం, పార్లమెంట్, అసెంబ్లీల్లో వ్యవసాయ ధరలు లేక రైతులు బాధపడుతున్నారని మొసలి కన్నీరు కార్చడం అలవాటైపోయింది. ఇకపోతే న కిలీ విత్తనాలు కూడా రైతులను నట్టేట ముంచుతున్నాయి. విత్తనాలు అమ్మిన కంపెనీలపై చర్యలు తీసుకోవడం లేదు.కంపెనీ దగ్గర కొన్న విత్తనాలు సరిగ్గా మొలవకపోయినా, తగిన దిగబడి రాకపోయినా తర్వాత వ్యవసాయ సీజన్ లోపు రైతులకు నష్టపరిహారం చెల్లించాలని 2001 విత్తన బిల్లులో ఉంది. కానీ ఈ తాజా బిల్లు ప్రకారం కంపెనీ విత్తనాలు రెండుసార్లు మొలవకపోయినా, సరైన దిగుబడులు రాకపోయినా ఆ రైతులకు ఎలాంటి నష్టపరిహారం చెల్లించనవసరం లేదు. మూడవసారి ఆ కంపెనీ విత్తనాలు విఫలమైతే ఆ కంపెనీ ప్రభుత్వానికి ఫెనాల్టీ చెల్లించాలని బిల్లులో ఉంది కానీ రైతులకు నష్టపరిహారం చెల్లించాలని లేదు.పంటల బీమా చట్టం' కార్పొరేట్ కంపెనీలకు ధీమా కల్పిస్తున్నది కానీ రైతులకు కాదు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ఆపరేషన్ గైడ్‌లైన్స్ మాత్రం వివరంగా ఉన్నాయి. ఆచరణలో ఈ పద్దు కింద ప్రతి సంవత్సరం కేటాయించే రూ.15 వేల కోట్లలో ఐదు వేల కోట్లు కూడా రైతులకు చేరడం లేదు. రూ.10 వేల కోట్లను కార్పొరేట్ బీమా కంపెనీలు మింగేస్తున్నాయి. వాతావరణం, క్రాప్ కటింగ్ ఎక్స్‌పరిమెంటేషన్‌లో ప్రైవేట్ కంపెనీల డేటాను వాడుతున్నారు. ప్రభుత్వ వ్యవసాయ బీమా కంపెనీలు డమ్మీలుగా మిగిలిపోతున్నాయి. ప్రైవేట్ కంపెనీదే పెత్తనం, వారే దోచేస్తున్నారు.వ్యవసాయానికి సంబంధించి పురుగు మందులలో అత్యంత దోపిడి జరుగుతున్నది. 100 రూపాయల మందుని వెయ్యి రూపాయలకు, 300 రుపాయలది 3 వేలకు అమ్ముతూ వ్యాపారస్తులు అడ్డగోలుగా దోపిడీ చేస్తున్నారు. దీనికి కారణం 'నూతన పురుగు మందుల విధానం'లో ఎం.ఆర్.పి విధానం పాటించాలని లేకపోవడమే. పురుగులను చంపడానికి ఆ ద్రావకంలో ఎంత శాతం ముందు ఉండాలో అది ఉండక పోయినా వ్యాపాం స్థులను అడిగేవారు లేరు. ఇలాంటి సమస్యలన్నీ చర్చించాలి. ఇందు కు తగిన సమయం ఇదే. సమగ్ర వ్యవసాయ విధానం, ఎగుమతులు దిగుమతులపై చర్చించాలి. దేశీయ పంటలను పండించుకుని తినేలా వ్యవస్థీకృత పద్ధతిని తీసుకుని రావాలి. అప్పుడే దేశం ఆర్థికంగా బలపడుతుంది. మన రైతులు ఆనందంగా ఉంటారు.

# దిక్కుతోచని శనగ, మక్కరైతులు



### కొనుగోలు కేంద్రాలు లేక ఆందోళన

### ఉన్నతాధికారులకు నివేదించామన్న మార్క్‌ఫెడ్

నిజామాబాద్,మార్చి12 : జిల్లాలో శనగ, మక్క రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటలు పండించినా కొనుగోలు చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అడ్డికి పావుసేరు అన్నట్లుగా ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకోవాల్సి వస్తోంది. అయితే ఈ సమస్యలపై అధికారుల నుంచి స్పష్టమైన హామీలు రావడం లేదు. శనగ కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై ఉన్నతాధికారులకు నివేదికను అందజేశామని మార్క్‌ఫెడ్ డీఎం శశిధర్ అన్నారు. ఎన్‌సీసీ వారి నుంచి అనుమతులు రాగానే కేంద్రాలు ఏర్పాటు చేసి శనగలు కొనుగోలు చేస్తామని చెప్పారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తే మద్దతు ధర రూ.5,875 లభిస్తుందనే ఆశతో ఎదురుచూస్తున్న రైతులకు నిరాశ తప్పడంలేదు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో గత్యంతరం లేక పెట్టుబడి కోసం తెచ్చిన అప్పులు, కుటుంబ అవసరాల కోసం దళారులకు రూ.4,900 నుంచి రూ.5,300 వరకు విక్రయించి నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనగ పంట సాగు చేయడానికి పెట్టుబడి ఖర్చు ఎక్కువ కావడం, వాతావరణ పరిస్థితులు అనుకూలించక పోవడంతో దిగుబడి తక్కువగా వచ్చి సుమారు ఎకరానికి రూ.5,600 ఖర్చుయినట్లు రైతులు చెబుతున్నారు. ప్రభుత్వ మద్దతు ధర లేక నష్టపోతున్నామని వాపోతున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రైవేట్‌లో వ్యాపారులు తక్కువ ధర అంటే రూ.5,100లకే అడుగుతున్నారు. ముందుగానే కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై పంటను సేకరించి ఉంటే ఇబ్బందులు వచ్చేవి కావని అంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎవరూ పట్టించుకోవడం లేదు. తక్కువ ధరకే అమ్మి రైతులు నష్టపోతున్నారు. పంట కోతకు వచ్చే సమయంలోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తేనే రైతులు పంటలు అమ్ముకోగలరని అంటున్నారు. దీంతో రైతులకు శనగ విక్రయాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులు రాజ్యమేలు తున్నారు. రైతులు నిల్వ సౌకర్యం లేక, చేసిన అప్పుల ఒత్తిడితో పంటను అమ్ముకోవాల్సి వస్తున్నది. రైతుల అవసరాలను ఆసరాగా తీసుకుని దళారులు తక్కువ ధరకే శనగలు కొనుగోలు చేసి, సరిహద్దులో ఉన్న మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు తరలిస్తున్నారు. అక్కడ ఎక్కువ ధరకు విక్రయించి లాభాలు గడిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి శనగ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

# రైతులను బలహీనం చేసేలా చట్టాలు

### కౌలు రైతులను విస్మరిస్తున్న పాలకులు

### వ్యవసాయరంగం మరింత సంక్షోభంలోకి నెట్టే చర్యలు

అమరావతి,మార్చి12 : పేద రైతు, కౌలు రైతు కేంద్రంగా ఉన్న వ్యవసాయాన్ని చట్టాల ద్వారా కార్పొరేట్లకు కట్టబెట్టడానికి మార్గం సిద్ధం చేస్తున్నారనేది స్పష్టంగా తెలుస్తుంది. వ్యవసాయ సంక్షోభం, యువరైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయేగాని తరగడం లేదు. అందుకుగల కారణాలను, పరిష్కారాలను కనిపెట్టడంలో ప్రభుత్వం వైపు నుండి వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. చంద్రబాబు నాయుడు రాష్ట్ర అసెంబ్లీలో 'డిజిటల్ అగ్రికల్చరల్ మిషన్' పత్రాన్ని ప్రవేశ పెట్టినప్పుడు కొన్ని ముఖ్యాంశాలను ప్రస్తావించారు. స్వర్ణాంధ్ర 2047 సాధించే సమయానికి వ్యవసాయరంగంపై ఆధారపడే జనాభా 60 శాతం నుండి 10 శాతానికి పడిపోతుందని అంచనా వేస్తున్నారు. నేడున్న వ్యవసాయ భూములు కూడా 30 శాతం చాలవని అంటున్నారు.. మిగతాది అవసరం లేదన్న ధోరణి కనిపిస్తోంది. అంటే ఆ భూములను ఎవరికైనా అమ్ముకోవచ్చన్న ధోరణి కనిపిస్తోంది. వ్యవసాయ రంగంలో మిగిలిపోయే మిగతా 50 శాతం జనాభాను పట్టణాలకు తరలించి వారిని చీప్ లేబర్‌గా వాడుకోవచ్చన్న దుర్మార్గ ఆలోచన కూడా ఇందులో ఇమిడి ఉంది. కేంద్ర ప్రభుత్వం సైతం ఈ సంవత్సరం 100 లక్షల ఎకరాలను అమ్మకానికి సిద్ధం చేసింది. నూతన నీటి విధానం' ప్రకారం కాలువలకు, పొలాలకు మీటర్లు పెట్టి నీటి వాడకాన్నిబట్టి రైతుల నుండి చార్జీలు వసూలు చేస్తారు. పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణానికి కంపెనీల నుంచి పెట్టుబడులు ఆహ్వానిస్తారు. ఈ విధానం పేద రైతులకు వ్యతిరేకమైనదిగా గుర్తించాలి. అప్పుడు సాగునీరు చాలా ఖరీదైనదిగా మారుతుంది. ఇకపోతే విత్తన బిల్లు 2025' చూస్తే రైతులకు ఆందోళన కలుగుతుంది. విద్యుత్ సవరణ చట్టం 2025' ప్రకారం మొత్తం విద్యుత్ వ్యవస్థను ప్రైవేటీకరించడం ప్రధానాంశం. ఐదు సంవత్సరాలలో క్రాస్ సబ్సిడీని రద్దు చేయాలనేది మరో కీలకాంశం. ఇది మెట్ట ప్రాంతాలలో, గిరిజన ఏరియాలో, వెనుకబడ్డ ప్రాంతాలలో చిన్న రైతుల పంపుసెట్లు, లిఫ్టుల వ్యవసాయాన్ని బాగా దెబ్బతీస్తుంది. ఎరువుల విధానం 2025' ప్రకారం ఎరువులపై ప్రభుత్వ నియంత్రణ తొలగించారు. సకాలంలో రైతులకు అందక పోయినా, ఉండాల్సిన నాణ్యత లేకపోయినా, ధర పద్ధతులలో తేడాలున్నా ప్రభుత్వ యంత్రాంగానికి బాధ్యత లేదు. ఇప్పుడు ఈ విధానంలో అదనంగా నానో లిక్విడ్ యూరియాను ప్రవేశ పెట్టింది. దాంట్లో నత్రజని 45 శాతం నుంచి 4 శాతానికి తగ్గుతుంది. యూరియాపై ప్రభుత్వ సబ్సిడీ మొత్తం తగ్గించి నగదు బదిలీ పథకం పెట్టాలని కేంద్రం రాష్ట్రాలను కోరుతోంది. నానో యూరియా తీసుకున్న రాష్ట్రంలో బస్తాకు రూ.800 సబ్సిడీ ఇస్తానని ప్రకటించింది. ప్రకృతి విపత్తుల చట్టం 25, సెక్షన్ 12లో బాధితులను ఆదుకోవడానికి వున్న సూచనలు తొలగించారు. సెక్షన్ 13లో పంటలు కోల్పోయిన రైతులకు చెందిన రుణాలు వాయిదా వేసి తిరిగి పంట రుణాలు రీషెడ్యూల్ చేసే చాప్టర్‌ను తొలగించారు.

# పెరుగుతున్న ఎండల తీవ్రత

### జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

హైదరాబాద్,మార్చి12 : తెలుగు రాష్ట్రాల్లో ఎండలు మరింత వేడెక్కిస్తున్నాయి. ఉదయం 8 గంటలకే సూరీడు సుర్రుమంటున్నాడు. రాయలసీమ, గోదావరి జిల్లాల్లో ఎండలు తీవ్రం అవుతున్నాయి. తెలంగాణతో పాటు హైదరాబాద్ నగరంలో కూడా ఎండలు దంచికొడుతున్నాయి. భానుడి భగభగలతో నగర ప్రజలు విలవిల్లాడుతున్నారు. ప్రస్తుతం 40-42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వేసవి ప్రారంభంలోనే ఇలా ఉంటే.. ముందు ముందు పరిస్థితి ఏ విధంగా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. ఏప్రిల్, మే నెలల్లో ఎండల తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో చిన్నపిల్లల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని, బయటికి రాకుండా చూసుకోవాలి. రోజుకు తప్పని సరిగా నాలుగు లీటర్ల నీరు తాగితే డీహైడ్రేషన్ నుంచి బయట పడవచ్చు. పిల్లలపై ఎండ ప్రభావం పడకుండా పలుచని నూలు వస్త్రాలు ధరింపజేయాలి.ఉదయం 9 గంటలకే ఎండ వేడిమి అధికం కావడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. అతి ముఖ్యమైన పని ఉంటేనే బయటకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం సమయంలో రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. ఎండల నుంచి రక్షణ పొందేందుకు కొన్ని జాగ్రత్తలు పాటించాలి వైద్యులు సూచిస్తున్నారు. ఈ ఎండాకాలంలో మనుషులతో పాటు, పశవులకు కూడా ఆరోగ్య చర్యలు అవసరమని సూచిస్తున్నారు. ఎండను తాళలేక కొందరు ఎక్కువ సార్లు స్నానం చేయడం మంచిది కాదు. శరీరం బలహీనపడుతుంది. ఒక్కోసారి శరీరం ఉష్ణోగ్రతలు ఉండాల్సిన దానికంటే దిగువకు పడిపోతాయి. దీంతో స్పృహకోల్పోవడం, ఒక్కోసారి ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. కావున ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. డీహైడ్రేషన్‌కు గురికుండా ఉండేందుకు ఎక్కువ సార్లు నీరు తాగాలి. బయటకు వెళ్లేవారు వెంట మంచి నీరు తీసుకెళ్లాలంటున్నారు. దాహార్తిని తీర్చేందుకు పండ్ల రసాలు, కొబ్బరినీళ్లు, శీతల పానీయాలు తాగడం ఆరోగ్యానికి మంచిది. వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు ముఖ్యమైన పనులపై బయటికి వెళ్లేవారు తప్పని సరిగా తలకు టోపీ పెట్టుకోవాలని, గొడుగు వేసుకొని వెళ్లాలని, పాదరక్షలు ధరించాలని వైద్యులు సూచిస్తున్నారు.

# కాశ్మీర్ మాజీ సిఎం ఫరూక్ అబ్దుల్లాపై హత్యాయత్నం


### తృటిలో తప్పించుకున్న మాజీ ముఖ్యమంత్రి

### తనది 20 ఏళ్ల పగ అన్న దుండగుడు

జమ్ము,మార్చి12 : జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లాపై హత్యాయత్నం జరిగింది. ఓ వివాహ వేడుకలో నిందితుడు ఆయనపై కాల్పులకు పాల్పడేందుకు ప్రయత్నించాడు. వెంటనే భద్రతా సిబ్బంది అప్రమత్తమవడంతో.. ఫరూక్ సురక్షితంగా బయటపడ్డారు. 20 ఏళ్లుగా తాను ఫరూక్‌ను చంపాలనుకుంటున్నానని నిందితుడు పోలీసులతో పేర్కొన్నాడు. బుధవారం జమ్మూ శివార్లలోని హోటల్‌లో జరిగిన ఓ వివాహ వేడుకకు ఫరూక్ అబ్దుల్లా హాజరయ్యారు. ఆయనతో పాటు జమ్మూకశ్మీర్ డిప్యూటీ సీఎం సురీందర్ ఛౌదరీ కూడా ఉన్నారు. ఈ క్రమంలో ఓ వ్యక్తి వెనక నుంచి ఫరూక్‌పై పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో తుపాకీతో కాల్చేందుకు ప్రయత్నించాడు. అక్కడ ఉన్నవారు వెంటనే అతడిని పట్టుకొని చితకబాదారు. దీనికి సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు కూడా తాజాగా వెలుగులోకి వచ్చాయి. నిందితుడు జమ్మూకి చెందిన 63 ఏళ్ల కమల్‌సింగ్ జమ్వాల్‌గా పోలీసులు గుర్తించారు. జమ్మూలో దుకాణాలు నడుపుతోన్న కమల్ విచారణ సమయంలో కీలక విషయాలు వెల్లడించాడు. గత 20 ఏళ్లుగా తాను ఫరూక్ అబ్దుల్లాను చంపాలనుకుంటున్నానని పేర్కొన్నాడు. ఇది తన వ్యక్తిగత అజెండాగా వెల్లడించాడు. కాల్పులకు ఉపయోగించిన తుపాకీకి లైసెన్స్ ఉన్నట్లు తెలిపాడు. ఘటన సమయంలో నిందితుడు మద్యం మత్తులో ఉన్నాడని పోలీసులు పేర్కొన్నారు. తుపాకీని స్వాధీనం చేసుకున్నామని, ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. తన తండ్రిపై జరిగిన హత్యాయత్నంపై జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా స్పందించారు. లోడ్ చేసిన తుపాకీతో తన తండ్రిని ఓ వ్యక్తి కాల్చేందుకు ప్రయత్నించాడని పేర్కొన్నారు. అయితే, భద్రతా సిబ్బంది అప్రమత్తతతో అది విఫలమైందన్నారు. ఫరూక్‌కు జెడ్ ప్లస్ భద్రత ఉన్న విషయాన్ని ఒమర్ ప్రస్తావించారు. ఇంత భద్రత ఉన్నా.. నిందితుడు అంత దగ్గరగా ఎలా రాగలిగాడని ప్రశ్నించారు. ఇక, భద్రతా వైఫల్యం కారణంగానే ఈ ఘటన చోటుచేసుకుందని ఉప ముఖ్యమంత్రి ఛౌదరి పేర్కొన్నారు.

# అంతటా ఉన్న అంతర్యామి

కృష్ణుడు అర్జునునితో 'నేను నా యోగమాయతో కప్పి ఉండటం వల్ల అందరికీ గోచరింపను లేదా అందరూ నన్ను దర్శించలేరు. అజ్ఞానులు తమవలెనే నాకూ జననమరణాలు ఉంటాయని భ్రమ చెందుతున్నారే కానీ, నన్ను శాశ్వతునిగా, జన్మరహితునిగా, పరమేశ్వరునిగా తెలుసుకోలేకపోతున్నారు' అన్నాడు. యోగమాయ అంటే ఏమిటి? అజుడు, అవ్యయుడు అయిన భగవంతుడు అవసరార్థం అవతరించడం, ప్రయోజనం సిద్ధించాక అవతార సమాప్తి జరగడం సాధారణంగా జరుగుతుంది. ఈ ప్రక్రియలో భగవంతుడూ సాధారణ మానవుల్లాగానే పుట్టడం, గిట్టడం కనిపించినా తత్వం తెలియని వారు అవతరించడం జననంగా, అవతార సమాప్తిని మరణంగా భ్రమిస్తారు. భగవంతుడు యోగశక్తిని విశ్వమంతటా వ్యాపింపచేసి అనేక రూపాలలో ప్రపంచంలో వెలుగుతూ ఉండటం వల్ల ఆ యోగశక్తిలో దాగిన భగవంతుని సత్య స్వరూపాన్ని గుర్తించడం సామాన్యులకు అలవికాదు. ఆ యోగశక్తినే యోగమాయగా చెబుతారు. యోగమాయతో కప్పి ఉన్న కారణంగా దార్శనికత లేని సామాన్యులు అంతర్యామిని దర్శించలేరు. అయితే ఎవరైతే సర్వ సమర్పణా భావనతో, సంపూర్ణమైన శ్రద్ధాసక్తులతో, తెలుసుకోవాలనే జిజ్ఞాసతో భగవంతుడిని అన్వేషిస్తారో వారు మాత్రమే భగవంతుడిని సాక్షాత్కరింప చేసుకోగలరు. అయితే.. ఇక్కడ ఒక సందేహం.. జీవుడు మాయచే కప్పి ఉండటం సహజమే కాని భగవంతుడు కూడా అలా ఉండటం ఎలా జరుగుతుంది? సూర్యుడిని మేఘాలు కప్పివేశాయి అంటాం. నిజంగా సూర్యుడిని మేఘాలు కప్పివేయవు కదా! సూర్యుడికి మానవుల దృష్టికి మధ్య మేఘాలు నిలిచాయి. అలాగని కప్పలేదా అంటే కప్పినట్లు మనం చూస్తున్నాం. అంటే.. కప్పడం అనేది వ్యావహారిక సత్యం కాగా కప్పబడకపోవడం పారమార్థిక సత్యం. నిజానికి మాయ భగవంతుడిని కప్పివేయ గలిగితే.. అనంతుడైన భగవంతుని కన్నా మాయే గొప్పది అవుతుంది. అది అసత్యం కదా!



ఆధ్యాత్మికం

TARAJYOTHI TELUGU DAILY తారాజ్యోతి

# ఊరి కోసం పోరాటం చేస్తున్న నాయకులపై అక్రమ కేసులా?

● ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు: సిపిఎం జిల్లా కార్యదర్శి వై యాకయ్య

**పెద్దపల్లి ప్రతినిధి :** ఊరు కోసం పోరాడుతున్న నాయకులపై కేసులు మోపడం ప్రజాస్వామ్యాన్ని కూని చేయడమే అని సిపిఎం జిల్లా కార్యదర్శి వై యాకయ్య అన్నారు. సిపిఎం నాయకులకు ప్రజలలో వస్తున్న ఆదరణ చూడలేకనే అక్రమ కేసులు మోపుతున్నారని ఆరోపించారు. పెద్దపల్లి మండలం రాఘవాపూర్ గ్రామంలోని స్మశాన వాటిక స్థలంలో సోలార్ ప్లాంట్ నిర్మాణం చేయవద్దని, తమ బంధువుల ఆనవాళ్లు చెరిపేయవద్దని, గ్రామంలో లెక్కలేనని ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నప్పటికీ కొందరి స్వార్థ రాజకీయాలతో స్మశాన వాటిక స్థలంలోనే సోలార్ ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టడాన్ని నిరసిస్తూ శాంతియుత పోరాటం చేస్తున్న సిపిఎం నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం సిగ్గుచేటని అన్నారు. అక్రమ కేసులో జైలుకెళ్ళి బెయిల్ మీద రిలీజ్ అయిన కల్లెపల్లి అశోక్ ,కుమ్మరి నవీన్ గురువారం రాఘవ పూర్ గ్రామానికి వచ్చిన సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ మరియు గ్రామ ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. రాఘవాపూర్ గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి వై యాకయ్య మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లా రాఘవపూర్ గ్రామంలో స్మశాన వాటిక సంబంధించి గత కొన్ని సంవత్సరాలుగా గ్రామ ప్రజలు అందరూ అన్ని కులాలకు సంబంధించిన వారు ఎవరైనా చనిపోతే అక్కడే పూడ్చిపెట్టడం,కాల్చి దహనసంస్కరాలు చేయడం జరుగుతుందని,ఈ స్మశాన వాటికలో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం కొంత మంది వ్యక్తులు కలిసి ఆ స్థలాన్ని సోలార్ ప్లాంట్ కు ఇవ్వడం జరిగిందని,దీనికి వ్యతిరేకంగా గ్రామ ప్రజలను ఐక్యం చేసి ఈ గ్రామ పంచాయతీ 6వ వార్డు సభ్యులు సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కల్లెపల్లి అశోక్, సిపిఎం నాయకులు కుమ్మరి నవీన్ లు పలు మార్లు తాహసిల్దార్, ఆర్డీవో, జిల్లా కలెక్టర్ లకు మెమొరండాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఎవరైనా చనిపోతే దాహన సంస్కారాలు చేయడానికి స్థలం లేదు సోలార్ ప్లాంట్ ను వేరే కాడికి మార్చండి అని అధికారుల ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోకపోవడంతో ప్రజలకు అర్థం చేయించి శాంతియుతంగా స్మశాన వాటికలో నిర్మిస్తున్న సోలార్ ప్రాంతం వేరే చోటికి మార్చాలని రిలే నిరాహార దీక్ష చేస్తే కొంతమంది కుట్ర దారులు అశోక్ అంటే పడని వారు ప్రభుత్వంతో పోలీసులతో మిలకత్తై శాంతియుతంగా పోరాటాలు చేస్తున్న క్రమంలో ముందస్తు అరెస్టుల పేరుతో కుటుంబ సభ్యులకు ఎలాంటి సమాచారం లేకుండా అశోక్ నవీన్ అరెస్టు చేసి దాదాపు 12 గంటల వరకు కుటుంబ సభ్యులకు, పార్టీ జిల్లా కమిటీ కి కనిపించకుండా రహస్యంగా బంధించిన పరిస్థితి ఉందనీ అన్నారు. అధికారులను ఎసిపి, డిసిపి లను అడిగినప్పటికీ వారి తెలుపని పరిస్థితి ఉందని,



సాయంకాలం ఐదు గంటలకు మీ పై కేసు ఉంది రిమాండ్ పంపిస్తున్నామని అక్రమ కేసులు పెట్టి వారం రోజులు జైలుకు పంపించారని, నిన్నరాత్రి బెయిల్ వచ్చినప్పటికీ ఆలస్యం కావడం వల్ల గురువారం ఉదయం అశోక్, నవీన్,విడుదలై రావడం జరిగిందన్నారు. అశోక్ నవీన్ లకు సిపిఎం పార్టీగా స్వాగతం పలుకుతూ ఎటువంటి అరెస్టులకు బెదిరింపులకు సిపిఎం పార్టీ నాయకత్వం భయపడేది కాదని అంతే కాదు రాఘవాపూర్ గ్రామంలో అనేక సమస్యలపై అశోకు, నవీన్ కొంతమంది యువకులు న్యాయపోరాటం చేస్తున్నారని, ఏ విధంగానైనా వీరిని అరెస్ట్ చేయించాలని కేసులు పెట్టియాలని వీళ్ళ కుటుంబాలను ఇబ్బందుల పాలు చేయాలని గ్రామంలో కొంతమంది పడని వ్యక్తులు అనుకుంటున్న పరిస్థితి ఉందనీ అన్నారు. కొంతమంది వ్యక్తులు సిపిఎం పార్టీ నాయకులపై గతంలో దాడికి పాల్పడ్డారని, అయిన సిపిఎం పార్టీ ఆదేశాల మేరకు గ్రామ ప్రజల కోసం తాను స్మశాన వాటిక కాపాడుకోవడం కోసం పోరాటం చేశాడు,తప్ప సొంత లాభం కోసం కాదని అన్నారు. ఇటువంటి అరెస్టులతోనే బెదిరింపులతోనే జైల్లోకి పంపించి ప్రజా సమస్యలను పక్కదారి పట్టించాలనుకుంటే చూస్తూ ఊరుకునేది లేదని అన్నారు. ఈ సమస్య పైన సిపిఎం పార్టీగా చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని, అశోక్ నవీన్ లకు సిపిఎం పార్టీ పూర్తిస్థాయి అండదండలందిస్తూ వారి పోరాటాలను ముందుకు తీసుకుపోవాలని గ్రామ సమస్యల పరిష్కారం కోసం ప్రజా వ్యతిరేక విధానాల కోసం పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్రబెల్లి రావు , జిల్లా కమిటీ సభ్యులు బిక్షపతి,ఎస్ రవీందర్,జి జ్యోతి,నాయకులు లక్మారెడ్డి,మొదంపల్లి శ్రవణ్, ఎ రామలక్ష్మి శ్రీశైలం, ప్రకాష్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సొంత పార్టీ కార్యకర్త సమస్యను ఎమ్మెల్యే ఎందుకు పట్టించుకోలే

● ఎమ్మెల్యే శ్రీధర్ పట్టించుకోకుండా ఏసీపీతో భయపెట్టించడమేంటి ● ఏసీపీ రమేష్ ఇబ్బందులకు గురి చేయడంతోనే సతీష్ ఆత్మహత్య ● పద్దతి మార్చుకోని పోలీసుల పేర్లు పింక్ బుక్కులో రాసి పెడ్తున్నం ● తక్షణమే స్పందించి బాధితుల దరఖాస్తు తీసుకుని విచారణ చేయాలే ● సతీష్ కుటుంబానికి అండగా ఉంటం.. న్యాయం జరిగే వరకు పోరాడుతం ● మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్





**రామగిరి, మార్చి 12:-** మంథని పట్టణానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త పెరుగు సతీష్ మృతికి ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్, రామగుండం ఏసీపీ మడత రమేష్ కారణమని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆరోపించారు. మంథని పట్టణంలోని పోస్టుమార్టం గది వద్ద ఉన్న సతీష్ మృత దేహాన్ని సందర్శించి సతీష్ కుటుంబసభ్యులతో మాట్లాడి ఆత్మహత్యకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. పెరుగు సతీష్ 25రోజుల క్రితం రామగుండం ఏసీపీ మడత రమేష్ పిలిచి ఇబ్బందులకు గురి చేయడం మూలంగా పురుగుల మందు సేవించి 25రోజులు ఆస్పత్రిలోచికిత్స పొందుతూ మృతి చెందాడని ఇది దురదృష్టకరమైన సంఘటన అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరైతే అమ్మాయి ఇబ్బంది పెడుతుందని చెప్పిందో ఆ అమ్మాయి లేకుండానే ఏసీపీ ఏకపక్షంగా ఇబ్బంది పెట్టడం మూలంగానే తమ్ముడు మందు సేవించాడని సతీష్ అక్కయ్య చెబుతోందన్నారు. పోస్టుమార్టం వద్దకు మృతదేహాన్ని తీసుకువచ్చి ఉదయం తొమ్మిది అవుతున్నా ఇప్పటి వరకు ఎస్ఐ రాలేదని దరఖాస్తు తీసుకోవడంలేదని. మేం చెప్పినట్లే దరఖాస్తు రాసి ఇవ్వాలని రామగుండం పోలీసులు హుకూం జారీ చేస్తున్నట్లు ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రామగుండం పోలీసులను అనేక మార్లు హెచ్చరించామని, మీరు ఉద్యోగులు ఉద్యోగం చేసుకోవాలే తప్ప రాజకీయాలు చేయవద్దని చెప్పినం అని, పోలీస్‌స్టేషన్‌లకు కాంగ్రెస్ కార్యాలయాలని బోర్డులు పెట్టుతామని ఇప్పటికే హెచ్చరించామని, అయితే ప్రజలకు తెలియాలి ప్రజల్లో చైతన్యం రావాలని చూస్తున్నమని, ప్రజల్లో అవగాహన వచ్చేవరకు ఆగుతున్నామని అన్నారు. అమాయకుల చావులకు కారణమవుతున్న వారిని ఎవరిని వదలిపెట్టమని, రామగుండం ఏసీపీ, మంథని సీఐలు ఎక్కడ ఉన్నావారిపై చర్యలు తప్పవని, వారి పేర్లు పింక్ బుక్కులో రాసిపెట్టుకున్నమన్నారు. మంథని నియోజకవర్గంలో దుద్దిళ్ల శ్రీధర్, ఆయన తమ్ముడు ఆడిచ్చినట్లు ఆడుతున్నారని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీకి జెండా మోసి మంత్రి పదవి రావడానికి తన రక్తాన్ని దారపోసి కుటుంబాన్ని పక్కకు పెట్టిన పని చేసిన కాంగ్రెస్ కార్యకర్త ఇలాంటి పరిస్థితుల్లో ఉంటే మంథని ఎమ??మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. బతికుంటే ఓటుగా వాడుకోవచ్చని, చనిపోతే దేవుడికి అప్పజెప్తారని పెద్దలు చెప్తుంటారని, పెరుగు సతీష్‌ను దుద్దిళ్ల శ్రీధర్‌ది అదే ఆలోచన అని అర్థం అవుతుందన్నారు. స్థానిక ఎమ్మెల్యేగా ఉండి కాంగ్రెస్ కార్యకర్త సమస్యను దగ్గరుడి పరిష్కరించాలే కానీ పోలీసుల జోక్యం ఎందుకు వాళ్లతో భయపెట్టించడం ఎందుకని ఆయన ప్రశ్నించారు. అంటే కార్యకర్త ఏమైనా ఫర్వాలేదు ఓటు సంబంధం అయిపోయింది కాదా అని ఆలోచన చేస్తుండని ఆయన విమర్శించారు. దుద్దిళ్ల శ్రీధర్ కుటుంబం నీచమైన ఆలోచన, నైజం బయటపడాలన్నారు. ఓ బీసీ బిడ్డగా ఈ మట్టిలో పుట్టిన తాను ఈ సమాజాన్ని చూసి పెరిగానని, తాను పదవుల కోసం ఓట్ల కోసం పని చేయడం లేదన్నారు. మా సమాజాన్ని ఓట్ల కోసం దుద్దిళ్ల కుటుంబం ఎలా వాడుకుంటుందో అర్థం అయ్యేలా పోరాటం చేస్తానని అన్నారు. ఇటీవల సూరారంలో రామకృష్ణ అనే వ్యక్తి చనిపోతే అక్కడి డీఎస్పీ అవహేళనగా మాట్లాడిండని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 30ఏండ్ల అనుభవం ఉన్న ప్రజాప్రతినిధిగా మాట్లాడితే ఆ అధికారి సదరు వ్యక్తి చావుకు విలువ లేకుండా మాట్టాడిండని, ఇంత దారుణంగా పోలీస్ వ్యవస్థ ఉందన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీలు మాత్రమే రాజకీయ కుట్రలో పోలీసుల అరాచకాల్లో చనిపోతాండ్లని, ఇక్కడ సతీష్ చావుకు దుద్దిళ్ల శ్రీధర్ ఆయన కుటుంబం పోలీసు యంత్రాంగమే కారణమన్నారు. తక్షణమే పోలీసులు బాధితుల దరఖాస్తును స్వీకరించి విచారణ చేపట్టాలని, అలాగే మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ సైతం తక్షణమే స్పందించి పోలీసులు జోక్యంపై సమాధానం చెప్పాలన్నారు. సతీష్ మృతి చెందక ముందే హెచ్ఆర్సీలో కేసు పెట్టిండని కుటుంబ చెప్తున్నారని, ఇక్కడి పోలీసులు సైతం ఫిర్యాదు తీసుకోవాలన్నారు. అవసమైతే న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని, ఎవరిని వదిలిపెట్టే ప్రసక్తి లేదని, సతీష్ కుటుంబానికి అండగా నిలిచి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని ఆయన స్పష్టం చేశారు.



# గొంగడి ధర్నాను విజయవంతం చేయాలి

**- గొర్రెకాపరుల సంక్షేమసంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శి మారం తిరుపతి యాదవ్ పిలుపు**



**పెద్దపల్లి ప్రతినిధి:** జిల్లాలోని గొర్రెల కాపరుల సమస్యల పరిష్కారం కోసం సోమవారం రోజున కలెక్టరేట్ కార్యాలయం ఎదుట వినూత్నన నిరసన కార్యక్రమం 'గొంగడి ధర్నా'ను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం తిరుపతి యాదవ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు సలేంద్ర రాములు యాదవ్, ప్రధాన కార్యదర్శి మేకల నర్సయ్య యాదవ్, మండల అధ్యక్షులు చంద్రమౌళి యాదవ్‌తో కలిసి మారం తిరుపతి యాదవ్ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ మండలాల నుండి పెద్ద సంఖ్యలో గొర్రెల కాపరులు తమ సంప్రదాయ వస్త్రమైన గొంగడి ధరించి 23న కలెక్టరేట్ వద్దకు చేరుకొని కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొనాలన్నారు. గొర్రెల కాపరులు ప్రధానంగా ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వానికి నివేదించేలా ధర్నాకు గొర్రెకాపురులు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. మార్కెట్ స్థలాల పరిరక్షణ, గొర్రెల పెంపకానికి సంబంధించిన సబ్సిడీలు, పశువైద్య సేవల విస్తరణ వంటి అంశాలపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలనే డిమాండ్స్‌తో ఈ ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం పూర్తిగా శాంతియుతంగా మరియు ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించబడుతుందని స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని మండలాల గొర్రెల కాపరులు, రైతులు, సంఘ సభ్యులు ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ నిరసన కార్యక్రమం ద్వారా గొర్రెల కాపరుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే భవిష్యత్తులో మరింత పెద్ద ఎత్తు ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

# హత్య కేసులో నిందితునికి పది సంవత్సరాల జైలు శిక్ష...

**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి మార్చి 12:-** పెద్ద వంగర పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన హత్య కేసులో నిందితునికి న్యాయస్థానం 10 సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. లక్ష్మక్కపల్లి గ్రామం కి చెందిన ఫిర్యాదుదారు పదమటింటి సోమనర్సమ్మ, నిందితుడు చింతల యాకయ్య మీద ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీస్ స్టేషన్‌లో క్రైం నంబర్ 14/2017 కింద భారతీయ శిక్షాస్మృతి చట్టంలోని సెక్షన్ 498(ఎ), 302 ఐ పి సి ప్రకారం నమోదు చేసిన కేసుకు సంబంధించి మహబూబాబాద్ లోని ప్రిన్సిపల్ జిల్లా మరియు సెషన్స్ కోర్టు-కమ్-స్పెషల్ సెషన్స్ జడ్జి (పోక్సో కేసులు) గౌరవ న్యాయమూర్తి మొహమ్మద్ అబ్దుల్ రఫీ విచారణ జరిపి ఈరోజు తీర్పు వెలువరించారు. ఈ కేసుకు సంబంధించి విచారణ పూర్తిచేసిన అనంతరం న్యాయస్థానం నిందితుడిని దోషిగా తేల్చి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 10,000 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చింది. ఈ కేసులో ప్రభుత్వం తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ కొంపల్లి వెంకటయ్య గారు సమర్థవంతంగా వాదనలు వినిపించగా, కోర్ట్ లియాజన్ ఆఫీసర్ ఎన్. జీనత్ కేసు పురోగతిలో కీలక పాత్ర పోషించారు. ఈ కేసు దర్యాప్తును కరుణ సాగర్ రెడ్డి గారు (ఉాజ్రా, క్రైమ్స్, రాచకొండ) నిర్వహించారు. అలాగే కోర్టు విధులలో భాగంగా సి డి ఓ జె. అనిల్ కుమార్ (పి సి 1275), పెద్ద వంగర పోలీస్ స్టేషన్ కేసుకు సంబంధించిన కోర్టు ప్రక్రియలను సమన్వయం చేయడంలో సహకరించారు. ఈ కేసులో బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా కృషి చేసిన దర్యాప్తు అధికారులు, ప్రభుత్వ న్యాయవాది మరియు పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ శబరీష్ అభినందించారు. పోలీస్ అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, మహిళలపై హింస, కుటుంబ కలహాలు మరియు ఇతర నేరాలపై కఠినంగా చర్యలు తీసుకుంటామని, ఎలాంటి సమస్యలు ఎదురైనప్పటికీ పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

# పట్టణ ప్రజలు స్వచ్ఛ పెద్దపల్లికి సహకరించాలి

**- మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లన్న**



**పెద్దపల్లి ప్రతినిధి :** పెద్దపల్లి పట్టణంలో పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ స్వచ్ఛ పెద్దపల్లికి సహకరించాలని పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లన్న పట్టణ ప్రజలను కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం మినీ ట్యాంక్ బండ్ పైన స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య పాల్గొని మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ తో కలిసి మినీ ట్యాంక్ బండ్ పై రోడ్లను ఊడ్చి శుభ్రం చేశారు. అనంతరం కౌన్సిలర్లతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్యాంక్ బండ్ కు వచ్చే పర్యాటకులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని రోడ్లపై చెత్త వెయ్యకుండా మున్సిపల్ సిబ్బంది ఏర్పాటు చేసిన డస్ట్ బిన్ లో వెయ్యాలని అన్నారు. పెద్దపల్లి పట్టణ ప్రజలు తడి పొడి చెత్తను వేరుచేసి మున్సిపల్ సిబ్బందికి అందించి స్వచ్ఛ పెద్దపల్లికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గుజ్జుల కుమార్,దొడ్డుపల్లి జగదీష్, మోలుగురి కమల్, పెంజర్ల రాకేష్,నాంసాని శ్రీనివాస్,నల్లాల పద్మ సురేష్ మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ సతీష్ జూనియర్ అసిస్టెంట్లు రమాకాంత్, సురేందర్ వార్డ్ ఆఫీసర్లు శానిటేషన్ సిబ్బంది మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# పుస్తె మట్టెలు కోసం ఆర్థిక సాయం




**కరీంనగర్ టౌన్,మార్చ్12:** లయన్స్ క్లబ్ ఆఫ్ రంగనాయక పెద్దపల్లి అద్వర్యంలో గురువారం బెజ్జాల గ్రామానికి చెందిన బతిని గణపతి క్రీ శే సుమలత కుమార్తె అక్షితకి పుస్తే మట్టేల కోసం 31,500 రూపాయలు అర్థిక సహాయం చేశారు. ఇట్టి కార్యక్రమం లో రంగనాయక క్లబ్ అధ్యక్షులు హనుమాండ్ల శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షులు నల్ల మధుకర్ రెడ్డి, ట్రెజరీ తాళ్ల మురళీకృష్ణ, క్లబ్ ఎక్స్‌టెన్షన్ చైర్‌పర్సన్ కొమ్ము కరుణాకర్, బండి సంపత్, వీరబోయిన స్వామి, వీరబోయిన శ్రీకాంత్, తీగల నాగరాజు, అనంతుల లక్ష్మణ్, మెతుకు తిరుపతి, లింగాల తిరుపతి రెడ్డి,కొమ్ము రమేష్, తధీతర లయన్స్ సభ్యులు పాల్గొన్నారు.

# గ్యాస్ సిలిండర్లను అక్రమంగా బ్లాక్‌లో అమ్ముతు వాడుతున్న వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి

**- ప్రజలకు న్యాయం చేయాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్.పి.ఐ) రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి**



**కరీంనగర్ టౌన్, మార్చ్12 :** జిల్లా కలెక్టరేట్ లో జిల్లా సివిల్ సప్లై కార్యాలయం లో జిల్లా సివిల్ సంచాలకులు నరసింగరావును కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగిందని,నిరుపేదలకు చెందాల్సిన రాయితీ సిలిండర్స్ దీపం సిలిండర్స్ ప్రజలు వాడుకునే సిలిండర్లను హోటల్లో,ప్రైవేట్ హాస్టల్స్.,రెస్టారెంట్స్ యజమానియులు అక్రమంగా వాడుకుంటున్నారని వెంటనే విచారణ చేపట్టి వారి పైన క్రిమినల్ కేసు పెట్టి జైలు పంపి నిజమైన నిరుపేదలకు ఎల్పీజీ డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు అందించాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ డిమాండ్ చేశారు.సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజా ప్రంథాఅనుబంధం ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థుల సంఘంజిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్ లు కోరారు.

# 14 న జరిగే అంజన్న ఆశీర్వాద యాత్రకు తరలిరండి

**- ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్మికులకు జేఏసీ చైర్మన్ చాడ ఆనంద్ పిలుపు**



**కరీంనగర్ టౌన్, మార్చ్12:** భారతీయ జనతా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి , కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు , కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఈనెల 14న చేపట్టనున్న కొండగట్టు అంజన్న స్వామి ఆశీర్వాద పాదయాత్ర లో కార్మికులంతా పాల్గొనాలని ఉమ్మడి జిల్లా కార్మిక జేఏసీ చైర్మన్ చాడ ఆనంద్ కోరారు. ఈ మేరకు గురువారం రోజున చాడఆనంద్ మీడియాకు ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 14వ తేదీ శనివారం ఉదయం 7 గంటలకు కరీంనగర్ చైతన్యపురి సమీపంలోని మహాశక్తి ఆలయం వద్ద నుండి ఘనంగా ప్రారంభమై కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయం వరకు జరుగుతున్న ఈ పాదయాత్రలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న భవన నిర్మాణ కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ పాదయాత్ర ద్వారా కార్మికుల ఐక్యత మరింత బలపడటంతో పాటు సామాజిక చైతన్యం పెంపొందించి ప్రజా సమస్యలపై అవగాహన పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్మికులు పాదయాత్రకు మద్దతు తెలుపుతూ కొండగట్టు ఆంజనేయ స్వామి వారి దివ్య ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు. కరీంనగర్ పట్టణంలో ఉన్న కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు ఉదయం మహాశక్తి ఆలయం వద్దకు చేరుకోవాలని, అలాగే మిగతా మండలాలు, గ్రామాలలో ఉన్న కార్మిక నాయకులు పాదయాత్రకు మార్గమధ్యంలో స్వాగతం పలుకుతూ పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా జేఏసీ చైర్మన్ చాడా ఆనంద్ ఈ ప్రకటనలో కోరారు.

TARAJYOTHI TELUGU DAILY
తారాజ్యోతి

# అంకితభావంతో పనిచేసే జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలి..

◆ 99 రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి. ◆ జాతీయస్థాయి నుండి గ్రామస్థాయి వరకు అన్ని విభాగాలలో మహిళలు భాగస్వాములు కావాలి ◆ గ్రామ, పట్టణ సర్వతో ముఖాభివృద్ధికి సర్పంచులు, కౌన్సిలర్లు పనిచేయాలి ◆ గ్రామ సభలు నిర్వహించి నిధులను ఖర్చు చేయాలి ◆ ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టాలి ◆ దేశంలోనే ఆదర్శ గ్రామంగా తీర్చడానికి కృషి చేయాలి. ◆ రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క.











**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి మార్చి 12 :** గ్రామాల్లోని సర్పంచులు, వార్డు కౌన్సిలర్లు గ్రామ ప్రజలను తమ కుటుంబ సభ్యులుగా భావిస్తూ ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. గురువారం మహబూబాబాద్ పట్టణంలోని పి.ఎస్.ఆర్ ఫంక్షన్ హాల్ లో జిల్లా స్థాయిలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమములో భాగంగా నూతనంగా ఎన్నికైన మహబూబాబాద్ జిల్లాలోని గ్రామ సర్పంచులకు, మున్సిపల్ కౌన్సిలర్లకు మహిళా, శిశు సంక్షేమ, సెర్ప్, వైద్య ఆరోగ్య, విద్యా మరియు సంక్షేమ శాఖలు, పర్యావరణ, వ్యవసాయ, ఉద్యానవన, పశు సంవర్ధక, మార్కెటింగ్, సహకార, పౌర సరఫరాల, మున్సిపల్ (పురపాలక), పంచాయతీ రాజ్, పోలీస్ రవాణా, గృహ నిర్మాణ, విద్యుత్, యువజన మరియు క్రీడా శాఖల పై శిక్షణ తరగతులు నిర్వహించగా మహిళా, శిశు సంక్షేమం, వైద్యం పై శిక్షణ కార్యక్రమాన్ని ఉదయం జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ప్రారంభించారు. జిల్లాలోని గ్రామ సర్పంచులకు, మున్సిపల్ కౌన్సిలర్లకు 12 శాఖలపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి మంత్రి సీతక్క హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ దేశంలోనే ఆదర్శ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దడానికి ప్రతి సర్పంచ్ కృషి చేయాలని అన్నారు. దేశానికి పట్టుకొమ్మలే గ్రామాలని గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ప్రతి సర్పంచ్ తమ గ్రామాన్ని సొంత ఇంటితో భావించుకోవాలని, ప్రజా ప్రతినిధులు స్వార్థం కోసం పనిచేయకుండా ప్రజాసేవ చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. ప్రతి ప్రజా ప్రతినిధి ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని, పూర్తిస్థాయిలో సేవలు అందించినప్పుడే ప్రజల గుర్తింపు లభిస్తుందని అన్నారు. గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులు చేయడానికి కేంద్ర ప్రభుత్వం 6 వందల కోట్ల రూపాయలు గ్రామ పంచాయతీలకు కేటాయించిందని, మరో 12 వందల కోట్ల రూపాయలు రావాల్సి ఉన్నాయని ఆ నిధులను తీసుకోరావడానికి ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. గత రెండు సంవత్సరాలుగా గ్రామాలలో ప్రజా ప్రతినిధుల ప్రాతినిధ్యం లేకపోయినప్పటికీ గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులు చేయడానికి రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం ఒక వెయ్యి మూడు కోట్ల రూపాయలను కేటాయించిందని, ఆనాడు చేసిన పనులకు కొంత మేరకు బిల్లులు చెల్లించగా జరిగిందన్నారు, ఇటీవల సర్పంచులకు ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినప్పటికీ నేడు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 దృష్టిలో ఉంచుకొని సర్పంచులకు, పురపాలక కౌన్సిలర్లకు 12 శాఖలపై అవగాహన కల్పించడానికి ఈ శిక్షణను ఏర్పాటు చేశామని, శిక్షణలో అవగాహన చేసుకున్న ప్రజాప్రతినిధులు తూచా తప్పకుండా పాటించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఉత్తమ గ్రామ పంచాయతీలుగా గుర్తించడానికి తొమ్మిది రకాల అంశాలను పొందుపరచిందని, వాటిని అవగాహన చేసుకుని ఉత్తమ గ్రామ పంచాయతీలుగా గుర్తింపు పొందడానికి కృషి చేయాలని అన్నారు. ఉత్తమ గ్రామపంచాయతీ కోటి రూపాయలు, మరో రెండు గ్రామపంచాయతీలకు అదనంగా నిధులు కేంద్ర ప్రభుత్వం కేటాయిస్తుందని వివరించారు. మారుమూల గ్రామాలు వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతుందని సీతక్క తెలిపారు. శిక్షణ శిబిరానికి గైర్హాజరైన వారికి వారి యొక్క వివరాలు తెలుసుకొని మళ్ళీ తరగతులు నిర్వహించాలని, కలెక్టర్కు సూచించారు. ప్రజా ప్రతినిధులు అధికారులు సమన్వయంతో కలిసి పనిచేసి గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి కృషి చేయాలని, గ్రామాల అభివృద్ధి విషయంలో సర్పంచుల పాత్ర కీలకం,ప్రభుత్వ ఫలాలు నిజమైన లబ్ధిదారులకు అందే విధంగా,చొరువ చూపాలి,శిక్షణలో నేర్చుకున్న ప్రతి విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల షెడ్యూల్ ప్రకారం జిల్లాలో పకడ్బందీగా నిర్వహించడం జరుగుతుందని, అన్ని శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లి విజయవంతం చేయడం కోసం పక్క ప్రణాళికతో జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్, ఎం.ఎల్.సి తక్కెళ్లపల్లి రవీందర్ రావు, మహబూబాబాద్ శాసన సభ్యులు డాక్టర్ బానోత్ మురళీ నాయక్. తదితరులు ఈ శిక్షణ కార్యక్రమానికి హాజరైన గ్రామపంచాయతీ సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, చైర్మన్ వైస్ చైర్మన్లు ను ఉద్దేశించి ప్రసంగించి గ్రామాలు పట్టణాల అభివృద్ధి కోసం తీసుకోవలసిన చర్యలపై సూచనలు సలహాలు ప్రసంగాల ద్వారా అందించారు. అనంతరం శిక్షణ తరగతులకు హాజరైన వారికి శాఖల వారీగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సంబంధిత అధికారులు సవివరంగా అభివృద్ధిపై తీసుకోవలసిన పనుల గురించి సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థలు, రెవిన్యూ అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టోప్పో, కె.అనిల్ కుమార్, మునిసిపల్ చైర్ పర్సన్ గుగులోతు జ్యోతి, వైస్ చైర్మెన్ సూర్నపు సోమయ్య, జెడ్పిసిఓ పురుషోత్తం, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, జిల్లా అధికారులు, జిల్లా అధికారులు,మునిసిపల్ కౌన్సిలర్లు, గ్రామ సర్పంచ్ లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కిడ్నీ సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దు... మెడికవర్ వైద్యుల వెల్లడి




**కరీంనగర్ టౌన్,మార్చ్12:** కిడ్నీ సమస్యలను నిర్లక్ష్యం చేయడం వల్ల కిడ్నీ ఫెయిల్యూర్ అయ్యే ప్రమాదం ఉందని మెడికవర్ నెఫ్రాలజిస్టు డాక్టర్ రాంచందర్, యూరాలజిస్టు డాక్టర్ రవిశంకర్ అన్నారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా గురువారం కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రిలో కిడ్నీ సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ శరీరానికి తగినంత నీరు తీసుకోకపోవడం వల్ల కిడ్నీలో రాళ్లు తయారవుతాయని, స్టోన్ చిన్న సైజులో ఉంటే ఎక్కువగా నీరు తీసుకోవడం వల్ల స్టోన్ పడిపోయే అవకాశం ఉందన్నారు. కిడ్నీలో రాళ్లు తయారై రెండు మూడు వారాలకంటే ఎక్కువ సమయం ఉండడం, నొప్పిని తట్టుకునేందుకు పెయిన్ కిల్లర్స్ వాడడం, బీపీ, షుగర్ కంట్రోల్లో లేకపోవడం, వంశపారంపర్యం వంటి కారణాలతో కిడ్నీ ఫెయిల్యూర్ అయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. నిర్లక్ష్యం చేయకుండా సర్జరీతో స్టోన్ తొలగించుకోవాలన్నారు. కిడ్నీ అంటే ఓన్లీ యూరిన్ పాస్ చేసేది మాత్రమే అనుకోవడం పొరపాటని, కిడ్నీ బీపీ కంట్రోల్ చేసేందుకు, రక్తం తయారు చేసేందుకు సహకరిస్తుందన్నారు. చిన్న వయస్సులో బీపీ వచ్చిందంటే అది కిడ్నీ పనితీరు సరిగా లేకపోవడమే కారణంగా చెప్పవచ్చన్నారు. కిడ్నీ సమస్యలు ఉన్న వారు ప్రారంభదశలోనే చికిత్స తీసుకుంటే నయం అవుతుందన్నారు. చాలా మంది కిడ్నీ డ్యామేజ్ స్టేజీలో వైద్యం కోసం వస్తున్నారని, అలాంటి వారిలో 50 శాతం మందికి డయాలసిస్ అవసరమవుతుందన్నారు. డయాలసిస్‌కు భయపడాల్సిన పనిలేదని, 10 సంవత్సరాల వరకు కిడ్నీని కాపాడవచ్చన్నారు. కిడ్నీ పూర్తిగా చెడిపోతే ట్రాన్స్‌ప్లాంటేషన్ ఒక్కటే మార్గమన్నారు. ట్రాన్స్‌ప్లాంటేషన్‌తో 20-25 సంవత్సరాల వరకు ఇబ్బంది ఉండదన్నారు. రెడ్ మీట్ తక్కువగా తినడం, ధూమపానం, మద్యపానం మానేసి, తగినంత నీరుతాగడం వంటి జాగ్రత్తలు తీసుకుంటే కిడ్నీ సమస్యలు దరిచేరవని తెలిపారు. మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ అవగాహన కార్యక్రమంలో క్రిటికల్ కేర్ నిపుణులు డాక్టర్ పల్లవి, సూపరింటెండెంట్ డాక్టర్ ప్రియాంక, ఆపరేషన్స్ మేనేజర్ సాయిచరణ్, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, దాసరి చంద్రశేఖర్, హరీష్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణిని రాజకీయాల బలి చేయొద్దు

## - కంపెనీ భవిష్యత్తుతో ఆటలాడకండి

**- మాజీ బీజేపీ జిల్లా ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు మొలుమూరి శ్రీనివాస్**



**రామగిరి, మార్చి 12:-** తెలంగాణ రాష్ట్రానికి సింగరేణి సంస్థ నల్ల బంగారాన్ని అందించే ప్రధాన సిరుల మాగాణి ఆర్థికంగా ఎంతో కీలకమైన సింగరేణి కంపెనీను కొందరు రాజకీయ నాయకులు, అధికారులు రాజకీయ వేదికగా మార్చడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని మాజీ బీజేపీ జిల్లా ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు మొలుమూరి శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం కొంతమంది అధికారుల వ్యవహార శైలి చూస్తే జీఎం కార్యాలయాలు ప్రభుత్వ కార్యాలయాలుగా కాకుండా కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల్లా మారుతున్నాయనే భావన కలుగుతోందని కొంతమంది అధికారులు ప్రజా ప్రతినిధులకు సేవ చేయాల్సిన స్థితిలో కాకుండా పాలేరుల్లా పనిచేస్తూ కంపెనీ ప్రతిష్టను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్నారు. ఈ పరిస్థితి కొనసాగితే సింగరేణి కంపెనీ భవిష్యత్తు ప్రమాదంలో పడే అవకాశం ఉందని అన్నారు. సింగరేణి కంపెనీపై ఆధారపడి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 42,000 మంది కార్మికులు వారి కుటుంబాలు జీవిస్తున్నారాని ఈ కంపెనీ బలహీనపడితే వేలాది కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుంది. కాబట్టి సింగరేణిని రాజకీయాల బలి చేయకుండా కంపెనీ అభివృద్ధి కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి.సింగరేణి సంస్థను రాజకీయ జోక్యాల నుండి దూరంగా ఉంచి పారదర్శకంగా నడిపించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. లేదంటే కార్మికులు, ప్రజలు ఈ పరిస్థితిపై తీవ్రంగా స్పందించాల్సిన పరిస్థితి వస్తుందని మాజీ బీజేపీ జిల్లా ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు మొలుమూరి శ్రీనివాస్ అన్నారు.

# ఐఏఎస్ కు ఎంపికైన సృజన తల్లిదండ్రులకు ఘన సన్మానం



**రామగిరి, మార్చి 12:-** భారత అత్యున్నత సివిల్ సర్వీసులో ఒకటైన దేశంలో 55 ర్యాంకు సాధించి ఐఏఎస్ ఎంపికైన రామగిరి మండలం, పన్నూరు గ్రామానికి చెందిన గూడెల్లి సృజన తల్లిదండ్రులు గూడెల్లి రాజేశం రాణి లను పన్నూరు బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామంలోని భూలక్ష్మి వద్ద రాజేశం-రాణి దంపతులను శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించి, స్వీట్లు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశంలోనే ఐఏఎస్ 55ర్యాంకు సాధించడం గర్వకారణం అని ముఖ్యంగా పన్నూరు గ్రామానికి చెందిన సృజన కావడం అదృష్టమని, ముఖ్యంగా మాగ్రామానికె కాకుండా జిల్లాకు ఎంతో పేరు ప్రఖ్యాతలు తీసుకు వచ్చిందని ఆమెను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు ముందుకు వెళ్లాలని సూచించారు. పట్టుదలతో సాధిస్తే కానిది ఏదీ లేదని ఒక మహిళ అని చూడకుండా కష్టపడి చదివి సివిల్స్ లో మంచి ర్యాంకు తో ఐఏఎస్ సాధించి నిరూపించిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేదరబోయిన కుమార్ యాదవ్, విజ్జగిరి భూమయ్య, సల్పల సదానందం, చేలకల జవహర్, చిందం సమ్మయ్య, అల్లం తిరుపతి, నాగుల శ్రీనివాస్, దామెర శ్రీనివాస్, తొట్ల శ్రీనివాస్, అమ్ముల కృష్ణకుమార్, పిట్టల రాజమౌళి,కుంటసమ్మయ్య,విజ్జగిరిసారయ్య,చిందంసతీష్,దాసరిసారయ్య, తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో జరిగే అనభేరి ప్రభాకర్ రావు వర్ధంతిని జయప్రదం చేయండి

**- సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి**




**కరీంనగర్ టౌన్,మార్చ్12:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు అనభేరి ప్రభాకర్ రావు 78వ వర్ధంతి సభ కార్యక్రమం ఈ నెల 14వ తేదీన కరీంనగర్ లోని కూరగాయల మార్కెట్ వద్ద గల అనభేరి విగ్రహం వద్ద నిర్వహిస్తున్నట్లు సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం పోలంపల్లి గ్రామానికి చెందిన అనభేరి ప్రభాకర్ రావు భూస్వామ్య కుటుంబంలో పుట్టినప్పటికీ పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం పనిచేయాలనే సంకల్పంతో సిపిఐ లో చేరాడని, సిపిఐ కరీంనగర్ జిల్లా మొట్టమొదటి కార్యదర్శిగా పనిచేశారని,ఆనాడు నిజాం నవాబ్ పరిపాలనకు వ్యతిరేకంగా రజాకార్ల ఆగడాలను ఎదిరించడానికి ఆంధ్రమహాసభ కమ్యూనిస్టు పార్టీల పిలుపుమేరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కీలక భూమిక పోషించి దళ కమాండర్ గా పనిచేశారని,1947 మార్చి 14న మహమ్మదాపూర్ గుట్టల్లో నిజాం రజాకర్ పోలీసులు జరిపిన కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన వీరుడు ప్రభాకర్ రావు అని అలాంటి గొప్ప నాయకుని వర్ధంతి కార్యక్రమం 77 సంవత్సరాలుగా సిపిఐ పార్టీ జరుపుతుందని ఈ నెల 14న కూడా 78వ వర్ధంతి కార్యక్రమం నిర్వహిస్తున్నామని సురేందర్ రెడ్డి తెలిపారు.ఈ వర్ధంతి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ సీనియర్ నాయకులు మాజీ శాసన సభాపక్ష నాయకులు చాడ వెంకటరెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ హాజరవుతున్నారని, వర్ధంతి కార్యక్రమం విజయవంతం చేయడం కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు,అభ్యుదయ వాదులు అధిక సంఖ్యలో హాజరుకావాలని సురేందర్ రెడ్డి కోరారు.

# ఉద్యోగ విరమణ పొందుతున్న హోంగార్డుకు సీపీ కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు



**రామగుండం కమిషనరేట్ :** పోలీస్ శాఖలో గత 41 సంవత్సరాలుగా హోంగార్డుగా పనిచేసిన వి.సత్యనారాయణ 607 పెద్దపల్లి సబ్ యూనిట్‌కు చెందిన వారు. ఆయన రీజినల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ, కరీంనగర్‌లో కూడా విధులు నిర్వహించారు.ఇట్టి హోంగార్డ్ ఉద్యోగ విరమణ పొందుతున్న సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా వారి కార్యాలయంలో ఆయనకు పూలమాల వేసి,శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ కె.శ్రీనివాస్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఆర్ఐ పెద్దన్న పాల్గొన్నారు.

# హోంగార్డుల కుటుంబ సభ్యులకు ఆర్థిక చేయూత





**రామగుండం కమిషనరేట్ :** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తూ ఆరోగ్య సమస్యలతో మరణించిన హోంగార్డులు డి.తిరుపతి801 ఎం.రాములు 272లకు తెలంగాణ రాష్ట్ర హోంగార్డ్స్ సంక్షేమ నిధి నుండి ఒక్కొక్కరికి రూ.15,000 చొప్పున మంజూరైన చెక్కులను అడిషనల్ డీసీపీ అడ్మిన్ కె.శ్రీనివాస్ వారి కార్యాలయంలో హోంగార్డుల కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, హోంగార్డ్స్ ఆర్ఐ పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

# అంతర్రాష్ట్ర దొంగల సంచారం....జనాలు జర భద్రం



**మానకొండూర్, మార్చి12:** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండల ప్రజలు పలు మండలాల్లో అంతర్రాష్ట్ర దొంగలు చోరీలకు పాల్పడుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలంటూ సిఐ పి.శ్రీలత గురువారం ఒక ప్రకటన ద్వారా హెచ్చరికలు జారీ చేశారు.సమీప మండలమైన కేశవపట్నంలోని మెట్టుపల్లిలో ఇటీవల దొంగల ముఠా చోరీలకు పాల్పడ్డారని, పరిసర మండలాల్లోని గ్రామాల్లో కూడా దొంగలు చోరీలు చేసే అవకాశం ఉన్నట్లుగా భావించి అన్ని గ్రామాల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు.ఎక్కవరోజులు ఇండ్లను వదిలి వెళ్ళకుండా రాత్రి వేళల్లో కిటికీలు వేసి ఇళ్ళకు తాళాలు వేసుకోవాలని, రాత్రింబవళ్ళు అనుమానాస్పద వ్యక్తులు గానీ వాహనాలు గానీ కనిపిస్తే వెంటనే 100 కు కాల్ చేయాలన్నారు. గ్రామ శివారులో ఇతర రాష్ట్రాల వ్యక్తులు గుడారాలు వేసుకొని ఉంటే వారి వివరాలను వెంటనే పోలీసులకు తెలపాలని, పక్కింటివారితో సమాచారాన్ని పరస్పరం పంచుకుంటూ గ్రామ భద్రతకై అప్రమత్తంగా ఉండి పోలీసులకు సహకరించాలని సిఐ పి.శ్రీలత ప్రకటన ద్వారా ప్రజలను కోరారు.

TARAJYOTHI TELUGU DAILY
తారాజ్యోతి

# పిల్లల భద్రతపై అప్రమత్తత అవసరం

## ● డ్రగ్స్ వినియోగం యువత భవిష్యత్తుకు ముప్పు పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి ● అంతర్గాం మండలంలో పిల్లల భద్రత, డ్రగ్స్, సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం

**రామగుండం కమిషనరట్ :** రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్ పరిధిలోని అంతర్గాం పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో అంతర్గాం మండల కేంద్రంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం భాగంగా గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్ పర్యవేక్షణలో రామగుండం సీఐ ప్రవీణ్ కుమార్, అంతర్గాం ఎస్ఐ వెంకటస్వామి ఆధ్వర్యంలో మండల ప్రజలను ఒకేచోట సమీకరించి పిల్లల భద్రత,డ్రగ్స్ నియంత్రణ,సైబర్ నేరాలు మరియు 'అరైవ్ అలైవ్' కార్యక్రమం భాగంగా రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి , ఎస్.పి. నాయక్ బంజారా హాజరయ్యారు.ఈ సందర్భంగా డీసీపీ బి.రామ్ రెడ్డి మాట్లాడుతూ,డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నదని తెలిపారు. యువత చెడు స్నేహాలు మరియు ప్రలోభాలకు లోనుకాకుండా తమ లక్ష్యాలపై దృష్టి పెట్టాలని సూచించారు.ఒక్కసారి డ్రగ్స్‌కు బానిస అయితే ఆరోగ్యం, చదువు,కుటుంబ జీవితం తీవ్రంగా దెబ్బతింటాయని చెప్పారు.డ్రగ్స్ సమస్య కేవలం వ్యక్తిగత సమస్య మాత్రమే కాకుండా సమాజానికి కూడా ప్రమాదకరమని పేర్కొన్నారు.ఎవరైనా డ్రగ్స్ విక్రయం లేదా వినియోగం చేస్తున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. పిల్లల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని డీసీపీ తెలిపారు.విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి మంచి మార్గంలో ముందుకు సాగాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు గమనించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. డిజిటల్ యుగంలో సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద ఫోన్ కాల్స్,మెసేజ్‌లు, లింకులు, ఓటీపీలు ఎవరితోనూ పంచుకోకూడదని హెచ్చరించారు. 'అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని డీసీపీ తెలిపారు. వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించడం, మితిమీరిన వేగంతో వాహనం నడపకపోవడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగించ కపోవడం వంటి నియమాలు పాటిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, రామగుండం సీఐ ప్రవీణ్ కుమార్, అంతర్గాం ఎస్ఐ వెంకటస్వామి, ఎంవీఐ రామగుండం సంతోష్ రెడ్డి,అంతర్గాం మండల సర్పంచులు, దాదాపు 300 మంది స్థానిక ప్రజలు, యువత,విద్యార్థులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.





# పరీక్షల సమయంలో విద్యార్థులు శ్రద్ధవహించాలి

## ● కస్తూర్బా పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన రామగిరి మండల ఎంపీడీఓ .శైలజ రాణి ● పన్నూరు సర్పంచ్ చిందం మహేష్





**రామగిరి, మార్చి 12:-** రామగిరి మండలం పన్నూర్ గ్రామం లోని కస్తూర్బా గాంధీ పాఠశాలను రామగిరి మండల ఎంపీడీఓ .శైలజ రాణి, పన్నూరు సర్పంచ్ చిందం మహేష్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాఠశాలలో పరిశుభ్రత, విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. అలాగే విద్యాలయ స్టోర్ రూమ్ సందర్శించి విద్యార్థులను కలిసి వారి ఎగ్జామ్స్ ప్రిపరేషన్ ఏ విధంగా జరుగుతుందో, అందరూ బాగా చదివి 100% ఉత్తీర్ణత సాధించాలని హాస్టల్ లో అన్ని వస్తువులు ఫ్రెష్ గా ఉన్నాయో లేఓ అనే వాటిని పరిశీలించారు. పదో తరగతి పరీక్షలు ఈ నెల 14 నుంచి ప్రారంభమై ఏప్రిల్ ఒకటో తేదీ వరకు జరుగుతాయి. సంవత్సరమంతా చదివింది ఒక ఎత్తైతే పరీక్షల సమయంలో పునశ్చరణ చేసుకోవడం మరోఎత్తు చదివింది గుర్తుంటుందా.. పరీక్షలు ఎలా రాస్తానో, మంచి మార్కులు వస్తాయో లేదోనన్న ఆందోళన, ఒత్తిడి విద్యార్థుల్లో నెలకొంటుంది. ఈ పరిస్థితిని అధిగమించి ప్రశాంతంగా పరీక్ష రాసేందుకు విద్యార్థులు సన్నద్ధం కావాలని రామగిరి మండల ఎంపీడీఓ .శైలజ రాణి, పన్నూరు సర్పంచ్ చిందం మహేష్ లు అన్నారు. ఉపాధ్యాయురాలు పిల్లలపై ఎక్కువ శ్రద్ధ చూపాలని మంచి ఆహారం అందిస్తూ బాగా చదివేలా ప్రోత్సహించాలని పాఠ్యాంశాల పునశ్చరణతోపాటు సందేహాలుంటే ఉపాధ్యాయురాలను ఆడికి ముందుగానే నివృత్తి చేసుకోవాలి.ముందుగానే కేంద్రానికి చేరుకోవాలి రవాణా సౌకర్యం తెలుసుకుని పరీక్ష కేంద్రానికి గంట ముందే చేరుకోవాలి. అట్ట, పెన్సిల్, రెండు పెన్నులు, జామిట్రీ బాక్సు తప్పకుండా తీసుకెళ్లాలి. ఈ కార్యక్రమం లో పన్నూరు సర్పంచ్ చిందం మహేష్, పంచాయతీ కార్యదర్శి ప్రేమలత పాల్గొన్నారు.

# ఇండ్ల పై నుంచి వెళ్తున్న 11 కెవి విద్యుత్తు వైర్లను గుర్తించి తొలగించాలి

## ● 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు








**భూపాలపల్లి, మార్చి,- 12::** ఆదాయ మార్గాలను పెంచుకుని గ్రామాలను, పట్టణాలను అభివృద్ధి చేయాలని భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని శ్రీనివాస ఫంక్షన్ హాలులో సర్పంచులు, కౌన్సిలర్లుకు 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై నిర్వహించిన ఒక రోజు శిక్షణా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విరిగిన వంగిన విద్యుత్తు పోల్స్, విద్యుత్తు వైర్లు, ఇండ్లపై నుండి వెళ్తున్న 11 కెవి విద్యుత్తు వైర్లు గుర్తించి వాటిని తొలగించాలని తెలిపారు. విరిగిన పోల్స్ స్థానంలో నూతన పోల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. 99 రోజుల ప్రణాళికలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా పంచాయతిలు, మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించి గ్రామాలు, పట్టణాలను పరిశుభ్రంగా తయారు చేయాలని తెలిపారు. వ్యర్థాలు తొలగించాలని, మురుగు కాల్వలు పరిశుభ్రం చేయాలని తెలిపారు. ప్రజలను ఈ బృహత్తర కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని, శిక్షణ ద్వారా ఆచరణలో అమలు చేయాలని సూచించారు. గ్రామాలు, పట్టణంలో కోతులు, కుక్కల బెడద నివారణకు స్థానిక వనరులు ద్వారా ఆదాయం సమకూర్చుకుని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. అన్ని ప్రభుత్వ వసతి గృహాల విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, 14 నిండి 15 సంవత్సరాలు మధ్య వయస్సున్న బాలికలు గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్ బారిన పడకుండా హెచ్ పివి వాక్సిన్ వేయించాలని తెలిపారు. జిల్లాలోని 2425 మంది బాలికలను గుర్తించామని వారందరు తప్పకుండా వాక్సిన్ తీసుకునే విధంగా అవగహన కల్పించాలని తెలిపారు. అలాగే మహిళా సంఘాలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచిత వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. మార్చి 6 నుండి జూన్ 12వ తేదీ వరకు శాఖల వారిగా చేపట్టాల్సిన కార్యక్రమాల షెడ్యూల్ వివరించారు. గ్రామాలు, మున్సిపల్ పరిధిలో ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిపొందిన వారి జాబితా తయారు చేసి ప్రజలకు తెలియ చేయాలని తెలిపారు. ఈ నెల 3వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై అన్ని జిల్లాల కలెక్టర్లతో సమావేశం నిర్వహించి తగు ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. గ్రామాలు, పట్టణంలో సర్పంచు లు, చైర్మన్లు ఈ కార్యక్రమాన్ని ఒక మూవ్ మెంట్ లాగా చేసి పరిశుభ్ర గ్రామాలు, పట్టణాలుగా తయారు చేయాలని స్పష్టం చేశారు. అన్ని గ్రామాల సర్పంచు లకు, మున్సిపల్ చైర్మన్ కు 99 రోజుల కార్యక్రమం షెడ్యూల్ ఇచ్చామని తుచ తప్పక పాటించాలని తెలిపారు. అనంతరం పంచాయతి, మున్సిపల్, వైద్య, పోలీస్, రవాణా, సంక్షేమ శాఖల అధికారులు, వ్యవసాయ, ఎక్సైజ్, విద్యా, యువజన సర్వీసులు క్రీడల శాఖ, అటవీ శాఖల అధికారులు ఆయా శాఖల ద్వారా చేపట్టనున్న 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి నవీన్ రెడ్డి, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డిఓ హరికృష్ణ, ఎఎస్పీ నరేష్ కుమార్ మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, అన్ని శాఖల జిల్లా అధికారులు, కౌన్సిలర్లు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి -సంక్షేమ కార్యక్రమాలపై ఫోటో ఎగ్జిబిషన్‌ను వీక్షించిన జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే



**భూపాలపల్లి, మార్చి - 12::** జిల్లా కేంద్రంలోని శ్రీనివాస ఫంక్షన్ హాలులో గురువారం నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశాల మేరకు సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో డిపిఆర్ఓ శీలం. శ్రీనివాసరావు ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలను ప్రతిబింబించే విధంగా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు వీక్షించారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన ఫోటోలను వారు పరిశీలించారు. ప్రజలకు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి అవగాహన కల్పించేలా ఈ ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం పట్ల డిపిఆర్ఓ శ్రీనివాసరావు ను, ఫోటో గ్రాఫర్ రంజిత్ ను, సిబ్బంది పి శ్రీనివాస్ ను, ప్రవీణ్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో వంట గ్యాస్ కొరత లేదు

## - కలెక్టర్ రాహుల్ శర్మ



**భూపాలపల్లి మార్చి -12::** జిల్లాలో ఎలాంటి వంట గ్యాస్ కొరత లేదని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ స్పష్టం చేశారు. గురువారం ఐడీఓసీ కార్యాలయంలో జిల్లాలో గ్యాస్ సరఫరా పరిస్థితులపై సమగ్ర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో రెవెన్యూ, పోలీస్, పౌర సరఫరాల శాఖ, పౌర సరఫరాల సంస్థ అధికారులు మరియు ఎల్పీజీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గృహ వినియోగదారులకు వంట గ్యాస్ సరఫరా సాధారణంగా మరియు నిరంతరాయంగా కొనసాగుతోందని తెలిపారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా గ్యాస్ సిలిండర్ల సరఫరా వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించాల్సిన బాధ్యత సంబంధిత శాఖలపై ఉందని ఆయన పేర్కొన్నారు. అందువల్ల గ్యాస్ ఏజెన్సీలు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు మరియు మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ వినియోగదారులకు సమయానికి గ్యాస్ సిలిండర్లు అందేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. అదేవిధంగా జిల్లాలో ఎక్కడైనా గ్యాస్ సరఫరాలో అంతరాయం కలిగే పరిస్థితులు లేదా అక్రమాలు జరుగుతున్నట్లు గుర్తించిన పక్షంలో, సంబంధిత అధికారులకు వెంటనే తెలియజేసి కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వినియోగదారుల హక్కులను పరిరక్షించడం మరియు పారదర్శకంగా సేవలు అందించడం ప్రతి గ్యాస్ ఏజెన్సీ యొక్క బాధ్యతని ఆయన స్పష్టం చేశారు. ప్రజలు గ్యాస్ కొరతపై వస్తున్న అపోహలను నమ్మకూడదని, జిల్లాలో గ్యాస్ నిల్వలు మరియు సరఫరా పూర్తిగా సమృద్ధిగా ఉన్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఏదైనా సమస్యలు, ఆలస్యం లేదా ఇబ్బందులు ఎదురైన సందర్భంలో సంబంధిత అధికారులకు లేదా గ్యాస్ ఏజెన్సీలకు సమాచారం అందించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతోనే సరఫరా వ్యవస్థను మరింత మెరుగుపరచవచ్చని ఆయన అన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్. కుమార్, ఏఎస్పీ నరేష్ కుమార్, పౌర సరఫరాల శాఖ అధికారి కిరణ్ కుమార్, పౌర సరఫరాల సంస్థ డీఎం రాములు, ఎల్పీజీ అసోసియేషన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# కవ్వంపల్లి ప్రమాణ స్వీకారోత్సవానికి తరలిన నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణులు



**మానకొండూర్, మార్చి12:** టిపిసిసి ఎస్సీ సెల్ చైర్మన్ గా మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని గురువారం హైదరాబాద్ లోని గాంధీ భవన్ లో నిర్వహించారు. మానకొండూర్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ శ్రేణులతో పాటు కరీంనగర్ జిల్లాలోని కాంగ్రెస్ నాయకులు, ఎస్సీ సెల్ నాయకులు,కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొని కవ్వంపల్లిపై తమ అభిమానాన్ని చాటుకున్నారు. మానకొండూర్ మండలం నుండి పార్టీ అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి నాయకులు తాళ్లపల్లి సంపత్ గౌడ్, కనకం అశోక్, ద్యావ శ్రీనివాస్ రెడ్డి, ఓదెలు,రేమిడి శ్రీనివాసరెడ్డి, గోపు శ్రీనివాస్ రెడ్డి,తిరుమల్ రెడ్డి, నాగిశెట్టి రాజయ్య, బాబురావు,మీస సత్యనారాయణ,మ్యాడ తిరుపతి రెడ్డి, హరీష్, ప్రభాకర్, శ్రీధర్ గౌడ్, బుర్ర శ్రీకాంత్,రామకృష్ణ,ఎడ్ల శ్రీధర్, కోండ్ర సురేష్ , తోట శ్రీనివాస్, కనకం కుమార్, వాల అంజుత్ రావు, తమిశెట్టి రాజేష్, మాతంగి సహదేవ్, ఎగోళపు శ్రీనివాస్ గౌడ్ తిమ్మాపూర్ మండలం నుండి కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బండారి రమేష్, నాయకులు గోపు మల్లారెడ్డి,కంది లక్ష్మి నారాయణ రెడ్డి,మోరపల్లి రమణారెడ్డి, శ్రీగిరి రంగారావు, తుమ్మనపల్లి శ్రీనివాసరావు,కుంట రాజేందర్ రెడ్డి, గోగూరి నరసింహారెడ్డి, మామిడి అనిల్ కుమార్,గంకిడి లక్ష్మారెడ్డి, ఉప్పులేటి రాజు, ఎం. అనిల్ శంకరపట్నం మండలం నుండి టిసిసి సభ్యుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గోపగోని బస్వాగౌడ్ ఆధ్వర్యంలో నాయకులు నాంపల్లి తిరుపతి, కోరెం రాజిరెడ్డి,గొట్టె మధు, ఉప్పుగళ్ల మల్లారెడ్డి,ఊకంటి మధుకర్ గన్నేరువరం మండలం నుండి పార్టీ మండలాధ్యక్షుడు ముస్కు ఉపేందర్రెడ్డి,బుర్ర తిరుపతిలో, సంతోష్, తిరుపతి, శ్రీధర్ రెడ్డి, దేశరాజు అనిల్,మల్లికార్జున్, పీచు రవీందర్ బెజ్జంకి మండలం నుండి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్,రత్నాకర్ రెడ్డి, పులి కృష్ణ, అక్కరవేణి పోచయ్య ముదిరాజ్,చిలువేరు శ్రీనివాస్ రెడ్డి, గూడెల్లి శ్రీకాంత్, పులి రమేష్ కుంట రమేష్ ఎర్రోళ్ల రాజు, రాజు, శ్రీనివాస్, పైడిపల్లి శంకర్, బొమ్మరవేణి సంతోష్ ఇల్లంతకుంట మండలం నుండి కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, ఊట్కూరి వెంకటరమణారెడ్డి, గుడిసె ఐలయ్య, పసుల వెంకటి, మామిడి రాజు, నేరేళ్ల విజయ్, నవీన్ రెడ్డి, నాయిని నవీన్ కుమార్, బొల్లవేణి రమేష్,ఏ భాస్కర్ రెడ్డి చంద్రారెడ్డి, రమేష్ భూమయ్య తో పాటు అన్ని గ్రామాల కాంగ్రెస్ శ్రేణులు అధిక శ్రేణులు వాహనాల ద్వారా కార్యక్రమానికి తరలివెళ్లారు.

TARAJYOTHI TELUGU DAILY
తారాజ్యోతి

# వైభవం నుంచి...వాడిపోతున్న పొత్కపల్లి

- మొన్న మండల కేంద్రం ఎగిరిపోయింది ● నిన్న రైళ్ల హాల్ట్ తగ్గిపోయింది
- నేడు ఆర్ఓబి జారిపోయింది ● ఇక చెప్పుకోవడానికి గత చరిత్రే మిగిలింది
- దినదినం వెనుకబడుతున్న పొత్కపల్లి పై అందిస్తున్న ప్రత్యేక కథనం...




**బ్యూరో,(తారజ్యోతి):** పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలో పోత్కపల్లి, ఓదెల, కొలనూర్ అనే మూడు రైల్వేస్టేషన్లో అగ్రస్థానం పొత్కపల్లిదే. బస్సు, రైల్వే సౌకర్యాలతో పాటు అతి పెద్దదైన అంగడి, నూనె మిల్లులతో ఒకప్పుడు సుమారు 50 గ్రామాలకు కేంద్రంగా వెలుగు వెలిగింది.

కాలక్రమేన నాయకుల నిర్లక్ష్యం, దిక్కుమాలిన రాజకీయాలతో ఊరు అభివృద్ధి మెల్లమెల్లగా వెనక్కి తగ్గుతున్నది.

మొన్న ఇక్కడికి రావలసిన మండల కేంద్రం ఓదెలకు ఎగిరిపోయింది. అదే మొదటి దెబ్బగా చెబుతూ ఉంటారు. నిన్న రైళ్ల హాల్ట్ తగ్గింది. ఒకప్పుడు ఎన్నో ఎక్స్ ప్రెస్, సూపర్ ఫాస్ట్ రైళ్లు కూడా ఆగిన ఈ స్టేషన్ లో ప్రస్తుతం కొన్ని ప్యాసింజర్ రైళ్లు కూడా ఆగకుండా వెళ్ళిపోతున్నాయి. రైల్వే మ్యాప్ లో ఒకప్పుడు అగ్రస్థానంలో ఉన్న స్టేషన్ ఇప్పుడు పేరు మాత్రమే మిగిలిన పరిస్థితి కాదు కాదు దుస్థితి.

ఇటీవల పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ కొలనూరు రైల్వే గేటు వద్ద ఆర్ఓబి ( రోడ్ ఓవర్ బ్రిడ్జ్ – రైల్వే ట్రాక్ పై నుంచి వెళ్లే వంతెన ) మంజూరైనట్టు ప్రకటించారు. అయితే అసలు ప్రశ్న ఇక్కడే మొదలైంది. రూపు నారాయణపేట – విలాసాగర్ మధ్య మానేరు నదిపై 80 కోట్లతో హై లెవెల్ వంతెనకు శంకుస్థాపన జరిగి పనులు కూడా మొదలవడంతో ఈ రహదారి అనుసంధానం కోసం పొత్కపల్లిలోనే ఆర్ఓబి వస్తుందని ఆశపడ్డారు. కానీ అది కొలనూరుకు వెళ్ళింది. పొత్కపల్లి ప్రాంత ప్రజలు బిత్తర మొహాలతో చూడాల్సిన పరిస్థితి. అయితే కొలనూరు తర్వాతనైనా పొత్కపల్లికి వస్తుందా? అంటే అది కూడా కనుచూపుమేరలో కనిపించడం లేదు. తర్వాత ప్రాధాన్యత ఓదెలకే నట. ఈ లెక్కన ఇక్కడికి ఆర్ఓబి రావాలంటే మరో రెండు దశాబ్దాలు ఎదురు చూడాల్సిందేనా? అన్న ప్రశ్న ప్రజల్లో వినిపిస్తోంది.

మరి ఇక్కడి నాయకత్వం ఎక్కడ ఉన్నట్టు ఏం చేస్తున్నట్టు. ప్రాంత అభివృద్ధి కోసం పోరాడాల్సిన నాయకులు ఎక్కడున్నారన్నది ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పార్టీ మీటింగులకు జనాలను తరలించడం.. చిన్నాచితక పదవులకు పోటీ పడడం.. ఇవి తప్ప దీర్ఘకాలిక అభివృద్ధి కోసం పోరాడే ధైర్యం ఈ ప్రాంత నాయకత్వంలో కనిపించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆర్ఓబి మంజూరుకు కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరం. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు గానీ, పక్కనే ఉన్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కు చెప్పడంలో బిజెపి నాయకులు గానీ సరైన ఒత్తిడి తీసుకురాలేకపోయారనే అభిప్రాయం ప్రజల్లో పెరుగుతోంది

గతాన్ని చెప్పుకుంటూ ఇంకెన్నాళ్లు కాలం గడపడం? ఒకప్పుడు వైభవంగా వెలిగిన పొత్కపల్లి ఒక్కొక్క అభివృద్ధి అవకాశాన్ని కోల్పోతూ వెనుకబడి పోతుంటే.. గత చరిత్ర చెప్పుకుంటూ కాలం గడపడం ఇంకెన్నాళ్లు అనే ప్రశ్న ప్రజల్లో వినిపిస్తోంది.

మానేరు వంతెన పూర్తి అయితే జిల్లాల మధ్య దూరం తగ్గి సహజంగానే వాహనాల రద్దీ పెరుగుతుంది. ఈ మార్గానికి ప్రాధాన్యం మరింత పెరగడం ఖాయం. ఇప్పటికే పొత్కపల్లి రైల్వే గేట్ దగ్గర పరిస్థితి ఎలా ఉందో స్థానికులకు బాగా తెలుసు. ఏదైనా భారీ వాహనం గేటు దగ్గర ఆగిపోయినా.. లేదా ఏదైనా సాంకేతిక సమస్యతో గేటు మూసినా... వెంటనే కిలోమీటర్ల మేర వాహనాలు బార్లు తీరే పరిస్థితి ఏర్పడుతున్నది.

మొదట ఆరోబి నిర్మాణం జరగాల్సిన ప్రదేశం ఇదే అని ప్రజలు భావిస్తున్నారు . ఎందుకంటే భారీ వంతెన నిర్మాణం జరుగుతున్నప్పుడు దానికి అనుసంధానంగా రోడ్డు సౌకర్యాలు ట్రాఫిక్ పరిష్కారాలు కూడా ముందుగానే ప్రణాళికలో ఉండాలి. కానీ ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే అందుకు పూర్తి వ్యతిరేకంగా కనబడుతున్నాయి.

ఇప్పటికైనా ఈ ప్రాంత నాయకత్వం నిద్ర నుంచి సాధ్యమైనంత తొందరగా లేచి మానేరు వంతెన పూర్తి అయ్యే లోపు పొత్కపల్లికి ఆర్ఓబిని మంజూరు చేసుకోవాల్సిన దిశగా పోరాటం మొదలు పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# లిఫ్ట్ వైర్ తెగిన ప్రమాదంలో గాయపడిన మీడియా ప్రతినిధులు

- ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో చికిత్స ● మెరుగైన వైద్య సేవలు అందించాలి: జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ.





**భూపాలపల్లి, మార్చి -12::** జిల్లా కేంద్రంలోని శ్రీనివాస కన్వెన్షన్ హాల్‌లో గురువారం లిఫ్ట్ వైర్ తెగి జరిగిన ప్రమాదంలో గాయపడిన మీడియా ప్రతినిధులు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వైద్యాధికారులను ఆదేశించారు. ప్రమాద ఘటన గురించి తెలుసుకున్న జిల్లా కలెక్టర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న మీడియా ప్రతినిధులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారి ఆరోగ్య పరిస్థితిని, ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. గాయపడిన వారికి అవసరమైన అన్ని విధాల వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పెద్ద పెద్ద భవనాలలో భద్రతా ప్రమాణాలను పరిశీలించేందుకు ఫైర్, పోలీస్, మున్సిపల్, రెవెన్యూ, పంచాయతీ శాఖల అధికారులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి సమగ్ర తనిఖీలు చేపడతామని తెలిపారు. భవనాల నాణ్యత, భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అనుమతులు లేకుండా నిర్మించిన కట్టడాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే పెద్ద భవనాలకు నిబంధనల మేరకు తప్పనిసరిగా పార్కింగ్ సౌకర్యం ఉండాలని, భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్ ఎం ఓ దివ్య తదితరులు పాల్గొన్నారు.

# రామగుండం సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నుల పంపిణీ

- పదవ తరగతి పరీక్షల నేపథ్యంలో విద్యార్థులకు ప్రోత్సాహం ఏసీపీ మడత రమేష్





**రామగుండం కమిషనరేట్ :** పదవ తరగతి పరీక్షలు మార్చి 14 నుంచి ప్రారంభమవుతున్న నేపథ్యంలో రామగుండం సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం సలహాదారు సురేష్ సహకారంతో, రామగుండం గురుకుల పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో, ఎస్సీఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, గురుకుల పేరెంట్స్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కవ్వంపల్లి సతీష్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గోదావరిఖని ఏసీపీ మడత రమేష్, రామగుండం ఎస్ఐ సంధ్య హాజరై విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థి దశ జీవితంలో ఎంతో కీలకమైందని, ఇప్పుడే కష్టపడి చదివితేనే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని తెలిపారు. పదవ తరగతి పరీక్షలను లక్ష్యంగా పెట్టుకుని శ్రద్ధగా చదివి మంచి జీపీఏ సాధించాలని సూచించారు. చదువుకున్న వారికి సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని, విద్యార్థులకు ఎల్లప్పుడూ తమవంతు సహకారం ఉంటుందని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని, తల్లిదండ్రులు మరియు గురువులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎస్‌వీపీ రజిత, జేవీపీ రజిత, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఉషారాణి మురళి, ప్రధాన కార్యదర్శి కె. భాగ్యలక్ష్మి, వైస్ చైర్మన్ మాధవి, కోశాధికారి బాదే అంజలి, కార్యదర్శులు సంధ్యారాణి, రజిత, పేరెంట్స్ కమిటీ నాయకులు నవీన, శైలజ, కళ్యాణి, జ్యోతి, పేరెంట్స్ కమిటీ జిల్లా నాయకులు సంపత్, సతీష్, ఉపాధ్యాయులు తేజశ్విని, నర్మద, రజిత, సునీత, సమత, మానస, శ్రీదేవి, శ్రీలత, హెచ్ఎస్ మేడమ్‌తో పాటు కళాశాల సిబ్బంది మరియు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కార్మికుల పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలి

**- భారతీయ మజ్దూర్ సంఘ్ జిల్లా కార్యదర్శి తొర్తి శ్రీనివాస్**



**కరీంనగర్ టౌన్,మార్చ్12:** కరీంనగర్ రూరల్ మండలంలోని చామనపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పని ప్రదేశాన్ని సందర్శించి కార్మికుల యొక్క సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ పేదల జీవనోపాధికి బలమైన ఆధారం అయిన గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా ప్రతి గ్రామీణ కుటుంబానికి సంవత్సరానికి 125 రోజుల ఉపాధి హామీ ఇవ్వాలని ప్రభుత్వం చట్టబద్ధంగా నిర్ణయించింది. ఈ చట్టం వల్ల లక్షలాది మంది పేద కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. కానీ ప్రస్తుతం ఉపాధి హామీ కార్మికులు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారు. పని చేసిన తర్వాత కూడా వేతనాలు నెలల తరబడి రావడం లేదు. పని ప్రదేశాల్లో తాగునీరు, నీడ విశ్రాంతి స్థలం,ప్రథమ చికిత్స వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు సమయానికి రాకపోవడం వల్ల పనులు ఆగిపోతున్నాయి. అదే విధంగా ఫేస్ గుర్తింపు కోసం పని కి ముందు,తర్వాత ఫోటో తీసి అప్లోడ్ చేయడానికి సిగ్నల్స్,సాఫ్ట్వేర్ ప్రాబ్లం వల్ల ఎన్నో సమస్యలు తలెత్తుతున్నాయి. ముదురుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకొని వేసవి భత్యం కూడా ప్రతి కార్మికునికి కల్పించాలి. అదేవిధంగా 125 రోజులు పనిని కల్పించే ఆలోచన కింద ప్రభుత్వానికి ఉన్నట్లయితే దానికి కావలసిన బడ్జెట్ ను ఏర్పాటు చేయాలని,ఈ విషయాన్ని కేంద్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు చర్చించి కార్మికులకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకోవాలని కోరడం జరిగింది.

# కవ్వంపల్లిని మర్యాదపూర్వకంగా కలిసిన దేవస్థానం చైర్మన్..



**ఇల్లందకుంట మార్చి 12 :** గాంధీభవన్ లో మానకొండూరు శాసనసభ్యులు కవ్వంపెల్లి సత్యనారాయణ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ విభాగం చైర్మన్ గా పదవి స్వీకార మహోత్సవ కార్యక్రమానికి శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం చైర్మెన్ ఇంగిలే రామారావు సత్యనారాయణ ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛశీ ఇచ్చి శాలువాతో సన్మానం చేయడం జరిగింది. ఇలాంటి పదవులు అనేకం అధిరోహించాలని ప్రజా జీవితంలో ప్రజలకు ఇంకా మంచి సేవ చేయాలని కోరారు.

# మారక తప్పదు.. నియమాలను పాటించవలసిందే

**-ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమం లో భాగంగ వ్యాపారులతో సమావేశం -పన్నూర్ గ్రామ సర్పంచ్ చిందం మహేష్**



**రామగిరి, మార్చి12:-** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమం లో భాగంగ పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం పన్నూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ చిందం మహేష్ అధ్యక్షతన సెంటినరీ కాలనీ వ్యాపారస్తులతో మాంసం విక్రయధరులు, దుకాణ దారులతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రామగిరి ఎంపిడిఓ బద్రి శైలజరాణి , ఆర్ డబ్ల్యూ ఎస్ డిఈ రాజ్ కుమార్ హాజరై ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై పథకాలపై అవగాహన కల్పించారు. షాప్ కాంప్లెక్స్ రోడ్డు వెంబడి ఎవరి దుకాణం ముందు వారు శుభ్రం గా ఉంచుకోవాలని అన్నారు. లేని యెడల ఎవరైతే చెత్త రోడ్డు బయట వేస్తున్నారో వారికి 500 నుండి 1000 జరిమాన విధించడం జరుగుతుందని అన్నారు. అనంతరం కేజీబీవీ పాఠశాలను సర్పంచ్ తో కలిసి సందర్శించారు. విద్యార్థిని ల మంచి చెడులు అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి విద్యార్థులకు జరగబోయే పరీక్షలపై ఎలాంటి ఒత్తిడి లేకుండా వ్రాయాలని తగు సూచనలు అందించారు మరియు కిచెన్ ను సందర్శించారు. ఈ కార్యక్రమం లో వార్డు సభ్యులు చేతి సుధాకర్ , తాండ్ర ప్రశాంత్, పంచాయతీ కార్యదర్శి భూక్యా ప్రేమలత, పాఠశాల ఎశీ మంజుల, ఏ ఎన్ ఏం శారద, అంగన్వాడీ టీచర్ లు రాజ్యలక్ష్మి , మంజుల, ఆశా వర్కర్ శిరీష , వ్యాపారవేత్తలు అధ్యక్షుడు ఆకుల నారాయణ, ఓర్రె మస్తాన్, సంపత్ రెడ్డి, రమేష్, హైమద్, పెయ్యాల రవి ,గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా గ్యాస్ ఫిల్లింగ్, విక్రయాలు చేస్తున్న వారిపై కేసు నమోదు



**భూపాలపల్లి/కాటారం/మార్చి - 12::** కాటారం మండల కేంద్రంలో అక్రమంగా గ్యాస్ సిలిండర్లలో ఫిల్లింగ్ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్న వారిని పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన కడవాస రాజకుమార్ గారెపల్లి లో వ్యాపారం చేస్తూ, అక్రమ గ్యాస్ ఫిల్లింగ్ దందాకు పాల్పడ్డాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు తనిఖీలు చేయగా గ్యాస్ ఫిల్లింగ్ చేసే యంత్రం, 3గ్యాస్ సిలిండర్లు లభ్యమయ్యాయి, మరియు గారెపల్లికి చెందిన సుధాకర్, రమేష్ అనే యువకులు కూడా గ్యాస్ ఫిల్లింగ్ చేసి అక్రమంగా అధిక ధరలకు అమ్ముతూ వారి వద్ద నుంచి నాలుగు సిలిండర్లను స్వాధీనం చేసుకొని ముగ్గురిపై కేసు నమోదు చేశామని ఎస్సై ఆకుల శ్రీనివాస్ తెలిపారు.

TARAJYOTHI TELUGU DAILY తారాజ్యోతి

# విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు పోవాలి...

**● తల్లిదండ్రుల ఆశలను నిలబెట్టేలా మన నడవడిక ఉండాలి ● తెలంగాణ రాష్ట్ర ఐటి పరిశ్రమ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**





**రామగిరి, మార్చి 12:-** కళాశాలలో చదువుతున్న విద్యార్థులు తమ భవిష్యత్ ను గొప్పగా నిర్మించుకొనేలా ఆలోచించాలని సాంకేతిక అభివృద్ధి దిశగా పయ నిస్తున్న నేపథ్యంలో అందుకు అనుగుణం గా విద్యార్థులు సాంకేతికత పై పట్టు సాధించాలని ఐటీ మంత్రి దుద్ధిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. బుధవారం రాత్రి జేఎన్టీయూ కళాశాల 14వ వార్షికోత్స వాన్ని పురస్కరించుకొని కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కళాశాల లోని బ్లాక్-టు లో మంత్రికి వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కళా శాలలో చేపట్టిన సివి రామన్ ఆడిటోరియంను మంత్రి ప్రారంబించారు. అనంతరం కళాశాల ఆవరణలో యునివర్సిటీ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ... 16 సంవత్సరాల క్రితం అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి ని తమ నియోజకవర్గంలో జెఎన్టియు యూనివర్సిటీ కావాలని అడుగగానే అనుమతులు ఇచ్చారని గుర్తు చేశారు. ఈరోజు జెఎన్టీయు మంథని వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొనడం నాకు ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. కొంతమంది ఆనాడు మారుమూల ప్రాంతంలో జేఎన్టీయూ కళాశాల ఏర్పాటు చేయడం సరికాదని విమర్శించారని కానీ మంథని జేఎన్టీయూ కళాశాలలో చదివిన విద్యార్థి యుపిఎస్సి ఫలితాలలో తెలంగాణ రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచి మన ప్రాంతానికి గుర్తింపు తెచ్చిందని గుర్తు చేశారు. తెలంగాణలోని అనేక మంది యువతకు జ్ఞానం, నైపుణ్యాలు మంచి భవిష్యత్తును అందిస్తున్న గొప్ప విద్యా కేంద్రంగా మన మంథని జేఎన్టీయూ కళాశాల గుర్తింపు పొందాలని ఆశాభావం వ్యక్తం చేశారు. టెక్నాలజీ వేగంగా మారుతున్న ఈ కాలంలో మీరు కొత్త ఆలోచనలు, సృజనాత్మకత కష్టపడి పనిచేసే తత్వం కలిగి ఉండాలి విద్యార్థులను సూచించారు. అతి త్వరలో మంథని నియోజకవర్గంలో మరో విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసే ప్రయత్నం చేస్తున్నామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు గ్రామ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేయాలని తద్వారా గ్రామాలు అభివృద్ధి దిశవైపు పయనిస్తాయని సూచించారు. ఈ కార్యక్రమం లో యూనివర్సిటి వైస్ చాన్సలర్ కిషన్ కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావు, ఆర్జీ-త్రీ జీఎం మధుసూదన్, వైస్ ప్రిన్స్‌పాల్ ఉదయ్‌కుమార్, మంతిని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్, పన్నూర్ సర్పంచ్ చిందంమహేష్, మార్కెట్‌కమిటి చైర్మన్ వైనాల రాజు, మున్సిపల్ చైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు డీసీపీ భూక్యరాంరెడ్డి, ఏసీపీ మడత రమేశ్, సీఐ రాజు, రామగిరి ఎస్ఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





# మస్జిద్ కమిటీని ప్రకటించిన తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డ్

**తొర్రూరు, :** మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ పట్టణ కేంద్రంలోని స్థానిక జమా మస్జిద్ కమిటీని తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డు ప్రకటించడం జరిగింది. అధ్యక్షుడిగా మహమ్మద్ అబ్దుల్ అలీమ్, ఉపాధ్యక్షులుగా మహమ్మద్ మౌలానా పాషా, మహమ్మద్ షబ్బీర్ అలీ, ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ అమీర్, కోశాధికారిగా మహమ్మద్ గౌస్ మైనోద్దీన్, కమిటీ మెంబర్స్ గా మమ్మద్ యాకుపాషా, ఎస్డి చాంద్ పాషా,మహమ్మద్ అబ్దుల్ గని,మహమ్మద్ ఎజాజ్, మహమ్మద్ అమీనుల్ ఇస్లాం,మహమ్మద్ సలామ్ పాషాల ను ప్రకటించినట్లు నియామక పత్రాన్ని మహబూబాబాద్ జిల్లా వక్ఫ్ బోర్డు ఇన్స్పెక్టర్ నజీముద్దీన్ చేతుల మీదుగా తీసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ అలీమ్, ఉపాధ్యక్షుడు మౌలానా పాషా, ప్రధాన కార్యదర్శి అమీర్లు సంయుక్తంగా మాట్లాడుతూ తొర్రూర్ జమా మస్జిద్ కమిటీని ప్రకటించిన తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్, సిఈవోకు, మహబూబాబాద్ జిల్లా వక్ఫ్ బోర్డు ఇన్స్పెక్టర్ నజీముద్దీన్ కి కమిటీ పక్షాన ధన్యవాదాలు తెలియజేసుకుంటూ మస్జిద్ అభివృద్ధి కొరకు తమ వంతు సహాయ సహకారాలను అందిస్తామని పేర్కొంటూ జమా మస్జిద్ కు సంబంధించిన వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు మొదటి ప్రాధాన్యతను కల్పిస్తూ పట్టణ మరియు మండలంలోని ముస్లిం సోదరుల సంక్షేమం కోసం స్థానిక ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సహాయ సహకారాలతో కృషి చేస్తామని తెలుపుతూ ముస్లిం సోదరులందరికీ కలుపుకొని ముందుకు వెళ్దామని అంటూ కమిటీ ఏర్పాటుకు పూర్తి సహకారం అందించిన స్థానిక ఎమ్మెల్యే మామిడాల



యశస్వినీ రెడ్డికి, టిపిసిసి ఉపాధ్యక్షురాలు అనుమాండ్ల ఝాన్సీ రెడ్డికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు. అదేవిధంగా ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన ఆర్టీసీ డ్రైవర్ షేక్ యాకూబ్ పాషా కుటుంబానికి మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ అతని పవిత్ర ఆత్మకు శాంతి చేకూర్చాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తూ అతని కుటుంబానికి కమిటీ ఎల్లవేళలా అండగా ఉంటుందని అన్నారు.

# ప్రభుత్వ సొమ్ము కాజేసిన రైస్ మిల్లులపై మొదలైన చర్యలు....

**● విజయ శ్రీ రైస్ మిల్ యజమానిని అరెస్ట్ చేసిన పెద్దపల్లి పోలీసులు**

**పెద్దపల్లి ప్రతినిధి :** ఖరీఫ్,రబీ సీజన్ సంబంధించి రికార్డుల మీద ఉన్న ధాన్యం మిల్లులు లో కనిపించడం లేదని, దీనికి సంబంధించి మిల్లర్ల నుంచి ధాన్యానికి సంబంధించిన బకాయిలు తక్షణమే చెల్లించాలని, బకాయిలు చెల్లించని మిల్లర్ల పై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ చెప్పిన విధంగానే ధాన్యం మింగిన రైస్ మిల్ యజమానులను పెద్దపల్లి పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఖరీఫ్ సీజన్ కు గాను కస్టమ్ మిల్డ్ రైస్ (సి ఎం ఆర్) అందించుటకు టి. జి. ఎస్. సి. ఎస్. సి. ఎల్. వారితో ధాన్యం నిల్వలకు సంబంధించిన ఒప్పందం చేసుకొని ఏజెంట్‌గా ఉన్న పెద్దపల్లి పట్టణం సుభాష్ నగర్‌కు చెందిన కొమురవెల్లి రాజేందర్ యొక్క విజయ శ్రీ రైస్ మిల్లును పెద్దపల్లి రెవెన్యూ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేయగా 17,406.86 క్వింటాళ్ల ధాన్యం లేకపోవడం(ధాన్యం లోటు)గుర్తించారు. ఆ ధాన్యం విలువ ప్రతి క్వింటాల్‌కు రూ. 2,585.03 చొప్పున మొత్తం రూ. 4,49, 45,043/- గా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన ధాన్యాన్ని రైస్ మిల్లర్లు బియ్యం రూపంలో తిరిగి ప్రభుత్వానికి ఇవ్వవలసి ఉంటుందని కాని రికార్డులు ఎవరూ చెక్ చేయరని భావించి అక్రమంగా ఎక్కువ డబ్బు సంపాదించుటకు ఇదే మంచి అవకాశం అనుకొని కొంత ధాన్యాన్ని అమ్మి వచ్చిన డబ్బులను వారి వ్యక్తిగత ఖర్చులకు



వినియోగించుకున్నట్లు తెలిపారు. ఈ విధంగా ప్రభుత్వాన్ని మోసం చేసి లబ్ది పొందిన రైస్ మిల్లర్ కొమురవెల్లి రాజేందర్ పై అధికారులు ఇచ్చిన పిర్యదుతో గురువారం పెద్దపల్లి పోలీసులు విజయ శ్రీ రైస్ మిల్లు పై కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం కొమురవెల్లి రాజేందర్ ను కోర్ట్ లో హాజరు పరిచినట్లు తెలియజేశారు

# తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వెస్ట్రన్ ఆస్ట్రేలియా విశ్వవిద్యాలయంతో అకాడమిక్ సహకారం పరిశీలన



**హైదరాబాద్, (తారా జ్యోతి):** తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి మరియు వెస్ట్రన్ ఆస్ట్రేలియా విశ్వవిద్యాలయం మధ్య అకాడమిక్ మరియు పరిశోధనా సహకార అవకాశాలను విస్తరించేందుకు వెస్ట్రన్ ఆస్ట్రేలియా విశ్వవిద్యాలయ ప్రతినిధి బృందం తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టా రెడ్డి, కార్యదర్శి ప్రొఫెసర్. శ్రీరామ్ వెంకటేష్‌లతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. వెస్ట్రన్ ఆస్ట్రేలియా విశ్వవిద్యాలయ ప్రతినిధి బృందంలో గ్లోబల్ గ్రోత్ అండ్ అడ్వకసీ డైరెక్టర్ నషీద్ చౌదరి, గవర్నమెంట్ అండ్ ఇండస్ట్రీ రిలేషన్స్ మేనేజర్ హరి పద్మనాభన్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో విమానయాన, వ్యవసాయం, అంతరిక్షం, క్రిటికల్ మినరల్స్ వంటి ప్రాధాన్యత రంగాల్లో ఆస్ట్రేలియా-భారత్ విద్యా సంస్థల మధ్య భాగస్వామ్య అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. పరిశోధన, ఆవిష్కరణలు మరియు నైపుణ్యాభివృద్ధి రంగాల్లో పరస్పర సహకారాన్ని బలోపేతం చేయాలనే ఉమ్మడి ఆసక్తిని ఇరు పక్షాలు వ్యక్తం చేశాయి. భారత ప్రభుత్వ ప్రధాన శాస్త్ర సలహాదారుడి కార్యాలయం ఆధ్వర్యంలో అభివృద్ధి చెందుతున్న ముఖ్య సైన్స్ అండ్ టెక్నాలజీ క్లస్టర్లలో హైదరాబాద్ ఒకటిగా గుర్తింపు పొందినట్టు సమావేశంలో ప్రస్తావించారు. ఆధునిక పరిశోధన మరియు సాంకేతిక అభివృద్ధి కేంద్రంగా హైదరాబాద్ పెరుగుతున్న ప్రాధాన్యతను ఇది ప్రతిబింబిస్తుంది. అదేవిధంగా, వెస్ట్రన్ ఆస్ట్రేలియా విశ్వవిద్యాలయం ఇటీవల ఇండియా సైన్స్ అండ్ టెక్నాలజీ క్లస్టర్స్ ఇనిషియేటివ్‌తో కుదుర్చుకున్న వ్యూహాత్మక అవగాహన ఒప్పందం (వీశీఖ) కూడా ఆస్ట్రేలియా--భారత్ సైన్స్, టెక్నాలజీ మరియు ఇన్నోవేషన్ రంగాల్లో సహకారాన్ని మరింత బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించనుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ వి. బాలకిష్టా రెడ్డి మాట్లాడుతూ, అంతర్జాతీయ అకాడమిక్ భాగస్వామ్యాలను ప్రోత్సహించడంలో తెలంగాణ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని వెస్ట్రన్ ఆస్ట్రేలియా విశ్వవిద్యాలయ ప్రతినిధి బృందానికి హామీ ఇచ్చారు. ఉన్నత విద్య, పరిశోధన మరియు ఆవిష్కరణల కేంద్రంగా తెలంగాణ వేగంగా ఎదుగుతున్నదని ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయ సహకారం ద్వారా విద్యా ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో ఇరు పక్షాలు పరస్పర సహకారానికి విస్తృత అవకాశాలు ఉన్నాయని అంగీకరించాయి. భవిష్యత్ భాగస్వామ్యాలకు అనుకూలమైన వ్యవస్థను రూపొందించేందుకు చర్చలను కొనసాగించేందుకు నిర్ణయించాయి. ప్రతిపాదిత సహకారం ద్వారా విద్యార్థి మార్పిడి కార్యక్రమాలు, సంయుక్త పరిశోధనా ప్రాజెక్టులు, అలాగే అకాడమియా--పరిశ్రమల మధ్య మరింత బలమైన అనుసంధానం ఏర్పడనుందని భావిస్తున్నారు.

## వెలికట్టే గ్రామంలో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం

**- పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి**



**తొర్రూరు, :** పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి తొర్రూరు మండలం వెలికట్టే గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. గ్రామ ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ పనులను ప్రారంభించినట్లు తెలిపారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నదని అన్నారు. ప్రజలకు సౌకర్యవంతమైన రహదారులు ఉండేలా సీసీ రోడ్లు నిర్మించడం ద్వారా గ్రామాల అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తానని అన్నారు. అలాగే గ్రామ ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు..

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



**కాటారం, మార్చి 12 (తారా జ్యోతి):** కాటారం మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన తోట సదానందం కుటుంబ సభ్యులకు తొమ్మిదవ వార్డ్ మెంబర్ తొట్ల శ్రీకాంత్ పదివేల రూపాయల ఆర్థిక సాయం చేశారు, ఆయన వెంట ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు పసుల మొగిలి, మానేం రాజబాబు, పసుల శంకర్, కొట్టే రాజేశం, తోట వెంకటస్వామి, తోట రాజు, గాడి పెల్లి రవి, గాడి పెల్లి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# బాబోయ్... వీధి కుక్కలు

- భయపెడుతున్న గ్రామ సింహాలు,
- వాహనాలను వెంబడించి... ప్రమాదాలకు కారణమై...
- కలుషిత ఆహారం తింటూ జనంపై ఎగబడుతున్న కుక్కలు
- నెల రోజుల వ్యవధిలో100 మంది పై దాడి..
- దాడితో ఆసుపత్రుల పాలవుతున్న జనం..
- రోడ్డుమీదకు వచ్చేందుకు పిల్లలు, వృద్ధుల్లో భయం
- కానరాని సంతాన నిరోధక చర్యలు,
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



**కాటారం, మార్చి 12 (తారా జ్యోతి):** కాటారం మండలంలోని చాల ప్రాంతాల్లో వీధి కుక్కలు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. రోడ్ల మీదకు రావాలంటే ప్రజలు భయపడే పరిస్థితి. కాటారం మండలంలో వీటి బెడద అధికంగా ఉంది. ఒక నెల రోజుల్ని 80 నుంచి 100 మంది పై కుక్కలు దాడి చేశాయి, రోడ్లపై గుంపులు గుంపులుగా సంచరిస్తున్న గ్రామ సింహాల కారణంగా తమ పిల్లల్ని స్కూళ్లకు పంపించే సమయంలో తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. కలుషిత ఆహారం తింటూ జనంపై ఎగబడుతున్న కుక్కలు, కాటారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై వాహన రాకపోకలు సాధించే వారిపై కుక్కలు దాడులకు పాల్పడుతున్నాయి. రోడ్లపై నిద్రిస్తూ వాహన శబ్దం రాగానే లేచి, వెంటపడి తరుముతున్నాయి. భయంతో వేగాన్ని పెంచి ప్రమాదాల బారిన పడుతున్నామని వాహన చోదకులు వాపోతున్నారు. మండల కేంద్రంలో నిర్వహిస్తున్న మాంసం దుకాణాల వద్ద వీధి కుక్కలు అధికంగా తిరుగుతున్నాయి. దుకాణదారులు పారబోసిన వ్యర్థాలను తింటూ తమ సంతతిని వృద్ధి చేసుకుంటున్నాయి. రాత్రి సమయాల్లో వీధుల్లో అరుపులతో విచ్చలవిడిగా సంచరిస్తూ కంటిమీద కురుపు లేకుండా చేస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. పెరుగుతున్న కుక్క కాటు బాధితులు.. వీధి కుక్కల దాడులతో ప్రతిరోజు కాటారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు సగటున నలుగురు చొప్పున నెలకు 100 మంది వచ్చి వైద్యం పొందుతున్నారు. మండలంలో వీధి కుక్కల నియంత్రణకు పంచాయతీ అధికారులు కనీస చర్యలు తీసుకోవడం లేదు. ఫలితంగా వాటి సంతతి రోజు రోజుకీ పెరుగుతుంది. వీధి కుక్కల నియంత్రణ పేరిట మొక్కుబడి కార్యాచరణతో అధికారులు చేతులు దులిపేసుకుంటున్నారు. కాటారం పీ హెచ్ సీ లో రేబిస్ వ్యాక్సిన్ లు అందుబాటులో ఉండడంతో ప్రజలు కొంతమేర ఊపిరి పీల్చుకుంటున్నారు. వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి, డాక్టర్ మౌనిక, వైద్యాధికారి కాటారం, కుక్క కాటుకు పీహెచ్సీలో వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి. వీటి బారిన పడిన రోగులు ఆసుపత్రిని సంప్రదించి ఉచితంగా వైద్యం పొందవచ్చు. గాయపడిన వ్యక్తులను నేరుగా ప్రభుత్వ వైద్యశాలకు తీసుకొచ్చి వైద్యులు సూచించిన మందులు వాడాలి. చిన్నపిల్లలను కుక్కలకు దూరంగా ఉంచాలి. అధికారులు స్పందించాలి, కాటారం బిఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు రామిళ్ళ కిరణ్ కాటారం మండలంలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. మూగజీవాలపై దాడి చేసి హత మారుస్తున్నాయి. మనుషులను కాటేస్తున్నాయి మండలాధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి కాపాడాలి.

# విశ్వజి



## ఈ విత్తనాలు తీసుకుంటే బరువు ఇట్టే తగ్గుతారు..

చాలామంది బరువు తగ్గాలని కోరుకుంటారు. దీనికోసం ఎన్నో ప్రయత్నాలు చేసినప్పటికీ విఫలం అవుతుంటారు. ఒకవేళ మీరు బరువు తగ్గాలనుకుంటే కొన్ని విత్తనాలను ఆహారంలో చేర్చుకుంటే సరిపోతుంది. ఇవి ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. ఇప్పుడు బరువు తగ్గడంలో సహాయపడే కొన్ని విత్తనాల గురించి తెలుసుకుందాం.చియా గింజలు సైజులో చిన్నగా ఉన్నా కానీ దాన్ని తీసుకోవడం వల్ల ఎన్నో లాభాలు ఉంటాయి. ఈ గింజల్లో ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు, ప్రోటీన్, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. ఇవి ఆహారాన్ని తక్కువ తీసుకోవడానికి ఉపయోగపడతాయి. అవిసె గింజలు కొవ్వును కరిగించడంలో అద్భుతంగా పనిచేస్తాయి. ఇందులో లిగ్నాన్లు, ఫైబర్ నిండి ఉంటాయి. దీంతో ఇవి జీర్ణక్రియను నెమ్మదిస్తాయి. వీటి వినియోగం ఆకలిని కూడా తగ్గిస్తాయి. ఇవి గుండె ఆరోగ్యానికి మంచివి. సోంపు గింజలును మౌత్ ప్రెషర్ గా ఉపయోగిస్తాము. కానీ వీటిని తీసుకుంటే అనేక లాభాలు ఉంటాయి. సోంపు గింజలు జీర్ణక్రియ, ఆకలిని కూడా అణిచివేయడంలో సహాయపడతాయి. అంతేకాకుండా ఇవి జీవక్రియను పెంచుతాయి. బరువు తగ్గడానికి కూడా ఎంతో సహాయపడతాయి. గుమ్మడికాయ గింజల్లో ప్రోటీన్, మెగ్నీషియం, ఐరన్ అధికంగా నిండి ఉంటాయి. ఇవి శరీర కొవ్వును బాగా కరిగించడానికి ఉపయోగపడతాయి. నువ్వులు శతాబ్దాలుగా ఆయుర్వేదంలో ఉపయోగిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో ఉండే ఫైబర్, ప్రోటీన్ బరువు తగ్గడానికి ఎంతో ఉపయోగపడతాయి. వీటి వినియోగం ఇట్టే కొవ్వును కరిగిస్తాయి.

## నేరేడు పండ్లు తింటున్నారా..?



మన ఆరోగ్యం మనం తీసుకునే ఆహారంపై ఆధారపడి ఉంటుంది. తాజా కూరగాయలు, పండ్లు తీసుకుంటే మన శరీరానికి కావాల్సినంత బలం వస్తుంది. ఎంతో ఆరోగ్యంగా కూడా ఉంటాము. అయితే, పండ్లలో భాగంగా మనం నేరేడు పండు తినే ఉంటాము. నేరేడు పండ్లలో అనేక పోషకాలు నిండి ఉంటాయి. ఇందులో ఉండే కాల్షియం, మెగ్నీషియం, ఐరన్, సోడియం, విటమిన్ సి శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో ఎంతో సహాయపడతాయి. అయితే ఇప్పుడు నేరేడు పండ్లు తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి తెలుసుకుందాం. నేరేడు పండ్లలో గ్లూకోజ్, ప్రక్టోజ్ పుష్కలంగా ఉంటాయి. దీని కారణంగా ఈ పండ్లను తినడం వల్ల అజీర్ణం, కడుపునొప్పి వంటి సమస్యలు రాకుండా ఉంటాయి. ఈ పండ్లు రోగ నిరోధక శక్తిని కూడా పెంచుతాయి. ఇందులో ఉండే పొటాషియం, ఐరన్, కాల్షియం రక్తహీనతను నివారిస్తుంది. నేరడు పండ్లలో విటమిన్ ఏ, విటమిన్ సి పుష్కలంగా ఉంటాయి. దీంతో ఇవి కళ్ళను ఆరోగ్యంగా ఉంచుతూ, చర్మాని అనేక సమస్యల నుండి కాపాడుతుంది. జాగ్రత్తలు.. నేరేడు పండ్లను ఎప్పుడు ఖాళీ కడుపుతో తినకూడదు. కారణం.. ఇది వాతకారిగా పనిచేస్తుంది. అంతేకాకుండా ఖాళీ కడుపుతో ఈ పండ్లను తీసుకుంటే గ్యాస్ సమస్య వచ్చే అవకాశం ఉంటుంది. ఈ పండును సరైన సమయంలో అంటే మధ్యాహ్నం భోజనం తర్వాత తీసుకోవచ్చు.

## గర్భిణీలు కొబ్బరి నీరు తాగితే ఏమౌతుందో తెలుసా..?



గర్భం దాల్చిన తర్వాత స్త్రీ శరీరంలో జరిగే మార్పులు, వాటికి అనుగుణంగా వచ్చే చిన్ని చిన్ని ఇబ్బందులను అధిగమించడానికి పోషకాలతో కూడిన ఆహారం, ద్రవాలు చాలా ముఖ్యం. ఇలాంటి సమయంలో ప్రకృతి ప్రసాదించిన అద్భుతమైన ద్రవాలలో ఒకటి – కొబ్బరి నీరు. కేవలం దాహాన్ని తీర్చడమే కాదు, ఇది గర్భధారణ సమయంలో తల్లికి, పెరుగుతున్న శిశువుకు ఎన్నో ప్రయోజనాలను అందిస్తుంది.

రోజూ కొబ్బరి నీరు తాగవచ్చా?

గర్భధారణ సమయంలో రోజూ కొబ్బరి నీరు తాగడం చాలా సురక్షితమైనది, ఆరోగ్యకరమైనది కూడా. పోషకాహార నిపుణులు, వైద్యులు కూడా దీనిని సిఫార్సు చేస్తుంటారు. అయితే, మితంగా తీసుకోవడం ఎల్లప్పుడూ మంచిది.

కొబ్బరి నీటి వల్ల కలిగే ప్రయోజనాలు:


గర్భధారణ సమయంలో డీహైడ్రేషన్ సాధారణం. కొబ్బరి నీరు ఎలక్ట్రోలైట్స్ (పొటాషియం, సోడియం, కాల్షియం, మెగ్నీషియం) పుష్కలంగా ఉండటం వల్ల శరీరానికి అవసరమైన ద్రవాలను అందించి, హైడ్రేటెడ్‌గా ఉంచుతుంది. ఇది ముఖ్యంగా ఉదయం అలసట (మార్నింగ్ సిక్‌నెస్) సమయంలో చాలా ఉపశమనాన్ని ఇస్తుంది. గర్భిణులలో సాధారణంగా కనిపించే వికారం, వాంతులు తగ్గించడానికి కొబ్బరి నీరు అద్భుతంగా పనిచేస్తుంది.దీనిలోని సున్నితమైన రుచి, సహజమైన చక్కెరలు జీర్ణవ్యవస్థను ప్రశాంతంగా ఉంచుతాయి. కొబ్బరి నీరు ఆమ్లత్వాన్ని తగ్గించి, గుండెల్లో మంట, అజీర్తి వంటి సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తుంది.లారిక్ యాసిడ్ వంటి యాంటీవైరల్, యాంటీబాక్టీరియల్ గుణాలు కొబ్బరి నీటిలో ఉంటాయి, ఇవి తల్లి, బిడ్డ ఇద్దరికీ రోగనిరోధక శక్తిని పెంచడానికి సహాయపడతాయి. కొబ్బరి నీటిలోని సహజ చక్కెరలు, విటమిన్లు గర్భిణులకు అవసరమైన శక్తిని అందించి, అలసటను తగ్గిస్తాయి. కొబ్బరి నీటిలోని ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరిచి, గర్భధారణ సమయంలో సాధారణంగా వచ్చే మలబద్ధకం సమస్యను తగ్గిస్తుంది.ఇది మూత్రపిండాల పనితీరును మెరుగుపరచి, మూత్రనాళ ఇన్ఫెక్షన్లను నివారించడంలో సహాయపడుతుంది. ముఖ్య సూచనలు : స్వచ్ఛమైన కొబ్బరి నీటిని తాగడానికి ప్రయత్నించండి.కొబ్బరి నీటిని త్రాగడానికి ముందు మీ వైద్యుడిని సంప్రదించడం ఎల్లప్పుడూ మంచిది, ముఖ్యంగా మీకు ఏదైనా ఆరోగ్య సమస్యలు ఉంటే. ఒకేసారి అతిగా కాకుండా, మితమైన పరిమాణంలో తీసుకోవడం ఉత్తమం.



## భోజనం తర్వాత వాకింగ్ చేయాలా? వద్దా?

వాకింగ్ ఆరోగ్యానికి ఎంతో మంచిది. బరువు తగ్గాలనుకునే వారికి వాకింగ్ సులభమైన మార్గం. అయితే, వాకింగ్ ఎప్పుడు చేయాలనే విషయంపై అవగాహన ఉండాలి. కొందరు ఉదయాన్నే వాకింగ్ చేస్తే. మరి కొందరు సాయంత్రం వాకింగ్ చేస్తారు. అయితే సాధారణంగా తిన్న తర్వాత వాకింగ్ చేయాలా వద్దా అనే అంశంపై వివిధ అభిప్రాయాలు వినే విని ఉంటారు. అయితే కొందరు భోజనం తర్వాత వాకింగ్ చేస్తే మంచిదని భావిస్తారు. మరికొందరు భోజనం తర్వాత వాకింగ్ చేయడం మంచిది కాదని నమ్ముతారు. ఈ క్రమంలో పలువురు వైద్యులు భోజనం తర్వాత వాకింగ్ చేయాలా వద్దా అని వివరించారు. వైద్యులు చెప్పిన ప్రకారం.. భోజనం తర్వాత దాదాపు 10 నుండి 15 నిమిషాలు పాటు అవసరమని చెప్పారు. భోజనం తర్వాత వాకింగ్ చేస్తే జీర్ణ వ్యవస్థ సరిగ్గా పనిచేస్తుంది. అంతేకాకుండా షుగర్ మెటబాలిజంలో ఎంతో సహాయపడుతుంది. తిన్న తర్వాత వాకింగ్ చేస్తే షుగర్ లెవెల్స్ పెరిగే అవకాశం తగ్గుతుంది. అయితే భోజనం తర్వాత వాకింగ్ సరైన రీతిలో చేయాలి. వాకింగ్ భోజనం చేసిన తర్వాత తేలికగా, ఇంట్లో చేసే విధంగా ఉండాలి.

# ఏడువేల అడుగులేస్తే..



ఆనందంగా జీవించాలంటే ఆరోగ్యంగా ఉండాలి. ఆరోగ్యంగా జీవించాలంటే? రోజూ నడవాలని చెబుతున్నారు నిపుణులు. నడకతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని తెలిసిందే. కానీ, ఒళ్లు రోగాలపుట్టగా మారిన తర్వాత ఎంత నడిస్తే ఏం ప్రయోజనం! అందుకే, ఆరోగ్యంగా ఉన్నప్పుడే నడకను జీవితంలో భాగం చేయాలని చెబుతున్నారు వైద్యులు. ప్రతి రోజూ ఏడువేల అడుగుల చొప్పున నడిస్తే.. ఆరోగ్యం మీ వెన్నంటి ఉంటుందని అంటున్నారు. నిత్యం ఏడువేల అడుగులు వేస్తూ, సరైన ఆహారం తీసుకుంటూ, సరిపడా విశ్రాంతి తీసుకుంటూ ఉంటే రెండు నెలల్లో శరీరం దృఢంగా తయారవుతుందట. ఇలా చేయడం వల్ల కార్డియోవాస్కులార్ సమస్యలు రాకుండా ఉంటాయట. బరువు నియంత్రణలో ఉంటుంది. మానసిక ప్రశాంతత పెరుగుతుంది. ఎనర్జీ లెవెల్స్ కూడా పెరుగుతాయని ఫిట్‌నెస్ నిపుణులు చెబుతున్నారు. రోజూ నడవడం వల్ల రక్తంలో గ్లూకోజ్ శాతం తగ్గుతుంది. అలాగే రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. కీళ్లు, కండరాలు బలపడతాయి. మరింత మెరుగైన ప్రయోజనాలు పొందాలంటే ఏడువేల అడుగుల ప్రయాణాన్ని పది వేలకు పెంచుకోవచ్చని సూచిస్తున్నారు. సాధారణంగా అయిదు వేల అడుగుల నడకను శరీరక శ్రమ లేని (సెడంటరీ లైఫ్) జీవనంగానే గుర్తిస్తారు. అంతకంటే ఎక్కువ నడవడం ఆరోగ్యానికి మేలు చేస్తుంది. నడక వల్ల కలిగే అన్ని రకాల ప్రయోజనాలు పొందాలంటే కనీసం ఏడు వేల అడుగులు, ఓపిక చేసుకొని పదివేల అడుగుల దూరం నడవాల్సిందే! ఇంకెందుకు ఆలస్యం ముందడుగు వేయండి!

# మార్కెట్

## కీలక ఖనిజాన్వేషణలో సింగరేణి

హైదరాబాద్ జూన్ 12 (నమస్తేతెలంగాణ): సింగరేణి తాజాగా కీలక ఖనిజాల అన్వేషణ, పరిశోధన రంగాల్లో తొలి అడుగు వేసింది. ఈ దిశగా సీఎస్ఐఆర్(కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసర్చ్), ఐఎంఎంటీ (ఇనిస్టిట్యూట్ ఆఫ్ మినరల్స్ అండ్ మెటీరియల్స్ టెక్నాలజీ)తో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నది. గురువారం ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో నీతి ఆయోగ్ సభ్యుడు, డీఆర్డీవో రిటైర్డ్ డైరెక్టర్ జనరల్ వీకే సారస్వత్ సమక్షంలో సింగరేణి జీఎం (ఎక్సోరేషన్) బీ శ్రీనివాస్, జీఎం(బీడీ అండ్‌ఎస్పీ) రామదాసు, సీఎస్ఐఆర్, ఐఎంఎంటీ చీఫ్ సైంటిస్ట్.. హైడ్రో మెటలర్జీ డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ కాళీ సంజయ్ అగ్రిమెంట్‌పై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా సింగరేణి చైర్మన్ బలరాం మాట్లాడుతూ%ౌ% వ్యాపార విస్తరణలో భాగంగా ప్రభుత్వాల సూచనల మేరకు కీలక ఖనిజాల అన్వేషణలోకి అడుగు పెట్టామన్నారు. ఈ రంగంలో సీఎస్ఐఆర్-ఐఎంఎంటీలు సాంకేతిక సహకారం అందిస్తాయని వెల్లడించారు. సింగరేణి ఓపెన్ కాస్టుల్లో రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధారణ అయిందని తెలిపారు. అలాగే ఎన్టీపీసీ నుంచి విద్యుత్ ఉత్పత్తి సమయంలో విడుదలయ్యే ఫ్లైయాష్‌లోనూ ఈ మూలకాలను కనుగొన్నారన్నారు. మణుగూరు సమీపంలోని దుర్గంగుట్ట బ్లాక్‌లో సగటున 266.21 పీపీఎం స్థాయిలో రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ ఉన్నట్లు జీఎస్ఐ నిర్ధారించిందని, మొత్తంగా సింగరేణి గనుల్లో లాంథనం, సీరియం లాంటి ఆరు రకాల రేర్ ఎర్త్ ఎలిమెంట్స్, ఇట్రిడియం, స్కాండియం, డిస్ప్రోజియం లాంటి హెవీ రేర్ ఎర్త్ మూలకాల ఉనికిని గుర్తించామన్నారు.

## కుప్పకూలిన విమాన షేర్లు..

# ఎయిర్ ఇండియా ప్రమాదంతో నష్టాలు






స్టాక్ మార్కెట్లలో అమ్మకాల ఒత్తిడి

భారీగా పడిపోయిన ఇండిగో షేర్ విలువ

బోయింగ్ షేర్లూ ఢమాల్

ముంబై, జూన్ 12: గుజరాత్‌లో జరిగిన ఎయిర్ ఇండియా ఘోర విమాన ప్రమాదం.. దేశీయ స్టాక్ మార్కెట్లనూ ప్రభావితం చేసింది. అహ్మదాబాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి గురువారం మధ్యాహ్నం లండన్‌కు బయలుదేరిన ఫ్లైట్.. టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కుప్పకూలింది. ఈ నేపథ్యంలో అటు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ), ఇటు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ)ల్లో నమోదైన ఆయా విమానయాన రంగ కంపెనీల షేర్లు పెద్ద ఎత్తునే అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. మదుపరులు భారీగా పెట్టుబడుల ఉపసంహరణకు దిగారు. ఇండిగోకు గట్టి దెబ్బ దేశీయ విమానయాన రంగ దిగ్గజ సంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ లిమిటెడ్ (ఇండిగో) షేర్ల విలువ భారీగా క్షీణించింది. ఈ ఒక్కరోజే ఎన్ఎస్ఈలో ఇండిగో స్టాక్ ధర రూ.187 పతనమైంది. ఇది కంపెనీ షేర్ విలువలో 3.3 2 శాతానికి సమానం. చివరకు రూ.5,444 వద్ద స్థిరపడింది. ప్రమాద ఘటనతో విమాన ప్రయాణ రక్షణపై ఏర్పడిన భయాలు ఎయిర్‌లైన్ స్టాక్స్‌ను ఒక్కసారిగా సెల్లింగ్ ప్రెషర్‌లోకి నెట్టాయని మార్కెట్ నిపుణులు ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నారు. అనుబంధ రంగాల్లోనూ.. విమానయాన అనుబంధ రంగాల కంపెనీల షేర్లూ నష్టాలకు గురయ్యాయి. యునిమెక్ ఏరోస్పేస్, హిందుస్థాన్ ఏరోనాటిక్స్, భారత్ డైనమిక్స్, తనేజా ఏరోస్పేస్, టాల్ ఎంటర్‌ప్రైజెస్, ఎం టార్ టెక్నాలజీస్, ఆజాద్ ఇంజినీరింగ్ తదితర కం పెనీల షేర్ల విలువ 4.20 శాతం-1.34 శాతం వరకు పడిపోయింది. బోయింగ్ షేర్లు.. ప్రమాదానికి లోనైన ఎయిర్ ఇండియా విమా నం.. బోయింగ్ సంస్థది కావడంతో సహజంగానే ఆ కంపెనీ షేర్లు నష్టాల్లోకి జారుకున్నాయి. గురువారం అమెరికా స్టాక్ మార్కెట్ల ట్రేడింగ్‌లో ఒకానొక దశలో 8 శాతం వరకు పడిపోయాయి. ఆ తర్వాత కోలుకున్నా.. 5 శాతం నష్టాల్లోనే కదలాడుతున్నాయి. ఈ ప్రమాదంతో బోయింగ్ విమానాల అమ్మకాలు ప్రభావితం కావచ్చని, ప్రపంచ దేశాల నుంచి ఆర్డర్లు తగ్గిపోవచ్చన్న అంచనాలు ఈ అమెరికా కంపెనీ ఇన్వెస్టర్లను భయపెడుతున్నాయి.

సెన్సెక్స్ 823 పాయింట్లు డౌన్

దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం భారీ నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 823.16 పాయింట్లు దిగజారి 81,691.98 వద్ద ముగిసింది. ఇక ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ సైతం 253.20 పాయింట్లు లేదా 1.01 శాతం కోల్పోయి 24, 888.20 వద్ద స్థిరపడింది. దీంతో వరుస లాభాలకు బ్రేక్ పడ్డట్టైంది. అంతర్జాతీయ స్టాక్ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు, మిడిల్‌ఈస్ట్ దేశాల్లో ఉద్రిక్తతల నడుమ ఉదయం ఆరంభం నుంచే సూచీలు నష్టాల్లో నడిచాయి.

ఒక్కరోజే రూ.5.98 లక్షల కోట్లు ఔట్

స్టాక్ మార్కెట్ నష్టాలతో ఈ ఒక్కరోజే మదుపరుల సంపద లక్షల కోట్ల రూపాయల్లో ఆవిరైపోయింది. బీఎస్ఈ నమోదిత కంపెనీల షేర్ల విలువ రూ.5,98,759.27 కోట్లు హరించుకుపోయింది. దీంతో మదుపరుల సంపద రూ.4,49,58,383.92 కోట్లకు పరిమితమైంది. అంతర్జాతీయ మార్కెట్లు, వీక్లీ ఎఫ్అండ్‌వో గడువు ముగియడం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసినట్టు చెప్తున్నారు.

# అర్ అండ్ ఆర్ ప్యాకేజీ అమలు చేయండి

## భూములు ఇచ్చిన రైతులకు పరిహారం చెల్లించాల్సిందే

## ఇళ్లు, భూమలు కోల్పోయిన వారికి పరిహారం ఇవ్వండి

## ఆ తరవాతే స్టీ ప్లాంట్‌కు శంకుస్థాపన చేయాలి

## సిఎం చంద్రబాబుకు సిపిఎం కార్యదర్శి లేఖ



అమరావతి,మార్చి12 ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అమలు చేయకుండా అర్సెల్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్‌కి భూమి పూజ నిర్వహించవద్దని కోరుతూ సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాససరావు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి లేఖ రాశారు. వైజాగ్ – చెన్నై ఇండిస్టియల్ కారిడార్ పరిధిలో భూసేకరణలో నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పూర్తి పరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. లేఖలోని వివరాలు ఈ విధంగా ఉన్నాయి. మార్చి 23న ఆర్సెల్ మిట్టల్ – నిప్పన్ స్టీలు ప్లాంటుకు భూమిపూజ జరపనున్నట్లుగా మీరు ప్రకటించారు. కాని ఆ ప్రాంతంలో భూ నిర్వాసితుల సమస్యలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని మీ దృష్టికి తెస్తున్నాము. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలంలో రాజయ్యపేట, బుచ్చిరాజుపేట, చందనాడ, అమలాపురం, డి.ఎల్.పురం ఐదు పంచాయతీల పరిధిలో 11 గ్రామాల నుండి 5,500 ఎకరాల భూమి రైతుల నుండి బలవంతంగా ప్రభుత్వం సేకరించింది. ఈ సందర్భంగా నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ఇవ్వాల్సిన పరిహారం మరియు ఆర్అండ్ఆర్ ప్యాకేజీలు ఇప్పటివరకు పూర్తిగా అమలు చేయలేదు. అందులో 2,100 ఎకరాల భూమినే స్టీల్ ప్లాంటుకోసం అర్సెల్‌మిట్టల్‌కు ఇచ్చారు. కానీ న్యాయం జరగని రైతుల, కూలీల, వృత్తిదారుల సమస్యలు మీ దృష్టికి వచ్చినట్లుగా లేవు. సర్వం కోల్పోయిన నిర్వాసితులకు ఇల్లు నిర్మించుకోవడానికి సమయం ఇవ్వకుండా, ఎలాంటి సౌకర్యాలు కల్పించకుండా ఆగమేఘాలమీద ఇళ్ళు నేలమట్టం చేసి నిర్వాసితులను నడిరోడ్డుపై నెట్టివేయడం సరైందేనా? మానవతా దృక్పథంతో ఆలోచించమని కోరుతున్నాము. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా ముందుగా భూములు కోల్పోయిన నిర్వాసితుల సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలని కోరుతున్నాము' అని లేఖలో పేర్కొన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రైతులు, నిర్వాసితులకు పూర్తిస్థాయి ప్యాకేజీ, పునరావాసం కల్పించాలని, ఆర్.కార్డులు ఇవ్వాలని, జిరాయితీ భూములతో సమానంగా డి–ఫారం సాగు భూములకు కూడా పూర్తిస్థాయి పరిహారం చెల్లించాలని కోరారు. డి–ఫారం భూముల్లో ఉన్న చెట్లకు చట్టం ప్రకారం నష్టపరిహారం వెంటనే చెల్లించాలని, వివాహమైన ఆడపిల్లలకు భూసేకరణ సందర్భంలో ఇచ్చిన హామీ ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని కోరారు. నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ప్రకారం ఇళ్లు మరియు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, 18సంవత్సరాలు నిండిన ప్రతి యువతీ, యువకుడికి చట్టప్రకారం ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులు, కూలీలు, మత్స్య, కల్లుగీత కార్మికులు, గొర్రెలు–మేకల పెంపకదారులు, చేతి వృత్తిదారులు వంటి జీవనాధారం కోల్పోయిన వర్గాలను భూసేకరణ చట్టం ప్రకారం రూ.15 లక్షల ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. ఇళ్లు కోల్పోయి నిర్వాసితులైన ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల ప్యాకేజీ ఇవ్వాలని, నిర్వాసితుల కాలనీలో 25 రకాల మౌలిక సదుపాయాలు పూర్తిగా కల్పించే వరకు బలవంతంగా ఖాళీ చేయించకూడదని డిమాండ్ చేశారు. చట్టప్రకారం నిర్వాసిత కాలనీలో కల్పించాల్సిన మౌలిక సదుపాయాలను వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. భూములు కోల్పోయిన నిర్వాసిత గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకుండా, నిర్వాసితుల హక్కులను అమలు చేయకుండా అర్సెల్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్‌కు భూమి పూజ నిర్వహించడం అన్యాయం మరియు చట్టవిరుద్ధమని పేర్కొన్నారు.

# క్యాప్ జెమినీ సీఈవో ఐమాన్ ఎజత్‌తో లోకేశ్ భేటీ

## విశాఖలో సంస్థ ఏర్పాటుపై చర్చలు

## విశాఖ టిడిపి ఆఫీస్‌లో లోకేశ్ ప్రజాదర్బార్

విశాఖపట్నం,మార్చి12 : క్యాప్ జెమినీ గ్లోబల్ సీఈవో ఐమాన్ ఎజత్‌తో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. విశాఖలో క్యాప్ జెమినీ సంస్థ ఏర్పాటుపై చర్చించారు. ఇప్పటికే మధురవాడ ఐటీ పార్కుల్ హిల్–1పై 20 ఎకరాల భూమిని ఈ సంస్థ కోసం పరిశీలించారు. అడివివరం, ఆనందపురం పరిధిలో రెండు చోట్ల సంస్థ ప్రతినిధులు భూములను పరిశీలించారు. తాత్కాలిక కార్యకలాపాలకు సెంట్రల్ పార్కు సమీపంలో ఓ ప్రైవేటు భవనాన్ని ఎంపిక చేశారు. అలాగే విశాఖ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. ఐటి సంస్థలకు అన్ని రకాలుగా అండగా ఉంటున్నామని అన్నారు. ఇకపోతే మంత్రి నారా లోకేశ్ విశాఖపట్నం జిల్లాలో గురువారం పర్యటించారు. విపలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశాఖపట్నం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో 83వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. తనను కలిసేందుకు పార్టీ కార్యాలయానికి వచ్చిన ప్రజలు, పార్టీ కార్యకర్తలు, నాయకులను మంత్రి ఆప్యాయంగా పలకరించారు. వివిధ సమస్యలతో బాధపడుతున్న ప్రజలు, పార్టీ కార్యకర్తల నుంచి వినతులు స్వీకరించారు. లోకేశ్ దృష్టికి ప్రజలు పలు సమస్యలను తీసుకువచ్చారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు అన్నివిధాలా అండగా ఉంటామని మంత్రి నారా లోకేశ్ భరోసా ఇచ్చారు.

# ఎపి జెన్కో రికార్డు విద్యుత్ ఉత్పత్తి

## మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడి

## అధికారుల కృషిని అభినందించిన మంత్రి

అమరావతి,మార్చి12 : విద్యుత్ ఉత్పత్తిలో ఏపీ జెన్కో జీవితకాల రికార్డు సృష్టించిందని ఆంధ్రప్రదేశ్ విద్యుత్, ఇంధన శాఖల మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. 6101 మెగావాట్లతో జీవితకాల రికార్డు స్థాయిలో ఏపీ జెన్కో ఉత్పత్తి సాధించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రికార్డు స్థాయి విద్యుత్ ఉత్పత్తిపై మంత్రి హర్షం వ్యక్తం చేశారు. ఏపీ సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ అధికారుల నిరంతర కృషి వల్లనే ఇది సాధ్యమయ్యిందన్నారు. సీఎం చంద్రబాబు సలహాలు, సూచనలతోనే ఈ రికార్డు సాధ్యమైందని ఉద్ఘాటించారు. ఇంజినీర్లు, అధికారుల అంకితభావం, నైపుణ్యం, కృషితోనే ఈ రికార్డు నమోదైందని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. వేసవి విద్యుత్ డిమాండ్ అందుకునేందుకు అధిక స్థాయిలో విద్యుత్ ఉత్పత్తిని కొనసాగించడం కీలకమని చెప్పుకొచ్చారు. గృహ, పారిశ్రామిక, వ్యాపార సంస్థలకు నిరంతరాయ విద్యుత్ సరఫరాయే తమ ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. భవిష్యత్తు విద్యుత్ డిమాండ్‌ను అందుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. ప్రైవేటు వ్యక్తుల నుంచి విద్యుత్ కొనుగోలు చేసేందుకు వైసీపీ హయాంలో ఏపీ జెన్కోని నిర్వీర్యం చేశారని ధ్వజమెత్తారు. జగన్ హయాంలో అడ్డగోలుగా తొమ్మిది సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై రూ.32 వేల కోట్లు భారం వేశారని ఆగ్రహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ చరిత్రలోనే ఎప్పుడూ లేని విధంగా ట్రూ డౌన్ చేసిందని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పేర్కొన్నారు.

# 16నుంచి ఒంటిపూట బడులు

## ఉత్తర్వులు జారీచేసిన విద్యాశాఖ

హైదరాబాద్,మార్చి12 : తెలంగాణ రాష్ట్రంలో ఎండల తీవ్రత దృష్ట్యా పాఠశాల విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు మార్చి 16 నుంచి ఏప్రిల్ 23 వరకు ఒంటిపూట బడులు నిర్వహించనున్నట్లు అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతిరోజూ ఉదయం 8:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు తరగతులు జరుగుతాయి. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నం 12:30 గంటలకు భోజనం వడ్డించిన తర్వాత విద్యార్థులను ఇంటికి పంపిస్తారు. టెన్త్ ఎగ్జామ్స్ జరిగే స్కూళ్లలో షెడ్యూల్ మారుతుంది. అక్కడ మధ్యాహ్నం 1:00 గంట నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు ఒంటిపూట బడులు నిర్వహిస్తారు. పదో తరగతి విద్యార్థులకు పరీక్షల దృష్ట్యా యధావిధిగా ప్రత్యేక తరగతులు కొనసాగుతాయి. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం.. ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు విద్యార్థులకు వేసవి సెలవులు ఉండనున్నాయి. తిరిగి 2026–27 విద్యా సంవత్సరం జూన్ 12 నుంచి ప్రారంభం కానుంది. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యాశాఖ ఈ నిర్ణయం తీసుకుంది.

# పశువులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు

నిజామాబాద్,మార్చి12 : పశువులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు చేయిస్తే మూగ జీవాలకు వ్యాధులు దరి చేరవని కోటగిరి మండల పశు వైద్యాధికారి డాక్టర్ సురేష్ కుమార్ అన్నారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాలలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేస్తున్నామని ఆయన తెలిపారు. కోటగిరి మండలంలోని వలాభపూర్ గ్రామంలోని పశువులకు గురువారం ఉచితంగా గాలికుంటు నివారణ టీకాలు చేశామన్నారు. ఈ శిబిరాన్ని స్థానిక సర్పంచ్ రొ÷–టటె పుష్పవతి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పుష్పవతి మాట్లాడుతూ గ్రామాల్లో పశువులకు డాక్టర్లు చేసే గాలి కుంటు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా చేయించాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. పాడి పశువులతో రైతులకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సాయిలు, విఠల్ పటేల్, పశు వైద్య సహాయకులు సుధీర్, సిబ్బంది భూమేష్, రైతులు పాల్గొన్నారు.

# ఉద్యోగం వచ్చేవరకు భార్యకు చేదోడువాదోడు

## ఎక్సైజ్ సిఐగా ఎన్నికయ్యాక భర్తకు వేధింపులు

## భార్య వేధింపులు తట్టుకోలేక వ్యక్తి ఆత్మహత్య

## నేరెడ్ మెట్ పరిధిలో ఘటన..పోలీసులు దర్యాప్తు

హైదరాబాద్,మార్చి12 : భార్య వేధింపులు తాళలేక భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన కలకలం సృష్టించింది. నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీనగర్‌కు చెందిన నగెల్లి శ్రీనివాస్(41) ఓ ప్రైవేట్ ఉద్యోగి. అతని స్వగ్రామం మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం రామకృష్ణాపూర్. శ్రీనివాస్ 2012లో జ్యోతిని పెళ్లి చేసుకున్నాడు. ఈ దంపతులకు ఓ కుమారుడు ఉన్నాడు. భార్య గ్రూప్స్ పరీక్షలకు ప్రీపేర్ అయ్యేందుకు భర్త శ్రీనివాస్ చాలా హెల్ప్ చేశాడు. భర్త సహాయంతో జ్యోతి గ్రూప్స్‌లో విజయం సాధించి ఎక్సైజ్ సీఐగా నియమితులయ్యింది. ఉద్యోగం వచ్చిన తర్వాత భర్తను దూరం పెట్టడం స్టార్ట్ చేసింది. అంతే కాదు.. భర్తపై వరకట్నం వేధింపులు, విడాకుల కేసులు పెట్టింది. వేధింపులకు పాల్పడటంతో శ్రీనివాస్ తట్టుకోలేక పోయాడు. తీవ్ర మనస్తాపానికి గురై మంగళవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. 'భార్య వేధింపులు, కేసుల కారణంగా ఆత్మహత్య చేసుకుంటున్నాను' అని సూసైడ్ నోట్ రాశాడు. శ్రీనివాస్ సోదరుడు శివకృష్ణ ఇంటికి వచ్చి చూడగా అతను మృతిచెందినట్లు గుర్తించాడు. అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. సోదరుడి ఫిర్యాదు మేరకు శ్రీనివాస్ భార్య జ్యోతి సహా మరో 10 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# ఇంధన భద్రతపై ఇరాన్‌తో చర్చిస్తున్నాం

## ఇప్పటికే ఇరాన్‌తో మంత్రి జైశంకర్ చర్చలు

## విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్

న్యూఢిల్లీ,మార్చి12 : ఇంధన భద్రతపై ఇరాన్‌తో చర్చిస్తున్నాం విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ అన్నారు. దేశ ఇంధన భద్రతపై ఇరాన్‌తో విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ మాట్లాడారని రణధీర్ జైస్వాల్ వెల్లడించారు. హర్మూజ్ మీదుగా భారత్‌కు వచ్చే నౌకల ప్రయాణం గురించి కూడా చర్చించినట్లు తెలిపారు. మరోవైపు, డీజిల్ సరఫరా కోసం బంగ్లాదేశ్ ప్రభుత్వం విజ్ఞప్తి చేసిందని, దానిని పరిశీలిస్తున్నట్లు చెప్పారు. శ్రీలంక, మాల్దీవుల నుంచీ ఇదే తరహా అభ్యర్థనలు వచ్చాయని, అయితే.. ముందుగా మన దేశ అవసరాలను కేంద్రం పరిగణనలోకి తీసుకుంటుందన్నారు. ప్రస్తుతం ఇరాన్‌లో దాదాపు తొమ్మిది వేల మంది భారతీయులు ఉన్నారని.. వీరిలో విద్యార్థులు, నౌకా సిబ్బంది, వ్యాపారవేత్తలు, యాత్రికులు ఉన్నట్లు విదేశాంగశాఖ అధికార ప్రతినిధి వెల్లడించారు. ఘర్షణ మొదలైన వెంటనే విద్యార్థులు సహా అనేక మంది భారతీయులను సురక్షిత ప్రాంతాలకు తరలించామన్నారు. స్వదేశానికి తిరిగి రావాలనుకునే భారతీయులందరికీ సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. మన రాయబార కార్యాలయం అన్ని సమయాల్లో అందుబాటులో ఉందన్నారు. అఫ్గాన్‌తో ఇటీవల ఘర్షణకు భారత్ కారణమంటూ పాకిస్థాన్ చేసిన ఆరోపణలను భారత విదేశాంగశాఖ ఖండించింది. అవి నిరాధార ఆరోపణలని స్పష్టం చేసింది. తన తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకు భారత్‌పై నిందలు వేయడం పాకిస్థాన్‌కు పరిపాటేనని విమర్శించింది. దశాబ్దాలుగా సీమాంతర ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న దాయాది దేశం మాటలకు విశ్వసనీయత లేదని తెలిపింది.

# ఇంధన కొరత, ధరలపై కేంద్రం అప్రమత్తం

## ఫ్యూయల్ సప్లై మేనేజ్‌మెంట్ చైన్ ప్రోగ్రామ్ అమలు

న్యూఢిల్లీ,మార్చి12 : మధ్యప్రాచ్యంలో యుద్ధం ఎఫెక్ట్ ప్రపంచమంతా కనిపిస్తోంది. భారత్‌పై మిడిల్ ఈస్ట్ యుద్ధ ప్రభావం పడింది. ఇప్పటికే భారత్‌లోని ప్రధాన నగరాల్లో ఎల్‌పీజీ సంక్షోభం పెరిగిపోయింది. ఇక పెట్రోల్, డీజిల్ ధరలపై సామాన్యులు భయపడుతున్నారు. ఈ ధరలు రానున్న కొన్ని రోజుల్లో విపరీతంగా పెరుగుతాయనే పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం తాజాగా స్పందించింది. పెట్రోల్, డీజిల్ ధరలపై క్లారిటీ ఇచ్చింది. ఈ ధరపై ప్రస్తుతం ప్రభావం ఉండబోదని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. దేశీయంగా చమురు ధరలను స్థిరంగా ఉంచేందుకు ఇప్పటికే ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకున్నట్లు చెబుతున్నారు. ఇధనం ఇంధన సరఫరాలోనూ ఎలాంటి ఆటంకాలు కలగకుండా 'ఫ్యూయల్ సప్లై మేనేజ్‌మెంట్ చైన్' ప్రోగ్రామ్‌ను ప్రభుత్వం ఇప్పటికే యాక్టివేట్ చేసినట్లు ఓ జాతీయ మీడియా సంస్థ కథనం వెల్లడించింది. ప్రపంచ చమురు రవాణాలో కీలకమైన 'స్ట్రెట్ ఆఫ్ హార్ముజ్' మార్గంలో ఉద్రిక్తతలు చోటుచేసుకున్న నేపథ్యంలో భారత్ అప్రమత్తమైంది. వాస్తవానికి గతంలో 'స్ట్రెట్ ఆఫ్ హార్ముజ్' మార్గం గుండా భారత్ 40శాతం చమురును దిగుమితి చేసుకునేది. ఈ మిడిల్ ఈస్ట్ దేశాలపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు భారత్ వ్యూహాన్ని రూపొందించింది. హార్ముజ్ మార్గం కాకుండా ఇతర ప్రాంతాల నుంచి చమురు దిగుమతులను 60 శాతం నుంచి 70 శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం దాదాపు 40 దేశాల నుంచి భారత్ చమురును సేకరిస్తోంది. ఈ కొత్త మార్గం ద్వారా చమురు దిగుమతి చేసుకోవడంతో ప్రస్తుతం పెట్రోల్, డీజిల్ సంక్షోభం లేదని తెలుస్తోంది. కానీ.. భవిష్యత్తులో యుద్ధం ఇంకా ముదిరితే మాత్రం భారత్‌పై ఎఫెక్ట్ పెద్ద ఎత్తున ఉండబోతోందనే వాదనలూ వినిపిస్తున్నాయి. ఇక ఎల్పీజీ (ఒఖఉ) విషయంలో కేంద్రం జాగ్రత్తగా వ్యవహరిస్తోంది. ఇప్పటికే బ్లాక్ మార్కెట్‌ను అరికట్టేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. ఇటీవల జరిగిన గ్యాస్ ధరలు చాలా స్వల్పమని, ఇక మీద భారీ ధరల పెంపు ఏమీ ఉండబోదని ప్రభుత్వం వెల్లడించింది. దేశవ్యాప్తంగా ఎక్కడా గ్యాస్ కొరత లేదని, ప్రజల అవసరాలకు సరిపడా నిల్వలు అందుబాటులో ఉన్నాయని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

# హైకోర్టు ఆదేశాలను అమలు చేయండి

## పారిశుద్ధ్య కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలి

## కలెక్టరేట్ ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో నిరసన

కర్నూలు,మార్చి12 : మెడికల్ అండ్ హెల్త్ శాఖలో హైకోర్టు ఆదేశాలను తక్షణం అమలు చేసి అక్రమంగా తొలగించిన పారిశుద్ధ్య కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు డిమాండ్ చేశారు. పద్మావతి ఫెర్టిలిటీ ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలన్నారు. గురువారం సిఐటియు కర్నూలు నగర కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. నగర అధ్యక్షుడు అబ్దుల్ దేశాయ్ అధ్యక్షతన నిరసన చేపట్టారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు, నగర ప్రధాన కార్యదర్శి విజయ రామాంజనేయులు, కెవిపిఎస్ నగర అధ్యక్షుడు రమణ మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మెడికల్ కళాశాలలో హాస్టల్లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులను ఇష్టానుసారంగా తొలగిస్తున్నారన్నారు. మహిళ కార్మికులను 50 సంవత్సరాలు పైబడిన నేపథ్యంతో తొలగించడం దుర్మార్గమన్నారు. అనంతపురం, కడప , తిరుపతి, నంద్యాల ఆస్పత్రిలో పనిచేసేటువంటి పారిశుద్ధ్య కార్మికులను తొలగించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 62 సంవత్సరాలకు ఉద్యోగ విరమణ వయసు ఉందన్నారు. పారిశుధ్య కార్మికులను మాత్రం 50 సంవత్సరాల పేరుతో తొలగించడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. రాష్ట్రంలోని ఇతర జోన్లలో ఈ సమస్య లేకపోయినా రాయలసీమ జోన్‌లో మాత్రమే ఉండటం అనుమానాలకు తావిస్తున్నదన్నారు. కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని హైకోర్టు ఆదేశించినప్పటికీ అధికారులు వాటిని అమలు చేయకపోవడం తగదన్నారు. కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

# గిరిజనులకు అభివృద్ధి అందకుండ చేస్తారా?

## అక్కడి పనులను అడ్డుకోవడమేమిటి

## అటవీ అధికారుల తీరుపై మండిపడ్డ బాబు

అమరావతి,మార్చి12 : ప్రభుత్వం ఆమోదించిన ఇళ్లకు కూడా ఫారెస్ట్ క్లియరెన్స్ ఇవ్వకపోవడమేంటని అటవీ అధికారులను సిఎం చంద్రబాబు ప్రశ్నించారు. గిరిజనులకు నీరు, రహదారి, విద్యుత్ వంటి కనీస సదుపాయాలు కల్పించాల్సిందేనని స్పష్టం చేశారు. కలెక్టర్ల సమావేశంలో ఫారెస్ట్ అధికారులపై చంద్రబాబు నాయుడు సీరియస్ అయ్యారు. అభయారణ్యం పేరుతో అభివృద్ధి పనులు ఆపడం సరైనది కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజన ప్రాంతాల్లో ప్రాథమిక సౌకర్యాలకు కూడా అడ్డంకులు సృష్టించడం తగదని పేర్కొన్నారు. పాపికొండల ప్రాంతంలో ఇళ్ల నిర్మాణం, బోర్‌వెల్స్‌కు అనుమతులు ఇవ్వకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికే ఉన్న రహదారిపై గ్రావెల్ లేదా మెటల్ వేయడానికి అభ్యంతరం చెప్పడమేంటనీ సీఎం చంద్రబాబు ప్రశ్నించారు. అధికారుల వ్యవహార శైలిపై చాలా ఫిర్యాదులు వస్తున్నాయంటూ హెచ్చరించారు. అధికారులు ఇప్పటికైనా మారాలని అన్నారు. సమస్యలు ఉంటే నేరుగా తనకు లేదా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు తెలియజేయాలని సూచించారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా వ్యవహరించవద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఏలూరు కలెక్టర్, డీఎఫ్‌వో కలిసి ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని హుకుం జారీ చేశారు. అభివృద్ధి పనులు ఆగిపోకుండా అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

# గ్యాస్ బుకింగ్ సర్వర్ల డౌన్

## పనిచేయని వాట్సాప్ బుకింగ్స్

## ఆందోళనలలో వినియోగదారులు

అమరావతి,మార్చి12 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్యాస్ సంక్షోభం ముదురుతోంది. ప్యానిక్ బుకింగ్‌తో సర్వర్లు డౌన్ అవుతున్నాయని ఆయిల్ కంపెనీల నిర్వాహకులు చెబుతున్నారు. ఇండేన్ గ్యాస్ ఐవీఆర్ఎస్, వాట్సాప్ లు బుకింగ్ పని చేయడం లేదు. అప్పుడప్పుడు భారత్, హెచ్‌పి గ్యాస్ ఐవీఆర్ఎస్, వాట్సాప్ బుకింగ్‌లు పని చేయట్లేదు. దీనితో గ్యాస్ డీలర్లు వద్దకు వినియోగదారులు పరుగులు తీస్తున్నారు. ఏపీలో కోటి 55 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. బ్యాక్ లాగ్ తగ్గించుకునేందుకు ఆయిల్ కంపెనీలు ఇలా చేస్తున్నాయని వినియోగదారులు తెలిపారు. వినియోగదారుల మొబైల్‌కు ఓటీపీ వస్తేనే డెలివరీ ఇవ్వాలని గ్యాస్ డిస్ట్రిబ్యూటర్‌లపై ఆయా కంపెనీలు ఆంక్షలు విధించాయి. గ్యాస్ దుర్వినియోగం గాకుండా వినియోగదారుల మొబైల్ నుంచి ఓటీపీ తీసుకుంటున్నామని ఆయిల్ కంపెనీల అధికారులు చెబుతున్నారు. రోజు వారి బుకింగ్‌ల కంటే ఒక్కరోజే మూడు రెట్లు అధికంగా బుకింగ్‌లు జరిగాయని ప్రభుత్వ అధికారులు తెలిపారు. గృహ అవసరాలకు ఎలాంటి గ్యాస్ కొరత లేదని ఏపీ ప్రభుత్వం చెబుతోంది. ప్యానిక్ బుకింగ్‌తోనే ఈ సమస్య వస్తోందని ప్రభుత్వం పేర్కొంది. ఈ క్రమంలోనే కమర్షియల్ సిలెండర్‌ల సరఫరాను సగానికి పైగా ఆయిల్ కంపెనీలు తగ్గించాయి. హాస్టల్స్, ఆస్పత్రుల వంటి అత్యవసర సర్వీసులకే ఇవ్వాలని ఆయిల్ కంపెనీలు ఆదేశాలు జారీ చేశాయి. కేంద్రప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాలను తాము అమలు చేస్తున్నామని కంపెనీలు చెబుతున్నాయి.

# కాలుష్య నివారణకు చర్యలు

## జిల్లాకు 350ఎలక్ట్రిక్ బస్సుల కేటాయింపు

తిరుపతి,మార్చి12 : కాలుష్య నివారణ చర్యల్లో భాగంగా జిల్లాకు 350ఎలక్ట్రిక్ బస్సులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించాయి. మంగళం 1, 2 డిపోలుగా విభజించి 50చొప్పున బస్సుల నిర్వహణ బాధ్యతలను వేర్వేరు ప్రైవేట్ సంస్థలకు అప్పగించనున్నారు. తొలివిడతగా నాలుగునెలల్లో 50 ఈకా ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయి. వీటికి పినాకిల్ ఈ–మొబిలిటీ సంస్థ ప్రభుత్వంతో ఎంవోయూ చేసుకుంది. తాజాగా మంగళం డిపోకే మరో 50బస్సులు కేటాయించడంతో ఆ డిపో పూర్తిగా గ్రీన్‌ఫీల్డ్‌గా మారనుంది. దాంతో బస్సుల కొనుగోలు, మౌలికసదుపాయాల ఏర్పాట్లకు నిధుల కేటాయింపుల్లో కేంద్రం 60శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40శాతం భరిస్తాయి. ఈ క్రమంలో మంగళం డిపో నిర్వహణ బాధ్యతల నుంచి ఆర్టీసీ పూర్తిగా విరమించుకున్నట్లే. కాగా మంగళం డిపోలో ఎలక్ట్రిక్ బస్సు రీచార్జింగ్ స్టేషన్ కోసం రూ.7.6కోట్లు కేటాయించినట్లు తెలుస్తోంది. ఎస్పీడీసీఎల్ సంస్థ అండర్‌కేబుల్, ట్రాన్స్‌ఫార్మర్ వంటి పనులను మొదలుపెట్టనుంది. అదే విధంగా ప్రాంగణంలో సివిల్‌వర్కు, చార్జింగ్‌మిషన్‌ల అమరిక వంటి మౌలిక వసతులకు రూ.6.3కోట్లు కేటాయించారు. పనుల టెండర్ ప్రక్రియ ఈ నెల్లోనే పూర్తికానుంది. రెండో విడతలో తిరుమల డిపోకు 100, శ్రీకాళహస్తి డిపోకు 100, పుత్తూరు డిపోకు 50 ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయి. దాంతో తిరుమలకు పూర్తిస్థాయిలో ఈవీ బస్సులే నడవనున్నాయి.

## చిరంజీవిని కలసిన దిల్‌రాజు, ప్రియాంక

### గద్దర్ అవార్డుల ఫంక్షన్‌కు ఆహ్వానం

హైదరాబాద్,మార్చి12 : తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ వేడుకల్లో పాల్గొనాల్సిందిగా మెగాస్టార్ చిరంజీవిని తెలంగాణ చలనచిత్ర అభివృద్ధి సంస్థ చైర్మన్ దిల్ రాజు, మేనేజింగ్ డైరెక్టర్ ప్రియాంక కోరారు. అలాగే గద్దర్ అవార్డును స్వీకరించాల్సిందిగా అభ్యర్థించారు. ప్రభుత్వం ప్రకటించిన ప్రతిష్టాత్మక 'ఎన్టీఆర్ నేషనల్ ఫిలిం అవార్డు' ను స్వీకరించాల్సిందిగా వారు చిరంజీవిని సాదరంగా ఆహ్వానించారు. మార్చి 19, హైదరాబాద్‌లోని హైటెక్స్ వేదికగా జరగనున్న అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి విచ్చేసి, ఈ గౌరవాన్ని అందుకోవాలని వారు కోరారు.



## వృషకర్మ కోసం నాగచైతన్య కసరత్తులు

యువ హీరో నాగ చైతన్య ప్రస్తుతం హీరోగా తెరకెక్కుతున్న ఇంట్రెస్టింగ్ థ్రిల్లర్ చిత్రం వృషకర్మపై ఇప్పటికే మంచి ఆసక్తి నెలకొంది. ఈ సినిమాలో హీరోయిన్‌గా మీనాక్షి చౌదరి నటిస్తుండగా, టాలెంటెడ్ దర్శకుడుకార్తీక్ వర్మ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇటీవల విడుదలైన 'వృష కర్మ' గ్లింప్స్ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని రేకెత్తించింది. థ్రిల్లర్ ఎలిమెంట్స్‌తో కూడిన ఈ సినిమా థియేటర్లలో సాలిడ్ ఎంటర్‌టైన్ మెంట్ అందిస్తుందని మేకర్స్ హామీ ఇచ్చారు. ముఖ్యంగా ఈ సినిమాలో నాగ చైతన్య పూర్తిగా కొత్త లుక్‌లో కనిపించబోతుండటం అభిమానుల్లో ఆసక్తిని మరింత పెంచుతోంది. తాజాగా నాగ చైతన్య సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలు ఇప్పుడు వైరల్‌గా మారాయి. ఆయన జిమ్‌లో తీసుకున్న ఒక ఫోటోను పోస్ట్ చేశాడు. ఆ ఫోటోలో చైతు 6 ప్యాక్ బాడీతో స్టైలిష్‌గా కనిపించడం అభిమానులను ఆశ్చర్యపరిచింది. డంబెల్స్ పట్టుకుని వర్కౌట్ చేస్తున్న ఫోటో ద్వారా ఈ సినిమా కోసం ఎంత కష్టపడుతున్నాడో చూపించాడు. ఇటీవల వచ్చిన తండేల్ సినిమాలో నాగ చైతన్య డీ-గ్లామరస్ లుక్‌లో కనిపించిన సంగతి తెలిసిందే. అయితే 'వృష కర్మ' కోసం మాత్రం పూర్తిగా స్టైలిష్ మరియు ఫిట్ లుక్‌లోకి మారడం విశేషంగా మారింది. నాగ చైతన్య ఈ ఫోటోలను షేర్ చేసిన కొద్ది నిమిషాల్లోనే సోషల్ మీడియాలో ట్రెండ్ అయ్యాయి. హీరో సుశాంత్ వంటి సెలబ్రిటీలు కూడా ఈ పోస్ట్‌పై స్పందించగా, వేలాది మంది అభిమానులు ÷ర్ ఎమోజీలు, లైక్స్‌తో కామెంట్స్ సెక్షన్‌ను హోరెత్తించారు. ఇదిలా ఉండగా నాగ చైతన్య సెట్స్‌కి సంబంధించిన మరికొన్ని ఫోటోలు కూడా షేర్ చేశారు. షూటింగ్ లొకేషన్స్‌లో తీసిన ఈ చిత్రాలు కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దీంతో 'వృష కర్మ' సినిమాపై అభిమానుల్లో మరింత ఆసక్తి పెరిగింది.



## స్పీడ్‌గా ఎన్టీఆర్ డ్రాగన్ షూటింగ్

ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ యాక్షన్ ఎంటర్ టైనర్ 'డ్రాగన్'. ఇటీవల జోర్డాన్‌లో కీలకమైన షెడ్యూల్‌ను పూర్తి చేసుకున్న చిత్ర యూనిట్, ఇప్పుడు తదుపరి యాక్షన్ వేట కోసం సిద్ధమైంది. ప్రశాంత్ నీల్. ఇక ఇప్పుడు నెక్ట్స్ షెడ్యూల్‌లో కూడా భారీ యాక్షన్ ఉండబోతుందని తెలుస్తోంది. కొత్త షెడ్యూల్ ఈ వారంలోనే హైదరాబాద్‌లో ప్రారంభం కానుందని సమాచారం. ఇందుకోసం నగర శివార్లలోని ఒక ప్రముఖ స్టూడియోలో మూడు భారీ సెట్లను నిర్మించారట. ఇందులో విలన్ ఇంటికి సంబంధించిన సెట్ కూడా ఉందట. దాదాపు నెల రోజులకు పైగా సాగే ఈ లాంగ్ షెడ్యూల్‌లో.. సినిమాలోని కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారట. ఇక ఇక్కడ షూటింగ్ పూర్తయిన వెంటనే, చిత్ర యూనిట్ తదుపరి షెడ్యూల్ కోసం శ్రీలంక వెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అక్కడ కూడా యాక్షనే ఉంటుందని టాక్. మొత్తంగా చూసుకుంటే.. డ్రాగన్ యాక్షన్ షెడ్యూల్సే ఎక్కువగా ఉన్నాయి. ఈ లెక్కన ప్రశాంత్ నీల్ ఏ రేంజ్ యాక్షన్ డోస్ ఇవ్వబోతున్నాడో అర్థం చేసుకోవచ్చు. ఈ సినిమాలో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తుండగా, బాలీవుడ్ స్టార్ అనిల్ కపూర్ మరియు మలయాళ నటుడు టోవినో థామస్ కీలక పాత్రల్లో కనిపించ బోతున్నారు. 'కె.జి.ఎఫ్', 'సలార్' వంటి బ్లాక్ బస్టర్స్ తర్వాత ప్రశాంత్ నీల్ నుంచి వస్తున్న చిత్రం కావడంతో.. డ్రాగన్ పై అంచనాలు పీక్స్‌లో ఉన్నాయి.




## ధురందర్-2 నుంచి ఆరి ఆరి పాట విడుదల

బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్, సెన్సేషనల్ డైరెక్టర్ ఆదిత్య ధర్ కలయికలో తెరకెక్కిన భారీ స్పై యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్: ది రివెంజ్' బాక్సాఫీస్ వద్ద ప్రకంపనలు సృష్టించేందుకు సిద్ధమవుతోంది. ఈ క్రేజీ సీక్వెల్‌కు సంబంధించి అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న 'ఆరి ఆరి' సాంగ్‌ను చిత్రబృందంగురువారం విడుదల చేసింది. 2003 నాటి పాపులర్ బాంబే రాకర్స్ ÷ాటను శాశ్వత్ సచ్‌దేవ్ ఆధునిక బీట్స్‌తో రీమిక్స్ చేయగా, రణ్‌వీర్ సింగ్ పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఈ పాట విజువల్స్ అదరగొడుతున్నాయి. ఇప్పటికే విడుదలైన ట్రైలర్ 310 మిలియన్లకు పైగా వ్యూస్‌తో రికార్డులు సృష్టించగా, తాజాగా విడుదలైన ఈ సాంగ్ సినిమాపై అంచనాలను మరింత రెట్టింపు చేసింది. దాదాపు రూ.400 కోట్ల భారీ బ్జడెట్‌తో రూపొందిన ఈ చిత్రంలో రణ్‌వీర్ సింగ్ జస్కిరాత్ సింగ్ రంగీ మరియు హమ్జా అనే రెండు విభిన్న పాత్రల్లో ద్విపాత్రాభినయం చేయబోతున్నాడు. అర్జున్ రాంపాల్, సంజయ్ దత్, ఆర్ మాధవన్ వంటి అగ్ర నటులు కీలక పాత్రల్లో కనిపిస్తున్న ఈ చిత్రం భారత గూఢచారి వ్యవస్థ చుట్టూ సాగే హై-వోల్టేజ్ డ్రామాగా రూపొందింది. ప్రపంచవ్యాప్తంగా ఉగాది, ఈద్ పండుగల సందర్భంగా మార్చి 19, 2026న హిందీతో పాటు తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో ఈ సినిమా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఇక మార్చి 18 సాయంత్రం నుంచే భారీ ఎత్తున పెయిడ్ ప్రివ్యూలు ప్రదర్శించనుండగా, అడ్వాన్స్ బుకింగ్స్‌లో ఇప్పటికే ఈ చిత్రం 'స్త్రీ 2' రికార్డులను అధిగమించి ఆల్-టైమ్ రికార్డ్ దిశగా దూసుకుపోతోంది.



## ఉస్తాద్ ప్రచారంలో బిజీగా హరీష్ శంకర్

ప్రస్తుతం హరీశ్ శంకర్ 'ఉస్తాద్ భగత్ సింగ్' కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. పవన్ కల్యాణ్ హీరోగా తెరకెక్కిన ఈ చిత్రం మార్చి 19న భారీస్థాయిలో విడుదలకు సిద్ధమవుతోంది. దీనిప్రచారంలో భాగంగా దర్శకుడు వరుస ఇంటర్వ్యూలతో బిజీగా ఉన్నారు. తాజాగా ఆయన మాట్లాడుతూ ఈ సినిమా ప్రీలుక్ పోస్టర్ విడుదలైనప్పుడు వచ్చిన రూమర్స్‌పై స్పందించారు. ప్రీలుక్ పోస్టర్‌లో హీరో వెనక నుంచి తీసిన ఫొటో ఉండటంతో అందులో ఉన్నది పవన్ కల్యాణ్ కాదు, హరీశ్ శంకరే స్వయంగా డూప్‌గా నటించారనే వార్తలు వైరల్ అయ్యాయి. టీజర్ విడుదలైన తర్వాత కూడా కొందరు ప్రేక్షకులు ఆయనే డూప్‌గా నటించారని అన్నారు. దీనిపై ఆయన మాట్లాడుతూ.. తాను పవన్ కల్యాణ్‌కు ఎప్పుడూ డూప్‌గా నటించలేదని స్పష్టం చేశారు. ఆ రూమర్లు చూసి తాను బాధ పడలేదని, పవన్‌తో తనను పోల్చడం, తాను ఒక స్టార్ హీరోలా కనిపిస్తున్నానని జనం అనుకోవడం తనకు సంతోషాన్నిచ్చిందని సరదాగా అన్నారు. చిత్ర పరిశ్రమలో బాడీ డూప్‌ను ఎందుకు ఉపయోగిస్తారనే విషయంపై కూడా హరీశ్ శంకర్ వివరణ ఇచ్చారు. షూటింగ్ సమయంలో హీరోలకు చిన్న గాయం తగిలినా షూటింగ్ షెడ్యూల్స్ మొత్తం అస్తవ్యస్తమవుతాయని, దీనివల్ల నిర్మాతలకు కోట్ల రూపాయల నష్టం వస్తుందని ఆయన తెలిపారు. అందుకే హీరోల భద్రతను దృష్టిలోఉంచుకుని, రిస్క్ ఎక్కువగా ఉండే సన్నివేశాల్లోనే డూప్‌ను వాడతారని ఆయన వివరించారు.





## అక్షయ్ కుమార్ భూత్ బంగ్లా టీజర్ విడుదల

బాలీవుడ్ స్టార్ అక్షయ్ కుమార్, దర్శకుడు ప్రియదర్శన్ కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవైటెడ్ హారర్-కామెడీ చిత్రం 'భూత్ బంగ్లా'. సుమారు 14 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత వీరిద్దరి కాంబోలో ఈ సినిమా వస్తుండటంతో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే తాజాగా ఈ చిత్రం నుంచి టీజర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'భూల్ భులైయా' వంటి క్లాసిక్ సినిమాను గుర్తు చేస్తూ, భయం మరియు నవ్వుల మేళవింపుతో ఈ టీజర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. మంగళపూర్ అనే గ్రామంలోని 'వధుసురుడు' అనే మిస్టరీ చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుందని టీజర్ ద్వారా చిత్ర బృందం స్పష్టం చేసింది. ఈ చిత్రంలో అక్షయ్ కుమార్‌తో పాటు టబు, పరేష్ రావల్, రాజ్‌పాల్ యాదవ్, వామిఖ గబ్బి, మిథిలా పాల్కర్ వంటి భారీ తారాగణం నటిస్తుండగా, ప్రీతమ్ అద్భుతమైన సంగీతాన్ని అందించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని రామోజీ ఫిలిం సిటీలో కీలక సన్నివేశాల చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఏప్రిల్ 10న వరల్డ్ వైడ్‌గా విడుదల కాబోతుంది.



## అందుకే బాలీవుడ్‌ను వదిలేశా!

కెరీర్ గొప్ప దశలో ఉన్నప్పుడే బాలీవుడ్‌కు గుడ్‌బై చెప్పి హాలీవుడ్ వైపు అడుగులు వేసింది అగ్ర కథానాయిక ప్రియాంకచోప్రా. వరుస విజయాల్లో ఉన్నప్పుడు హిందీ చిత్రసీమను వదిలి వెళ్లడం సరైన నిర్ణయం కాదనే మాటలు వినిపించాయి. అయినా అవేవీ లెక్కచేయకుండా హాలీవుడ్‌లో అడుగుపెట్టి గ్లోబల్ స్టార్‌గా ఎదిగింది ప్రియాంకచోప్రా. బాలీవుడ్‌లో సూపర్‌ఫామ్‌లో ఉన్నప్పుడు హాలీవుడ్‌కు ఎందుకు వెళ్లాల్సి వచ్చిందనే విషయంపై తాజా ఇంటర్వ్యూలో ఈ భామ స్పందించింది. కంఫర్ట్‌జోన్ నుంచి బయటపడినప్పుడే నిజమైన సక్సెస్‌ను చూస్తామని, రిస్క్ అని తెలిసినా తాను ధైర్యంగా హాలీవుడ్‌లోకి వెళ్లానని చెప్పింది. 'నాకెందుకో హిందీ సినిమా పరిధి చాలా చిన్నగా అనిపించింది. అప్పటికే ఐశ్వర్యరాయ్‌లాంటి తారలకు హాలీవుడ్‌లో మంచి గుర్తింపు వుంది. ఆమెను స్ఫూర్తిగా తీసుకొని హాలీవుడ్‌లో అదృష్టాన్ని పరీక్షించుకున్నా. నటిగా నా పరిధిని విస్తరించుకోవాలనే తపనతో పాటు సినిమాలపరంగా కొత్త ప్రపంచాన్ని వీక్షించాలనే పట్టుదలే హాలీవుడ్ వైపు ఆకర్షించింది. కష్టపడే తత్వం, నా శక్తిసామర్థ్యాలపై నమ్మకమే నన్ను అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టింది' అని చెప్పింది ప్రియాంకచోప్రా. ఇటీవలే యాక్షన్ థ్రిల్లర్ 'ది బ్లఫ్' చిత్రంతో ప్రేక్షకుల్ని పలకరించింది ప్రియాంక. ప్రస్తుతం ఈ భామ తెలుగులో మహేష్‌బాబు సరసన 'వారణాసి' చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే.




## డిఫరెంట్‌గా దీవానా మూవీ టీజర్

టాలీవుడ్ యువ నటుడు హర్షిత్ రెడ్డి హీరోగా, స్నేహ మణిమేగలై హీరోయిన్‌గా నటిస్తున్న చిత్రం 'దీవాన'. ఈ చిత్ర టీజర్‌ను నేడు విడుదల చేశారు మేకర్స్. టీజర్ ఆరంభం నుంచి ముగింపు వరకు చాలా ఇంటెన్స్‌గా సాగింది. ఒక యువకుడు ప్రేమలో పడి, ఆ ప్రేమ కోసం ఏ స్థాయికైనా వెళ్లే 'దీవాన' గా ఎలా మారాడనేది ఈ చిత్ర ప్రధానాంశం. ముఖ్యంగా ఎంత అందంగా ఉంటే అంత సతాయిస్తారురా పోరీలు' మరియు 'అది నీ ప్రాణం పీక్క తినకపోతే నన్ను అడుగురా' వంటి డైలాగులు యువతను బాగా ఆకట్టుకుంటున్నాయి. తెలంగాణ అర్బన్ నేపథ్యంలో సాగే ఈ స్వచ్ఛమైన మరియు ఇంటెన్స్ లవ్ స్టోరీలో హర్షిత్ రెడ్డి తన నటనతో మరియు డైలాగ్ డెలివరీతో ఆకట్టుకున్నాడు.ఈ సినిమాకు శ్రీకాంత్ సంగిశెట్టి దర్శకత్వం వహించగా.. అర్హ మీడియా, వీ స్టూడియోస్ బ్యానర్స్‌లపై వాసుదేవ్ కొప్పినేని, శ్రీదేవి కార్యంపూడి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సమ్మర్ కానుకగా ఏప్రిల్ 14న ఈ చిత్రం రాబోతుండగా.. ప్రముఖ నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్స్ ఈ మూవీని డిస్టిబ్యూషన్ చేస్తుం

Printed, Published & Owned by Dr. JBL, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S), RNI NO. APTEL/2006/19056

# స్పోర్ట్స్

# తొలి పోరులో బెంగళూరుతో హైదరాబాద్ ఢీ!

## ఐపీఎల్ 2026 సమరానికి షెడ్యూల్ ఖరారు

## డిఫెండింగ్ ఛాంపియన్‌తోనే ఆరంభం

## బెంగళూరు వేదికపై కొనసాగుతున్న సస్పెన్స్




క్రికెట్ ప్రేమికులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ 19వ సీజన్‌కు నగారా మోగింది. టాటా ఐపీఎల్ 2026 తొలి దశ షెడ్యూల్‌ను బీసీసీఐ బుధవారం విడుదల చేసింది. మార్చి 28 నుండి ఏప్రిల్ 12 వరకు జరగనున్న మొదటి దశలో మొత్తం 20 మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. మూడు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నందున ఎన్నికల తేదీలు ప్రకటించిన తర్వాతే ఐపీఎల్ పూర్తి షెడ్యూల్‌ను విడుదల చేస్తామని బోర్డు ప్రకటించింది. మార్చి 28న బెంగళూరులోని ఎం. చిన్నస్వామి స్టేడియం వేదికగా జరగనున్న ఆరంభ వేడుకల అనంతరం తొలి పోరు ప్రారంభం కానుంది. డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు , మాజీ ఛాంపియన్ సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లు తొలి మ్యాచ్‌లో తలపడనున్నాయి. సొంత గడ్డపై ఆర్‌సీబీ బోణీ కొట్టాలని చూస్తుండగా, హైదరాబాద్ తమ సత్తా చాటేందుకు సిద్ధమైంది. మరుసటి రోజు ఆదివారం ముంబైలోని వాంఖడే స్టేడియంలో ముంబై ఇండియన్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ జట్లు ఢీకొంటాయి. తొలి దశలో మొత్తం నాలుగు డబుల్ హెడర్ అంటే రోజుకు రెండు మ్యాచ్‌లు మ్యాచ్‌లు ఉన్నాయి. మధ్యాహ్నం మ్యాచ్‌లు 3:30 గంటలకు, రాత్రి మ్యాచ్‌లు 7:30 గంటలకు ప్రారంభమవుతాయి. ఏప్రిల్ 4న సీజన్‌లో తొలి డబుల్ హెడర్ జరగనుంది. ఆ రోజు మధ్యాహ్నం ఢిల్లీ వర్సెస్ ముంబై, రాత్రి గుజరాత్ టైటాన్స్ వర్సెస్ రాజస్థాన్ రాయల్స్ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ సీజన్‌లో మ్యాచ్‌లు బెంగళూరు, ముంబై, గౌహతి, న్యూ చండీగఢ్, లక్నో, కోల్‌కతా, చెన్నై, ఢిల్లీ, అహ్మదాబా, హైదరాబాద్‌లలో జరగనున్నాయి. రాజస్థాన్ రాయల్స్ తమ తొలి హోమ్ మ్యాచ్‌లను గౌహతిలో ఆడనుంది. అక్కడ చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్‌తో తలపడనుంది. పంజాబ్ కింగ్స్ తమ హోమ్ మ్యాచ్‌లను న్యూ చండీగఢ్‌లోని పీసీఏ స్టేడియంలో ఆడుతుంది. ఆర్‌సీబీకి బెంగళూరుతో పాటు రాయ్‌పూర్ రెండో హోమ్ గ్రౌండ్‌గా ఉండగా, పంజాబ్ కింగ్స్ ధర్మశాలలో, రాజస్థాన్ రాయల్స్ జైపూర్‌లో కూడా తమ హోమ్ మ్యాచ్‌లను ఆడనున్నాయి. అయితే బెంగళూరులో జరగాల్సిన మ్యాచ్‌లు కర్ణాటక ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ క్లియరెన్స్‌పై ఆధారపడి ఉన్నాయి. మార్చి 13న ఈ కమిటీ చిన్నస్వామి స్టేడియాన్ని సందర్శించి, మ్యాచ్ నిర్వహణకు ఏర్పాట్లు సరిగ్గా ఉన్నాయో లేదో పరిశీలిస్తుంది. పూర్తిస్థాయి మాక్ డెమాన్‌స్ట్రేషన్ తర్వాతే బెంగళూరు వేదికపై తుది నిర్ణయం వెలువడనుంది.

## స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి అగ్రస్థానం గల్లంతు

గతకొన్ని రోజులుగా బౌలింగ్? విభాగంలో టాప్?లో కొనసాగిన టీమ్‌ఇండియా స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి అగ్రస్థానం గల్లంతైంది. ఈ టోర్నీలో పేలవ ఫామ్ కొనసాగించిన వరుణ్? రెండో స్థానానికి పడిపోయాడు. అఫ్గానిస్థాన్ బౌలర్ రషీద్ ఖాన్ ఒక స్థానం మెరుగుపర్చుకొని 753 రేటింగ్స్?తో టాప్? ప్లేస్?లోకి దూకుకెళ్లాడు. వరుణ్ 740 రేటింగ్స్?తో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. గతవారం 771 రేటింగ్స్?తో టాప్?లో ఉన్న వరుణ్ ఈవారం 31 పాయింట్లు కోల్పోయాడు. దీంతో వరల్డ్?కప్ నెగ్గిన జోష్?లో ఉన్న అతడికి ఒక రకంగా ఇది నిరాశే అని చెప్పవచ్చు!టీ20 వరల్డ్?కప్ హీరో, టీమ్‌ఇండియా యంగ్ బ్యాటర్ సంజు శాంసన్ మరోసారి ఐసీసీ ర్యాంకింగ్స్?లో సత్తా చాటాడు. ఈ టోర్నీలో అద్భుత ప్రదర్శనతో 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ' అవార్డు దక్కించుకున్న అతడు, తాజా ర్యాకింగ్స్?లో ఏకంగా 18 స్థానాలు మెరుగుపర్చుకున్నాడు. దీంతో ప్రస్తుతం అతడు 637 రేటింగ్ పాయింట్స్?తో 22వ స్థానంలో కొనసాగుతున్నాడు. ఇక ఫైనల్?లో న్యూజిలాండ్?పై హాఫ్ సెంచరీ సాధించడంతో భారత ఓపెనర్ అభిషేక్ శర్మ తన అగ్రస్థానం పదిలంగా ఉంచుకున్నాడు. అదే మ్యాచ్?లో అర్ధ శతకం చేసిన ఇషాన్ కిషన్ కూడా రెండు స్థానాలు మెరుగుపర్చుకొని రెండో స్థానానికి ఎగబాకాడు.టీ20 ర్యాంకింగ్స్?లో టీమ్‌ఇండియా యువ ఆటగాళ్ల మధ్య తీవ్ర పోటీ ఏర్పడింది. తాజా ర్యాకింగ్స్?లో 875 రేటింగ్స్?తో అభిషేక్ టాప్?లో ఉన్నప్పటికీ, 871 రేటింగ్స్?తో ఇషాన్ కిషన్ అతడికి చాలా దగ్గరగా వచ్చాడు. కేవలం నాలుగు రేటింగ్స్? దూరంలో నిలిచి రెండో ప్లేస్?లో కొనసాగుతున్నాడు. అయితే భారత్?కు మరో రెండు నెలల దాకా టీ20 మ్యాచ్?లు లేకపోవడం వల్ల వీళ్ల పాయింట్లు అలాగే ఉండనున్నాయి. కానీ అదే సమయంలో ఇతర దేశాలు ఆయా సిరీస్?ల్లో ఆడనున్నాయి. దీంతో రానున్న రోజుల్లో ర్యాంకుల్లో మార్పులు జరిగే ఛాన్స్ ఉంది. ? సూపర్ 8లో వెస్టిండీస్? మ్యాచ్?కు ముందు శాంసన్ టీ20 ర్యాకింగ్స్?లో 65వ స్థానంలో ఉన్నాడు. అయితే ఆ మ్యాచ్?లో వీరోచిత ఇన్నింగ్స్?తో జట్టును గెలిపించిన తర్వాత అతడు ఏకంగా 25 స్థానాలు ఎగబాకి 40వ ర్యాంక్?కు చేరుకున్నాడు. ఇక గతవారం సెమీఫైనల్?లో ఇంగ్లాండ్, ఫైనల్?లో కివీస్?పై వరుస హాఫ్ సెంచరీలతో తాజాగా మరో 18 స్థానాలు మెరుగుపర్చుకొని 637 రేటింగ్స్?తో ఇప్పుడు 22వ ర్యాంకుకు చేరుకున్నాడు. అయితే? శాంసన్?కు టీ20 కెరీర్?లో ఇదే అత్యుత్తమమైన రేటింగ్ పాయింట్లు కావడం విశేషం.ఈ టోర్నీలో రాణించిన కివీస్ బ్యాటర్ టిమ్ సీఫెర్ట్ నాలుగు స్థానాలు ఎగబాకి ఆరో స్థానానికి చేరుకున్నాడు. అయితే టీమ్‌ఇండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మాత్రం రెండు ప్లేస్?లు దిగజారి 9వ ర్యాంక్?కు పడిపోయాడు. అలాగే సెమీఫైనల్?లో భారత్?పై సెంచరీ చేసిన జాకబ్ బెతెల్ 17 స్థానాలు ఎగబాకి 16వ ర్యాంక్?కు చేరుకోగా, ఇంకో సెమీస్?లో సౌతాఫ్రికాపై 33 బంతుల్లోనే శతకం బాదిన ఫిన్ అలెన్ 7 ప్లేస్?లు మెరుగుపడి 20వ స్థానం దక్కించుకున్నాడు.





## హార్దిక్ పాండ్యాపై కేసు నమోదు..

భారత క్రికెటర్ హార్దిక్ పాండ్యాపై జాతీయ జెండాను అవమానించారనే ఆరోపణలతో పుణే పోలీసులకు ఫిర్యాదు నమోదైంది. పుణేలోని శివాజీ నగర్ పోలీస్ స్టేషన్‌లో అడ్వకేట్ వజీద్ ఖాన్ ఈ ఫిర్యాదు దాఖలు చేసినట్లు అధికారులు తెలిపారు. అహ్మదాబాద్‌లో జరిగిన టీ20 వరల్డ్ కప్ ఫైనల్ అనంతరం భారత జట్టు విజయోత్సవాలు జరుపుకుంటున్న సమయంలో ఈ ఘటన జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు ప్రకారం హార్దిక్ పాండ్యా జాతీయ త్రివర్ణ పతాకాన్ని తన శరీరానికి చుట్టుకొని మైదానంలో అనుచితంగా ప్రవర్తించారని ఆరోపించారు. ఈ చర్య భారత జాతీయ జెండా గౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. దేశ పౌరులందరికీ జాతీయ పతాక గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ఉందని ఫిర్యాదుదారు పేర్కొన్నారు. అయితే ఈ ఫిర్యాదుపై పోలీసులు ఇంకా వివరాలు వెల్లడించలేదు. ఇక క్రికెట్ పరంగా చూస్తే టీ20 వరల్డ్ కప్ 2026లో హార్దిక్ పాండ్యా అద్భుత ప్రదర్శన కనబరిచారు. బ్యాటింగ్, బౌలింగ్ రెండింట్లోనూ కీలక పాత్ర పోషించారు. టోర్నమెంట్ మొత్తం మీద ఆయన తొమ్మిది వికెట్లు పడగొట్టడంతో పాటు రెండు అర్ధశతకాలు కూడా నమోదు చేశారు. ముఖ్యంగా నమీబియాపై జరిగిన మ్యాచ్‌లో 28 బంతుల్లో 52 పరుగులు చేసి జట్టుకు కీలక విజయాన్ని అందించారు.పాండ్యా ప్రదర్శనను గుర్తించిన ఐసీసీ అతన్ని 2026 టీ20 వరల్డ్ కప్ టీమ్ ఆఫ్ ది టోర్నమెంట్‌లో చోటు కల్పించింది. ఇది అతని ఆల్‌రౌండ్ ప్రతిభకు మరో గుర్తింపుగా భావిస్తున్నారు. అహ్మదాబాద్‌లో జరిగిన ఫైనల్లో న్యూజిలాండ్‌పై 96 పరుగుల తేడాతో భారత్ ఘన విజయం సాధించింది. ఈ విజయంతో టీమిండియా వరుసగా రెండోసారి టీ20 వరల్డ్ కప్‌ను కైవసం చేసుకుంది. ఇక మొత్తంగా మూడు సార్లు ఈ టైటిల్‌ను గెలిచిన తొలి జట్టుగా భారత్ చరిత్ర సృష్టించింది. 2007లో తొలి టీ20 వరల్డ్ కప్ గెలిచిన భారత్, ఇప్పుడు మళ్లీ తన ఆధిపత్యాన్ని చాటుకుంది.




## టీ20 టీమ్ కెప్టెన్‌గా సంజూ శాంసన్..?

సొంతగడ్డపై టీ20 ప్రపంచకప్ గెలుపుతో టీమిండియా సంబరాల్లో మునిగిపోయింది. మూడుసార్లు టీ20 వరల్డ్ కప్ గెలిచిన తొలి జట్టుగా భారత్ నిలవగా.. సొంతగడ్డపై టైటిల్ గెలిచిన మొదటి జట్టుగా రికార్డు క్రియేట్ చేసింది. 2024 వరల్డ్ కప్ విజయం తరువాత రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి స్టార్లు రిటైర్‌మెంట్ ప్రకటనతో యువ జట్టు ఎలా ఆడుతుందో అని అనుమానాలు ఉన్నా.. అన్ని ఫటాపంచల్ చేస్తూ విశ్వవిజేతగా నిలిచింది. రోహిత్ శర్మ నుంచి టీ20 పగ్గాలు అందుకున్న సూర్యకుమార్ యాదవ్.. ఇప్పటివరకు ఒక్క సిరీస్ కూడా ఓడిపోని కెప్టెన్‌గా కొనసాగుతున్నాడు. ఆసియా కప్, టీ20 ప్రపంచకప్ గెలిపించిన కెప్టెన్‌గా నిలిచాడు. ఇక భవిష్యత్ ప్లానింగ్స్ గురించి ప్రస్తుతం చర్చలు మొదలయ్యాయి. ప్రస్తుతం సూర్యకుమార్ యాదవ్ 35 ఏళ్లు కాగా.. 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్, వచ్చే వరల్డ్ కప్ (2028) నాటికి సూర్యకు 37 ఏళ్లు వస్తాయి. అప్పటివరకు టీమ్‌లో ఉన్నా.. కెప్టెన్‌గా కొనసాగుతాడా లేదా అనేది అనుమానమే. ప్రస్తుతం ఉన్న టీమ్‌లో కెప్టెన్సీ రేసులో చాలామంది పేర్లు వినిపిస్తున్నాయి. ముందు వరుసలో మాత్రం సంజూ శాంసన్ పేరు మారుమోగిపోతుంది. టీ20 వరల్డ్ కప్ సూపర్-8 ఆఖరి మ్యాచ్ నుంచి ఫైనల్ మ్యాచ్ వరకు హ్యాట్రిక్ హాఫ్ సెంచరీలతో భారత్ విశ్వవిజేతగా నిలవడంలో కీలక పాత్ర పోషించాడు. ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ టీమ్‌కు కెప్టెన్‌గా పని చేసిన అనుభవం ఉండడం.. టీమ్‌లో సీనియర్ ప్లేయర్ కావడంతో సూర్యకు సరైన వారసుడు సంజూనే అని మాజీలు విశ్లేషిస్తున్నారు. కొత్త కెప్టెన్సీ అంశంపై భారత మాజీ క్రికెటర్ మొహమ్మద్ కైఫ్ మాట్లాడుతూ.. టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో టీమిండియా కెప్టెన్సీకి సంజూ శాంసన్ బలమైన పోటీదారుడని చెప్పాడు. సంజూకు కెప్టెన్ ఉండాల్సిన అనుభవం, అవగాహన ఉందని అన్నాడు. క్లిష్ట సమయాల్లో కూడా ఎలాంటి టెన్షన్ లేకుండా సంజూ నిర్ణయాలు తీసుకోగలడని పేర్కొన్నాడు. సూర్య తరువాత కొత్త కెప్టెన్ ఎవరు అని ఇప్పుడే చెప్పడం కష్టమైనా.. సంజూ మాత్రం ముందు వరుసలో ఉంటాడని అన్నాడు. కెప్టెన్ ప్రపంచాన్ని చూసిన వ్యక్తి అయి ఉండాలని.. బౌలింగ్‌లో మార్పులు.. సరైన ప్లేయర్లను తుది జట్టులో ఆడించడం.. ఫామ్‌లో లేని ఆటగాళ్లకు మద్దతుగా ఉండడం ఇవన్నీ ఆటలో భాగమని కెప్టెన్‌గా తెలిసి ఉండాలన్నాడు. "సంజూ కచ్చితంగా కెప్టెన్సీ రేసులో ఉంటాడని నేను భావిస్తున్నాను. సూర్య రిటైర్‌మెంటె ప్రకటిస్తే.. సంజూ ఆ స్థానాన్ని భర్తీ చేయగలడు. ఐపీఎల్‌లో చాలా మ్యాచ్‌లకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. రాజస్థాన్ రాయల్స్‌ను 2022 ఫైనల్‌కు నడిపించాడు. సంజూ వయస్సు కేవలం 31 సంవత్సరాలు. టీమిండియా తదుపరి కెప్టెన్ కావచ్చు" అని కైఫ్ చెప్పుకొచ్చాడు. ప్రస్తుతం టీమ్‌లో ఉన్న వారిలో హార్దిక్ పాండ్యాకు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించి.. మళ్లీ తీసేశారు. వైస్ కెప్టెన్‌గా ఉన్న అక్షర్ పటేల్‌కు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించే అవకాశాలు తక్కువే. మిగిలిన వారందరితో పోల్చినా.. సంజూనే బెస్ట్ ఆప్షన్‌గా కనిపిస్తున్నాడని ఇతర మాజీ ప్లేయర్లు కూడా అంటున్నారు.




## అర్ష్‌దీప్ సింగ్‌ను వెనకేసుకొచ్చిన గంభీర్..!



టీ20 వరల్డ్ కప్ 2026 ఫైనల్ మ్యాచ్‌లో అర్ష్‌దీప్ సింగ్ మరియు మిచెల్ మధ్య జరిగిన వాగ్వాదంపై టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ కీలక వ్యాఖ్యలు చేశాడు. అర్ష్‌దీప్ సింగ్.. మిచెల్‌కు క్షమాపణ చెప్పాల్సిన అవసరం లేదన్నాడు గంభీర్. మార్చి 8వ తేదీ, ఆదివారం రోజున అహ్మదాబాద్‌లోని నరేంద్రమోదీ స్టేడియంలో భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య టీ20 ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ జరిగిన సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ ఇన్నింగ్స్ 11వ ఓవర్‌ను.. భారత పేసర్ అర్ష్‌దీప్ సింగ్ వేశాడు. అప్పుడు క్రీజ్‌లో న్యూజిలాండ్ బ్యాటర్ డారిల్ మిచెల్ ఉన్నాడు. ఇక అర్ష్‌దీప్ సింగ్ వేసిన రెండు బంతులను వరుసగా డారిల్ మిచెల్ సిక్సర్లుగా మలిచాడు. దీంతో అర్ష్‌దీప్ తీవ్ర అసహనానికి గురయ్యాడు. ఆ తరువాత వేసిన మూడవ బంతిని మిచెల్ షాట్ ఆడగా.. బాల్‌ను అర్ష్‌దీప్ ఆపాడు. వెంటనే బాల్‌ను వికెట్ల పైకి విసరకుండా మిచెల్ పైకి విసిరాడు. దీనిపై మిచెల్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఏంటి అన్నట్లుగా అర్ష్‌దీప్ సింగ్‌ను ప్రశ్నించాడు. అర్ష్‌దీప్ మాత్రం ఏమీ పట్టించుకోకుండా, కనీసం క్షమాపణ చెప్పకుండా తిరిగి తరువాత బంతిని వేసేందుకు వెళ్లిపోయాడు. అయితే.. టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మాత్రం డారిల్ మిచెల్ వద్దకు వెళ్లి అతడికి సర్దిచెప్పాడు. అంపైర్ నచ్చజెప్పడంతో ఓవర్ పూర్తి కాగానే మిచెల్‌కు అర్ష్‌దీప్ సింగ్ క్షమాపణ చెప్పాడు. తాను కావాలని బంతిని విసరలేదని, బాల్ స్వింగ్ అయి మిచెల్‌ను తాకిందని, ఇందుకు అతడికి సారీ చెప్పినట్లు మ్యాచ్ అనంతరం అర్ష్‌దీప్ సింగ్ చెప్పాడు. అయితే ఈ విషయంపై టీమిండియా హెడ్ కోడ్ గౌతమ్ గంభీర్ మాట్లాడుతూ.. దేశం కోసం ఆడేటప్పుడు ఆటగాళ్లు దూకుడుగా ఉండటం సహజమని అన్నారు. వరుసగా రెండు సిక్సర్లు కొట్టినప్పుడు బౌలర్ నుంచి ప్రతిస్పందన రావడం సాధారణమని.. క్షమాపణ చెప్పకపోయినా ఎలాంటి సమస్య ఉండదని గంభీర్ అభిప్రాయపడ్డారు. అలాగే గతంలో కూడా ఇలాంటి ఘటనలు జరిగేవని, అయితే ఇప్పుడు సోషల్ మీడియా కారణంగా ప్రతి చిన్న విషయం కూడా పెద్దగా మారుతోందని గంభీర్ వ్యాఖ్యానించారు. ఇక ఈ ఘటన తర్వాత ఐసీసీ (ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్) అర్ష్‌దీప్ సింగ్‌పై మ్యాచ్ ఫీజులో 15 శాతం జరిమానా విధించింది. అదేవిధంగా ఒక డీమెరిట్ పాయింట్ కూడా ఇచ్చింది. అయితే గత 24 నెలల్లో ఇది మొదటి తప్పు కావడంతో అతనిపై పెద్ద శిక్ష విధించలేదు.